www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 227 | మంగళవారం | 6 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00


(ఫైల్ ఫోటో)

ఈ ఘాతుకాన్ని ఏమనాలి?

భార్యను, ఇద్దరు పిల్లలను గొంతు నులిమి హతమార్చిన దారుణ అమానుషం

హైదరాబాద్ శివారు మీర్‌పేట పిఎస్ పరిధిలో మూడు కుటుంబ హత్యలు

తాగుడుకు బానిసై భార్యతో తరుచూ గొడవపడి బలితీసుకున్న భర్త/తండ్రి

మన తెలంగాణ/ బాలాపూర్

భార్యను, ఇద్దరు పిల్లలను అతి దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్ నగరశివారు బాలాపూర్ మండలం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెల గూడలో సోమవారం చోటు చేసుకుంది. మహబూబ్ నగర్‌కు చెందిన జ్యోతితో ఎనిమిదేళ్ళ క్రితం వికారాబాద్, కుల్కచర్లకు చెందిన హరేందర్‌గౌడ్ వివాహం జరిగింది. అప్పటి నుంచి వారు జిల్లెలగూడలోని సుమిత్ర ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్నారు. వీరికి కుమారుడు అభితేజ్ (7), కూతురు సహస్ర (4) ఉన్నారు. స్థానిక భాష్యం పాఠశాలలో అభిజేత్ 2వ తరగతి, సహస్ర యుకెజి చదువుతున్నారు.. హరేందర్‌గౌడ్ మలక్‌పేట్‌లో తరువాయి 6లో

మాలెలో ఎమర్జెన్సీ

- మరింత ముదిరిన రాజకీయ సంక్షోభం
- ప్రపంచ దేశాలు కలగజేసుకోవాలని విపక్షం విజ్ఞప్తి

11 లో

పాస్‌బుక్కుల వ్యథ

కొత్త పట్టాదారు పుస్తకాల ముద్రణ సెక్యూరిటీ ప్రెస్‌కే

ప్రైవేటు సంస్థలు వెనుదిరగడంతో నామినేషన్ పద్ధతిలో ప్రభుత్వ సంస్థకు కేటాయించాలని నిర్ణయం?

రోజుకు 7 వేలకు మించి ముద్రించడం సాధ్యం కాని పరిస్థితి

మార్చి 11 పంపిణీ ముహుర్తానికి గండం

ఆ రోజున తూతూ మంత్రంగా పని కానిచ్చే సూచన



మన తెలంగాణ / హైదరాబాద్ : పట్టాదారు పాస్‌బుక్‌ల ముద్రణకు ప్రైవేటు సంస్థలు ముందుకు రాకపోవడంతో నామినేషన్ పద్ధతి మీద సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు అప్పగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఒక్కో పుస్తకానికి సుమారు రూ.200 చొప్పున మొత్తం రూ.140 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఇంత పెద్దమొత్తంతో ముడిపడిన వ్యవహారమైనందున మంత్రివర్గ ఆమోదం అవసరమని భావించిన ప్రభుత్వం, మంత్రులకు ఈ విషయానికి సంబంధించిన నోట్‌ను పంపిణీ చేసిన తర్వాత నిర్ణయం ఖరారు చేయాలని భావిస్తోంది. ఒకటి, రెండు రోజుల్లోనే ఈ లాంఛనాలను పూర్తి చేసి ప్రింటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యేలా రెవెన్యూశాఖ సన్నద్ధమవుతోంది. రోజుకు ఏడు వేల పుస్తకాలను మాత్రమే ముద్రించడం సాధ్యమవుతుందని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఇప్పటికే స్పష్టం చేయడంతో 72 లక్షల పాస్ పుస్తకాలను ముద్రించాలన్న లక్ష్యాన్ని పూర్తి చేయడంపై ఆలోచనలు సాగుతున్నాయి. అన్ని గ్రామాల్లో మార్చి 11వ తేదీన పట్టాదారు పాసుపుస్తకాల ముద్రణ, పంపిణీపై ముఖ్యమంత్రి ఆదివారం సాయంత్రం రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి 'ఇవన్నీ త్వరితగతిన అనుకున్న సమయం తరువాయి 6లో

ఖాప్ షటప్!

మేజర్ల పెళ్లికి ధోకా లేదు

ఎవరూ జోక్యం చేసుకోరాదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: మేజర్లయిన అమ్మాయి, అబ్బాయి పరస్పర సమ్మతితో వివాహం చేసుకుంటే అందులో కల్పించుకునే హక్కు ఎవరికీ లేదని సుప్రీం కోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఖాప్ పంచాయితీలపై నిషేధం విధించాలని, పరువు హత్యలను నివారించేందుకు మార్గదర్శకాలను జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన తరువాయి 6లో



వికేంద్రీకరణే

పాలనాధికారాలు పంచిపెట్టినప్పుడే పథకాలు వేగంగా అమలవుతాయి

అధికార వికేంద్రీకరణ సూత్రాన్నే బలంగా నమ్ముతున్నాం : కెటిఆర్

మన తెలంగాణ/ హైదరాబాద్: పాలన వికేంద్రీకరణ ద్వారానే ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా చేరుతాయని మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. అందుకే తమ ప్రభుత్వం పరిపాలనలో వికేంద్రీకరణ సూత్రాన్ని బలంగా నమ్ముతోందన్నారు. ''తెలంగాణ మున్సిపల్ కమిషనర్ల డైరీ–2018''ని సచివాలయంలో సోమవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్‌ఎంసిలోనూ మరిన్ని సర్కిళ్లను, జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ శాఖలో ప్రవేశపెట్టిన పలు సంస్కరణల అమలులో మున్సిపల్ కమిషనర్లు కీలక పాత్ర పోషించాలని, తాము పనిచేస్తున్న మున్సిపాలిటీలలో తమదైన ప్రత్యేక ముద్రను చాటు కోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలను, కార్పొరేషన్లకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించామని చెప్పారు. అర్బన్ మిషన్ భగీరథ ద్వారా తరువాయి 6లో

పకోడీలు అమ్మితే ఏం?

ఆ వ్యక్తే పెద్ద వ్యాపారవేత్త కావచ్చు, చాయ్‌వాలా ప్రధాని కాలేదా

రాజ్యసభలో తొలి ప్రసంగంలోనే కాంగ్రెస్‌పై అమిత్ షా నిప్పులు



న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా సోమవారం రాజ్యసభలో తొలిసారి ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఆరంభిస్తూ... ఉపాధిపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రకటనను ప్రతిపక్షాలు విమర్శించడాన్ని తన ప్రసంగంలో తిప్పికొట్టారు. 'పకోడీలు అమ్మడమేమీ సిగ్గుమాలిన పనికాదు. నేడు పకోడీలు అమ్మే వ్యక్తే రేపు పెద్ద వ్యాపారవేత్త కావొచ్చు. ఒకనాడు చాయ్‌వాలా కుమారుడైన వ్యక్తి నేడు దేశానికి ప్రధానయ్యారు. స్వయోపాధి చేసుకుంటున్న వ్యక్తిని మీరు బిచ్చగాళ్లతో పోల్చకూడదు' అని అమిత్ షా అన్నారు. ఇటీవల జి న్యూస్ టివి ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమేనని, రోజుకు రూ.200 సంపాదించుకునే వ్యక్తి ఖాతాలోకి రారని, కానీ వాస్తవానికి అలాంటి వారే పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారన్నారు. మోడీ ప్రసంగాన్ని కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం విమర్శిస్తూ ' ఉద్యోగాలు ఎలా సృష్టించాలో ప్రభుత్వానికి తెలియడంలేదు. పకోడీలు అమ్ముకోవడమే ఉద్యోగమైతే, లాజిక్ ప్రకారం అడుక్కోవడం కూడా ఉద్యోగమే కాగలదు. పేదలు లేక వికలాంగులు విధిలేక అడుక్కుంటున్నారు. వారిని కూడా ఉద్యోగులుగానే లెక్కించాల్సి ఉంటుంది. ఓ వైపు నిరుద్యోగం పెరిగిపోతుంటే ఏమి చేయాలో ప్రభుత్వానికి తెలియడం లేదు.' అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన విమర్శలను అమిత్ షా తన రాజ్యసభ ప్రసంగంలో తిరస్కరించారు. ఏడు దశాబ్దాల తన పాలనలో భారత ప్రజలకు సాయం చేయడంలో తరువాయి 6లో



చీలిక, భయపెట్టడం బిజెపి ఆయుధాలు

- నేమ్ చేంజరేగానీ, గేమ్ చేంజర్ కాదు
- పాత పథకాల పేర్లు మారుస్తోంది
- ప్రతిపక్ష నేతలను ఉగ్రవాదులన్నట్టు చూస్తూ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోంది
- దానివన్నీ అసంపూర్తి వాగ్దానాలే
- రాజ్యసభలో ధ్వజమెత్తిన గులామ్‌నబీ, ఇతర విపక్ష నేతలు

10 లో

2 దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల తీవ్రవాది యెమెన్‌లో అరెస్టు

కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలోనే శ్రీనివాస్ హత్య
- మంత్రి జగదీశ్ రెడ్డి 2

10 తుపాకీ పేల్చి దుండగులను హడలెత్తించిన జర్నలిస్టు భార్య

రైలు పట్టాలు తొలగించిన మావోయిస్టులు 7
- ఆరు బోగీలు పల్టీ
- బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ పేల్చివేత

కుంచెపోటు



ప్రభుత్వోద్యోగానికి డిగ్రీ పనికిరాదట, పకోడీలమ్మటం రావాలంట..!



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే

వడ్డీలేని రుణం

వనపర్తి మహిళా గర్జనలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మన తెలంగాణ/ వనపర్తి: తెలంగాణ రాష్ట్రంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణ మండపంలో ఎఐసిసి కార్యదర్శి, వనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మహిళా గర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళా సంఘానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం ఇచ్చి మహిళా సంఘాలను ఆదుకుంటామన్నారు. టిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే లక్ష ఉద్యోగాలిస్తామని, మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వారిని ఆదుకుంటామని ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన సిఎం కెసిఆర్, జనాభాలో సగభాగం ఉన్న మహిళలను పూర్తిగా విస్మరించారని దేశ తరువాయి 6లో


లాల్ రౌత్‌మాన్య   రాఘవ్ శాంతారాం

సెల్‌ఫోన్ కొనివ్వలేదని.. సబ్జెక్టుల్లో ఫెయిలయ్యానని

ఉరేసుకున్న ఇద్దరు విద్యార్థులు

మన తెలంగాణ/ కంటోన్మెంట్/ జవహర్‌నగర్: సెల్‌ఫోన్ కొనివ్వలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కేశవ్ తెలిపిన వివరాల ప్రకారం లాల్ రౌత్‌మాన్య(18) అనే యువకుడు ఇసిఐఎల్ ప్రాంతంలో కంప్యూటర్ కోర్స్ నేర్చుకుంటూ ఓల్డ్ వాసవినగర్‌లోని తన చిన్నమ్మ వద్ద ఉంటున్నాడు. మాన్య తల్లి గంగాన్ ఉజ్జయిలి బ్యూటిషియన్‌గా పనిచేస్తూ కోంపల్లిలో ఉంటుంది. కాగా ఈనెల 4వ తేదీ సాయంత్రం తల్లికి ఫోన్ చేసి కొత్త ఫోన్ కావాలని అడగగా తల్లి జీతం వచ్చిన తర్వాత కొనిస్తానని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన మాన్య బాత్‌రూమ్ కిటికీలకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫోన్ చేయగా ఫోన్ తీయక పోవడంతో చెల్లెలకు ఫోన్ చేసింది. బాత్‌రూమ్‌కు వెళ్లిన సోదరుడు ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి డోర్ తెరిచి చూడగా మెడకు ఉరేసుకొని కనిపించాడు. సమాచారాన్ని పోలీసులకు అందించగా వారు వెంటనే వచ్చి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ తరువాయి 6లో

మోడీతో యుద్ధం చేస్తానని...మౌనమెందుకు?



మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణకు అన్యాయం జరిగితే మోడీనైనా ఎదిరించి యుద్ధం చేస్తానని గొప్పలు చెప్పిన సిఎ కెసిఆర్ బడ్జెట్‌లో అన్యాయం జరుగుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని టిపిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. తెలంగాణ అన్యాయంపైన జంతర్ మంతర్‌పైన ధర్నా చేస్తానని ప్రగల్భాలు పలికిన కేసిఆర్ విభజన హామీల విషయంలో పట్టించుకోకున్నా మాట్లడడం లేదని, ఏ ఒత్తిడితో ఆయన మౌనంగా ఉంటున్నారో చెప్పాలన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిఆర్ ఎస్ బిజెపిలు తోడు దొంగలుగా ప్రవర్తిస్తున్నారని, తెలంగాణకు బడ్జెట్‌లో ఒక్క పైసా రాకున్నా , చట్టంలో విభజన హామీలు అమలు కాకున్నా సిఎం కెసిఆర్ ప్రధాని మోడీకి భయపడుతూ ఫాంహౌజ్‌లో కునుకు తీస్తున్నారని ఆరోపించారు. ఉద్యమంలో తెలంగాణ ఎంపిలమంతా ఎంతో పౌరుషం చూపామని, తమను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత తెలంగాణ ఎంపిలు నిధుల కోసం ప్రభుత్వంపైన ఉద్యమం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్ముంటే రాజీనామాలు చేసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన అన్నారు. సిబిఐ కేసులున్నందునే నరేంద్రమోడీకి సిఎం కెసిఆర్ భయపడుతున్నారని జరుగుతున్న ప్రచారానికి కెసిఆర్ వైఖరి బలం చేకూర్చుతుందన్నారు.

తెలంగాణ స్టడీ సర్కిల్‌లో అవినీతి : విహెచ్



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ స్టడీ సర్కిల్‌లో దళిత, గిరిజనులకు ఉన్నత విద్య శిక్షణ కోసం విడుదల చేసిన నిధుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని మాజీ ఎం.పి వి.హనుమంతరావు ఆరోపించారు. సోమవారంఆయన తెలంగాణ స్టడీ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులకు మద్దతు పలికారు. అనంతరం ఆయన గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నెలకు రూ.11 కోట్లు దళితులవిద్య కోసం ఖర్చు చేస్తున్నట్టు చెప్తున్న ప్రభుత్వం అందులో రూ.3 కోట్లకు బిల్లులు కూడా లేవని, మిగతా అంతా అవినీతి పేరిట దోచుకున్నారని ఆయన అన్నారు.తెలంగాణ స్టడీ సర్కిల్ కమిషనర్ సరిగా వ్యవహరించడం లేదని, దళితులకు కోసం ఖర్చు చేయాల్సిన నిధులు అధికారుల, నాయకుల జేబుల్లోకి పోతున్నాయని ఆయన విమర్శించారు.

జిల్లాలకు నిధులు విడుదల

మనతెలంగాణ/హైదరాబాద్ : అన్ని జిల్లాలకు 14వ ఆర్థిక సంఘం నిధులు చేరుకున్నాయి. రాష్ట్రానికి గత నెల 31న ఈ నిధులను కేంద్రం ఇవ్వగా వాటిని పంచాయతిరాజ్ కమిషనర్ జిల్లాలకు విడుదల చేశారు. రాష్ట్రానికి మొత్తం 464.23కోట్ల రూపాయలు వచ్చాయి. వీటిని ఆయా జిల్లాలకు ఉన్న కేటాయింపుల ప్రకారం పంపిణీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు 12.26 కోట్లు, మంచిర్యాలకు 12.71కోట్లు, నిర్మల్‌కు11.843 కోట్లు, కొమురంభీం ఆసిఫాబాద్‌కు 9.51 కోట్ల చొప్పున పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లాకు 14.34 కోట్లు, జగిత్యాల 15.99 కోట్లు, పెద్దపల్లి 11.02 కోట్లు, రాజన్నసిరిసిల్ల 9.21 కోట్లు, నిజామాబాద్ 23.60 కోట్లు, కామారెడ్డి 18.50కోట్లు, వరంగల్ అర్బన్ 5.96 కోట్లు, వరంగల్ రూరల్ 13.02 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి 13.56 కోట్లు, జనగాం 10.65 కోట్లు, మహబూబాబాద్ 14.91 కోట్లు, ఖమ్మం 21.97 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం 17.45 కోట్లు, మెదక్14.99 కోట్లు, సంగారెడ్డి 25.02 కోట్లు విడుదల చేశారు. అలాగే సిద్దిపేట 16.94 కోట్లు, మహబూబ్‌నగర్ 24.74 కోట్లు, వనపర్తి 10.72 కోట్లు, నాగర్‌కర్నూల్ 15.66 కోట్లు, జోగులాంబ గద్వాల్ 10.72 కోట్లు, నల్గొండ 26.90 కోట్లు, సూర్యాపేట 18.50 కోట్లు, యాదాద్రి 14.22 కోట్లు, వికారాబాద్ 16.76 కోట్లు, మేడ్చల్ 8.91 కోట్లు, రంగారెడ్డి 23.49 కోట్ల చొప్పున విడుదల చేశారు.

దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ళ తీవ్రవాది అరెస్టు

మనతెలంగాణ/హైదరాబాద్‌సిటీబ్యూరో:దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ళ కేసులో నిందితుడిగా ఉన్న లష్కరే తోయిబా తీవ్రవాదిని ఇంటర్ పోల్ పోలీసులు యేమెన్ దేశంలో అరెస్టు చేశారు. షిఫిక్ ముజాబిర్ అనే ఈ తీవ్రవాది గత కొన్నేళ్ళుగా తప్పించుకు తిరుగుతున్న నేపథ్యంలో ఇంటర్ పోల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇది తెలిసిన తెలంగాణ సిఐడి విభాగం అతడిని అదుపులోకి ఇవ్వాలని కోరడంతో సిఐడికి అప్పగించినట్టు తెలిసింది. షఫీక్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించినట్టు సమాచారం.

కొత్త పార్టీపై జోరుగా చర్చ

- **లాభ, నష్టాలపై అధికార, విపక్షాల బేరీజు**
- **నేతల చేరికలపై పార్టీల ఆరా**






మన తెలంగాణ/ హైదరాబాద్ : టిజెఎసి చైర్మన్ కోదండ రామ్ త్వరలో కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు చేసిన ప్రకటనపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కొత్త పార్టీ పెడితే తమకు కలిగే లాభ నష్టాల గురించి పార్టీలు బేరీజు వేసుకుంటున్నాయి. కోదండరామ్ పెట్టే పార్టీతో తమకు ఎలాంటి నష్టం ఉండబోదని అధికార టిఆర్‌ఎస్ ధీమా వ్యక్తం చేస్తునప్పటికీ, ఆ పార్టీలో చేరే వారెవరు అనే అంశంపై ఆరా తీస్తోంది. టిఆర్‌ఎస్ నుండి ఎంఎల్‌ఏలు టచ్‌లో ఉన్నారని జెఎసి వర్గాలు చెబుతుండడంతో తమ పార్టీ వైపు నుండి ఎవరైనా వెళ్ళే అవకాశం ఉందా? అని టిఆర్‌ఎస్ జిల్లాల వారీగా కూపీ లాగుతోంది. నాటి ఉద్యమ సమయంలో కోదండరామ్‌తో దగ్గరి సంబంధాలు కలిగిన నాయకుల కదలికలను నిశితంగా గమనిస్తోంది. పార్టీ పెట్టాలంటే బలమైన ఉద్యమం, పరిస్థితులు అవసరమని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని అధికార నేతలు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. టిజెఎసిని ఉద్యమ సంస్థగా ఆదరిస్తారేమో కాని పార్టీ పెడితే నిలబడడగలగడం ఈ రోజుల్లో కష్టమని చెబుతున్నారు. అయితే, కోదండరామ్‌ను తక్కువగా అంచనా వేయలేమని, తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని పార్టీలు, అన్ని రకాల వ్యక్తులు, సంఘాలను ఓపికతో ఒక్క తాటిపై నడపగలిగారని ఒక అధికార పార్టీ ఎంఎల్‌ఏ అన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో తెలంగాణ ఉద్యమం అత్యంత బలమైనదని, దానిని ఉత్కృష్ఠ సమయంలోనే ఎంతో ఒడుపుగా నడిపిన అనుభవం ఆయనకు ఉందని, అలాగే తెలంగాణ సమాజంలో గౌరవం ఉన్న వ్యక్తి అని, అంత సులువుగా ఆయన పార్టీని కొట్టిపారేయలేమన్నారు. కోదండరామ్ పార్టీతో కలిసే వ్యక్తులు, శక్తులు, వనరులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే పనిలో నిఘా వర్గాలు నిమగ్నమయ్యాయి.కోదండరామ్ పెట్టే పార్టీ విషయంలో కాంగ్రెస్ నాయకులు వేచి చూసే ధోరణిని అవలంభించాలని నిర్ణయించారు. 'తెలంగాణ ఏర్పడిన తరువాత జెఎసి చైర్మన్‌గా కోదండరామ్ జిల్లా పర్యటనలను పోలీసులు అడ్డుకున్నప్పుడు , కార్యక్రమాలకు ప్రభుత్వం అనుమతినివ్వనప్పుడు, ఇంటి వద్ద నిరశనకు కూర్చున్న సమయాల్లో ఆయనకు బాసటగా నిలిచాం. అప్పటికి ఆయన పార్టీ పెట్టలేదు.ఎవరి ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగినా బాధ్యతాయుతమైన ప్రధాన ప్రతిపక్ష పార్టీగా మద్దతునిస్తాం. పార్టీ పెడతామని మాత్రమే ఇప్పుడు ప్రకటించారు. తెలంగాణలో కచ్చితంగా కోదండరామ్ పార్టీ ప్రభావం ఉంటుంది. జెఎసిగా ఉన్న ఆదరణను ఎంత వరకు పార్టీ వైపు మలుచుకోగలరో చూడాలి. ఆ పార్టీ ఎలా ఉండబోతుంది, దాని విధానాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది. ఆ తరువాత దానిపై అభిప్రాయానికి రాగలుగుతామ'ని కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి నాయకులొకరు వ్యాఖ్యానించారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా వచ్చే కొత్త పార్టీ సహజంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపైనే ఆధారపడుతుందని, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమకు ఆ ఓట్ల చీలిక కారణం గా నష్టం కలిగే అవకాశ ఉందని మరో కాంగ్రెస్ నేత అన్నారు. దీంతో ఆచితూచి వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా చెబుతున్న బిజెపి సైతం ఈ అంశంపై వేచి చూసే ధోరణి అవలంభిస్తోంది.

ప్రచార ఆర్భాటమే తప్ప పనుల్లేవు: రావుల

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పాకులాడుతోంది తప్ప క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ఆ తీరులో జరగడం లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఆరోగ్యశ్రీ, ఫీజురియంబర్స్‌మెంట్ తదితర సంక్షేమ కార్యక్రమాలకు నిధులను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసిందని ధనిక రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశం మాట్లాడుతూ, ఉపాధి హామీ నిధులను టిఆర్‌ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమిని పంపిణీ చేస్తానని ప్రకటించిన టిఆర్‌ఎస్ ప్రభుత్వం, నాలుగు సంవత్సరాల పాలనలో కేవలం 10 ఎకరాలను మాత్రమే సేకరించి, 4600 కుటుంబాలకే పంపిణీ చేసిందని తెలిపారు. మహబూబ్‌నగర్, పెద్దపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో మూడు ఎకరాల భూ పంపిణీని ఇప్పటి వరకు మొదలే పెట్టలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం రెండు సార్లు డిఎస్సి పరీక్షలను నిర్వహిస్తే తెలంగాణలో కనీసం ఒక డిఎస్సిని కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోజుకో కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెడుతూ తెలంగాణ సమాజాన్ని ఊహల్లోకి తీసుకెళ్తోందని అన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు గవర్నర్ ప్రశంసలు

- **ఆకట్టుకునే విధంగా అద్భుతమైన ప్రదర్శనలు**



మన తెలంగాణ / హైదరాబాద్:ఢిల్లీలోని రాజ్‌పథ్‌పై జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో యావత్తు దేశం గర్వించదగిన రీతిలో ప్రదర్శనలు నిర్వహించి ఉత్తమ ప్రతిభను కనబర్చి సందర్శకులను ఆకట్టుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్సీసీ క్యాడెట్లను రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్.నరసింహన్ ప్రశంసించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల రిహార్సల్స్ జనవరి తొలి వారంలోనే ప్రారంభమయ్యాయని, లోటుపాట్లను సరిదిద్దుకుని ఆసియాన్ దేశాల అతిథుల ముందు ఆకట్టుకునే తీరులో ప్రదర్శనలు నిర్వహించి మన్ననలు అందుకోవడం సంతోషంగా ఉందని ఆ క్యాడెట్లతో గవర్నర్ వ్యాఖ్యానించారు. ఇవే ప్రదర్శరలను సోమవారం గవర్నర్ సమక్షంలో 'ఎట్ హోం' కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్లు మరోసారి ప్రదర్శించారు. ప్రతి ఏడాది ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్‌సిసి విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలను ఢిల్లీలో నిర్వహించడం, పలు అవార్డులను అందుకోవడం అదృష్టమని వ్యాఖ్యానించారు. ఎన్సీసీ క్యాడెట్లు సమాజ హిత కార్యక్రమాలతో పాటు గ్రామాల సందర్శన, స్వచ్ఛ భారత్ ప్రచారాలు, ఆరోగ్య అవగాహన వంటి కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారని, ఇది ఎంతోమందికి ఆదర్శమని తెలిపారు. మెరుగైన ఆరోగ్యం, పరిశుభ్రతపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందనే విషయాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అవార్డులను పొందిన వారిని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ క్యాడేట్ల పురస్కారం, మొబైల్ యాప్‌తో పాటు జర్నల్స్‌ను విడుదల చేశారు.

ఆహార కల్తీ నియంత్రణకు పటిష్టమైన చట్టం

- **మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రి లక్ష్మారెడ్డి**

మన తెలంగాణ / హైదరాబాద్: ఆహార కల్తీ నియంత్రణకు పటిష్టమైన చట్టం ఉండాలని శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. కల్తీని నివారించకుండా ఎన్ని మందులు వాడినా, ఎన్ని చికిత్సలు చేయించుకున్నా ఫలితం ఉండదని స్పష్టం చేశారు. నారాయణగూడలోని ఐపిఎంలో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, వ్యాన్‌ను సోమవారం ప్రారంభించి అనంతరం బ్లడ్‌బ్యాంక్‌ను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఐపిఎం అంటే ఎవరికీ తెలియదని, కుక్కల దావాఖాన అంటే అందరికీ తెలుస్తుందన్నారు. ఇప్పుడు మొబైల్ వాహనం అందుబాటులోకి రావడం సంతోషించదగ్గ విషయమని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నాచారంలోని ల్యాబ్‌ను కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తే బాగుంటుందని మంత్రికి సూచించారు. ఆహారంలో కల్తీ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు అధికారులకు వాహనాలతో పాటు తగిన సదుపాయాలు ఉండాలన్నారు. కల్తీ విషయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అధికారులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి మరింత సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆహార కల్తీ నివారణలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమన్నారు. హోటళ్లతో పాటు ఇతర ఆహార పదార్థాల అమ్మకందార్లు నిజాయితీగా వ్యవహరించాలన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన వైద్యారోగ్యశాఖ మంత్రుల సమావేశంలో ఐపిఎం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రస్తావించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే రెండు మొబైల్ వాహనాలు అవసరమని చెప్పామని, ప్రస్తుతానికి ఒకటి వచ్చిందని, త్వరలో మరోటి కూడా వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పాలు, వంటనూనెలు, మసాలాలతో పాటు అనేక రకాల ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించే సదుపాయం ఉందన్నారు. నిల్వ ఉండే చోటకే వా హనం వెళ్లి పరీక్షించే అవకాశముండడంతో అక్కడికక్కడే సీజ్ చేసే అవకాశముంటుందని లక్ష్మారెడ్డి వివరించారు. డీఎంఈ రమేష్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి, వైద్య, ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షలు జూపల్లి రాజేందర్ పాల్గొన్నారు.

తెలుగు బోధనకు సరళ పద్ధతి


- **ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి**



మన తెలంగాణ / హైదరాబాద్: తెలుగు రాయడం, చదవడంతో పాటు స్పష్టమైన భాషను సరళంగా, సులభంగా నేర్చుకునే విధంగా కొత్త పద్ధతిని ప్రవేశపెడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. మానవ వనరులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా పయనిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకు విద్య, వైద్య రంగాలు కీలకపాత్రను పోషిస్తాయన్నారు. తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నూతన పరిపాలన భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేసిన సందర్భంగా మంత్రి కడియం మాట్లాడుతూ, తెలుగు భాషను నలుదిశలా విస్తరింపజేసేలా విశ్వవిద్యాలయం కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. 'తప్పని సరి తెలుగు'పై యూనివర్శిటీ ఉప కులపతి ఎస్.వి. సత్యనారాయణ కమిటీ అందించిన నివేదికను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఇప్పటి వరకు తెలుగు యూనివర్శిటీకి పరిపాలన భవనం లేకపోవడం పట్ల విచారకరమని, నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3.39 కోట్లు కేటాయించిందని చెప్పారు. విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని, విశ్వవిద్యాలయాల్లో 1,557ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలను భర్తీ చేస్తున్నామని తెలిపారు.

సిఎం, కడియం రామలక్ష్మ ణులు : ఎస్‌వి : విశ్వవిద్యాలయ ఉప కులపతి ఎస్.వి. సత్య నారాయణ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసం సిఎం కెసిఆర్, డిప్యూటీ సిఎం కడియంలు రామలక్ష్మ ణ్ లాగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా తెలుగు యూనివర్శిటిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 కోట్లు కేటాయించి, ఇందులో ఇప్పటికే ఆరు కోట్ల రూపాయలను విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ అలేఖ్య, ఆకాశవాణి డైరెక్టర్ ఉదయ్ శంకర్ పాల్గొన్నారు.

సిఎస్‌కు శుభాకాంక్షలు




మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శైలేందర్ కుమార్ జోషిని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం నాడు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌కె జోషిని శాలువాతో సత్కరించారు.

స్టెంట్ల ధరల నియంత్రణకు చర్యలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : కరోనరీ స్టెంట్ల ధరల తగ్గుదల లాభాలను పేషంట్లకు దక్కేలా తగు చర్యలు తీసుకోవాలని ఎథికల్ హెల్త్‌కేర్‌కు చెందిన వైద్యుల బృందం కోరింది. డా.అరుణ్ మిత్రా, డా.అబా శుక్ల, డా.మోనికా చాందీ, డా. అనిల్ పాఠక్‌లతో కూడిన ఎథికల్ హెల్త్ కేర్ వైద్య బృందం ఎన్‌పిపిఎ చైర్మన్‌ను కలిసింది. ఈ సందర్భంగా కరోనరి స్టెంట్స్ ధరలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల ద్వారా స్టెంట్‌లు వేసే మొత్తం వ్యయాన్ని తనిఖీ చేసేందుకు పర్యవేక్షణ యంత్రాంగం లేనందున ప్రైవేటు ఆసుపత్రులు చార్జీలు పెంచడంతో పాటు స్టెంట్ ధర పరిమితి వాస్తవ ప్రయోజనం పేషంట్లకు అందకుండా చేస్తున్నారని బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. స్టెంట్స్ పెట్టడంలో ఉపయోగించే సహాయక సామాగ్రి ధరలు పెంచి స్టెంట్ ధరల తగ్గుదల ప్రయోజనం పేషంట్లకు అందకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చార్జీలపై సమీక్షించడానికి ఒక అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అన్ని ఔషధాలను అవసరమైన మందుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పిని ప్రభుత్వం నిర్ణయించాలి ప్ప కంపెనీలు కాదని, ప్రైవేటు ఆసుపత్రులను సమాచార హక్కు చట్టం కిందకు తీసుకురావాలన్నారు.

నాయీ బ్రాహ్మణులకు ఆధునిక పనిముట్లు



- **శిక్షణ పొందిన వారికి కిట్స్, ధృవపత్రాల పంపిణీ**

మన తెలంగాణ /హైదరాబాద్ : అంతరించి పోతున్న కుల వృత్తులకు పూర్వ వైభవం కల్పించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. అందులో భాగంగానే నాయీబ్రాహ్మణులు ఆత్మగౌరవంతో బతికేలా వారికి ఆధునిక పద్ధతిలో వృత్తి నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. నాయీబ్రాహ్మణులకు అత్యాధునిక పనిముట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో శిక్షణ పొందిన 138 మంది నాయీ బ్రాహ్మణులకు కిట్స్, ధృవపత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 3.10 లక్షల మంది నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. దశలవారిగా దానిని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. నాయీ బ్రాహ్మణుల వృత్తి నైపుణ్యం కోసం రూ. 20 కోట్లు కేటాయించామన్నారు. రానున్న బడ్జెట్‌లో బిసి వర్గాల బడ్జెట్ రెట్టింపు కానుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ లేకుండా అర్హులైన బీసీ వర్గాలకు నేరుగా రుణాలు అందజేస్తామన్నారు. ఎంఎల్‌ఏ వి.శ్రీనివాస్ గౌడ్, ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, నాయీబ్రహ్మణ ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎబీసీడబ్ల్యుడివో సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సహాయ బిసి సంక్షేమ అభివృద్ధి అధికారుల సంఘం క్యాలెండర్‌ను మంత్రి జోగురామన్న సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు శ్రీనివాస్ గౌడ్, ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటల వల్లే శ్రీనివాస్ హత్య



- **కేసును సిబిఐకి అప్పగించాల్సిన అవసరం లేదు**
- **జైపాల్, జానారెడ్డి వివరణ ఇవ్వాలి : మంత్రి జగదీష్‌రెడ్డి**

మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలే కారణమని విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ హత్య కేసులో పోలీసులు పూర్తి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసినప్పటికీ టిఆర్‌ఎస్‌పై బురద జల్లెందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈనెల 4న శ్రీనివాస్ సంతాపసభలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన భాషకు సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, జానారెడ్డిలు వివరణ ఇవ్వాలని మంత్రి కోరారు. హత్యకు గురైన శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించేందుకు హైదరాబాద్ నుండి నల్లగొండకు బయలుదేరగా చిట్యాల వరకు రాగానే స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి చేపట్టిన ధర్నా కారణంగా రాలేకపోయానన్నారు. టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్, జానారెడ్డిలు నల్లగొండలో మొట్టమొదటిసారిగా ధైర్యంగా శ్రీనివాస్ సంతాపసభకు హాజరయ్యారని, గతంలో వెంకట్‌రెడ్డికి భయపడి నల్లగొండకు రాలేకపోయారన్నారు. 2019 ఎన్నికల్లో జిల్లా ప్రజలు కోమటిరెడ్డిని నగ్నంగా నిలబెడుతారని హెచ్చరించారు. శ్రీనివాస్ హత్య కేసు విచారణ ఇంకా కొనసాగుతుందని అన్నారు. హత్య వెనుక ఉన్న ఏ ఒక్కరిని ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలను పోలీసు శాఖ తీసుకుంటుందన్నారు. కేసును సిబిఐకి అప్పగించాల్సిన అవసరం లేదన్నారు. 2019 ఎన్నికల్లో 12 శాసనసభ స్థానాలు, 2 పార్లమెంట్ స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ చీకటి రాజకీయాలు బయటపడుతాయని పోలీసులను, తెరాస నాయకులపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు వేముల వీరేశం, ఎన్. భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఫైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల నర్సింహ్మా, టిఆర్‌ఎస్ నేతలు చాడ కిషన్‌రెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, మాలె శరణ్యారెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డిలు పాల్గొన్నారు.



త్వరలో అత్యాధునిక విత్తన పరీక్షా కేంద్రం

మనతెలంగాణ/హైదరాబాద్ :రాజేంద్రనగర్‌లో ఏర్పాటవుతున్న అత్యాధునిక ఐఎస్‌టిఏ విత్తన పరీక్షా కేంద్రం రాష్ట్ర రైతాంగానికి జూన్ మాసంలోపునే అందుబాటులోకి రానుంది. తెలంగాణ రాష్ట్ర విత్తన సేంద్రీయ ధృవీకరణ అథారిటీ 7వ సాధారణ పాలక మండలి సమావేశం వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థసారథి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. పాలక మండలి సభ్యులు వ్యవసాయ శాఖ కమిషనర్ డా. జగన్ మోహన్ , ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆర్థిక శాఖ డిప్యూటి సెక్రటరీ కె. ధర్మయ్య తదితర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో 2017–18 విత్తన ధృవీకరణ ప్రణాళికకు, వివిధ పద్దులకు ఆమోదం లభించింది. సహకార రంగంలో ధృవీకరణ విత్తనోత్పత్తిని ప్రొత్సహించాలని సమావేశం నిర్ణయించింది. నాణ్యమైన ధృవీకరణ పశుగ్రాస విత్తనోత్పత్తిని చేపట్టాలని కూడా తీర్మానించారు. అంతర్జాతీయ ఓఈసిడి విత్తన ధృవీకరణలో నైపుణ్యాభివృద్ధి కోసం విదేశాలకు సాంకేతిక సిబ్బందిని పంపించాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయం తీసుకున్నారు. అలాగే నకిలీ ట్యాగుల తయారీకి వీలు కాని టైవెక్ ట్యాగులను అన్ని పంటలకు అందించాలని నిర్ణయించారు.

త్వరలోనే సెకండ్ ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరిస్తాం : లక్ష్మారెడ్డి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో సెకండ్ ఎఎన్ఎంల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఎలాంటి ఆందోళనా అవసరం లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే పరిశీలన ప్రారంభమైందని, స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం పట్టవచ్చన్నారు. ఎఎన్ఎంల సమస్యలన్నీ ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నాయని తెలిపారు. టీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఆర్టీసీ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సెకండ్ ఎఎన్ఎంల మొదటి మహాసభకు హాజరైన సందర్భంగా పై విధంగా వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండవ ఎఎన్ఎంల నియామకాలు ఒక పద్ధతి లేకుండా జరిగాయని, ఒక్కో సమస్యను పరిష్కరించడంపై సిఎం దృష్టి సారించారన్నారు. ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, ఒకేసారి అన్ని సమస్యలూ పరిష్కారం కావని, కొంత సమయం పడుతుందన్నారు. సెకండ్ ఏఎన్ఎమ్‌ల అంశంపై త్వరలోనే అధ్యయనాన్ని పూర్తి చేసి సీఎంకు నివేదికను అందజేస్తామని, అప్పటి వరకు ఓపిగ్గా ఉండాలన్నారు. రెండో ఎఎన్ఎంల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి వెల్లడించారు.

దరఖాస్తుల సవరణకు అవకాశం

మన తెలంగాణ/హైదరాబాద్:స్టాఫ్ నర్స్, ఫిజియోథెరపిస్ట్ పోస్టుల భర్తీకి వచ్చిన దరఖాస్తుల్లో చాలా వరకు తప్పులు ఉన్నాయని టిఎస్‌పిఎస్‌సి ప్రకటించింది. తప్పొప్పుల సవరణకు అభ్యర్థులకు ఒక అవకాశం ఇచ్చింది. ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ మధ్యలో అభ్యర్థులు తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించింది. అయితే ఎడిట్ ఆప్షన్‌ను ఒకసారి మాత్రమే ఉపయోగించే అవకాశం ఉంటుందని, వివరాలు జాగ్రత్తగా సరిచూసుకోవాలని కమిషన్ ఒక ప్రకటనలో కోరింది.

ఎనుమాముల మార్కెట్లో రైతుల ఆందోళన



మనతెలంగాణ/కాశిబుగ్గ: వరంగల్ అర్బన్ జిల్లాలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చికి ధర తక్కువ కావడంతో మిర్చి రైతులు ఆందోళనకు దిగారు. అదే క్రమంలో పత్తి యార్డులోని పత్తి పంటను వ్యాపారస్తులు తేమ 15% శాతం పైగా ఉందని కొనుగోలు చేయకపోవడంతో పత్తి రైతులు ఆందోళనలకు దిగిన సంఘటనలు సోమవారం ఏనుమాముల మార్కెట్లో నెలకొంది. మేడారం జాతర తరువాత ఏనుమాముల మార్కెట్ పునః ప్రారంభం కావడంతో పత్తి, మిర్చి రైతులు తమ పంట ఉత్పత్తులతో మార్కెట్‌కు తీసుకవచ్చారు. అయితే పత్తిలో నీళ్లు చల్లి తేస్తే పత్తిని కొనుగోలు చేయవద్దని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తీర్మానం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో పత్తి పంటను మార్కెట్లోని వ్యాపారస్తులు కొనుగోలు చేయడం లేదని పత్తి రైతుల ఆందోళనను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆందోళన చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్ కొంపెల్లి ధర్మరాజు, ఆర్‌డిఓ వెంకట, ఏసిపి ప్రభాకర్‌రావు, మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల మార్కెట్లోని వ్యాపారస్తులైన కటకం పెంటయ్యతో పాటు బొమ్మినేని రవీందర్‌రెడ్డిలతో మాట్లాడి పత్తి, మిర్చి పంటలను కొనుగోలు చేయించారు. దీంతో పత్తి రైతులు తమ ఆందోళనను విరమించారు.

యువకుల మధ్య వాగ్వాదం



మనతెలంగాణ/అమీర్‌పేట్ : మద్యం సేవించే సమయంలో యువకుల మధ్య చోటుచేసుకున్న వాగ్వివాదం కాస్త కత్తిపోట్లకు దారితీసిన సంఘటన సంజీవరెడ్డి నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రహ్మత్‌నగర్‌కు చెందిన సాబేర్, మస్తాక్ అలీ అనే ఇద్దరు స్నేహితులు మోతీనగర్ నుండి బోరబండ వెళ్ళే మార్గంలోని దుర్గా వైన్స్‌లో మద్యం సేవిస్తుండగా ప్రక్కన కూర్చున్న నలుగురు యువకులతో మాటామాటా పెరిగింది. వివాదానికి దారితీసింది. దీంతో ఆ నలుగురిలో ఒకతను కత్తిని తీసి దాడిచేశాడు. మస్తాక్ అలీకి భుజంపై, కడుపులోకి కత్తి దిగినట్టు తెలిపారు. చికిత్స నిమిత్తం బాధితుడిని ఆసుపత్రికి తరలించగా, దాడిచేసిన నలుగురు యువకుల కోసం పోలీసుల గాలిస్తున్నారు.

నేడు బిసి సాధికారిక కమిటీ సమావేశం

మన తెలంగాణ/ హైదరాబాద్: టిపిసిసి ఒబిసి సాధికారిక కమిటీ సమావేశాన్ని మంగళవారం నాడు గాంధీభవన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిటీ చైర్మన్ టి.నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ ఆర్.సి కుంటియా, కార్య నిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్కతోపాటు 35 మంది సాధికారిక కమిటీ సభ్యులు పాల్గొంటారని ఆయన అన్నారు. కాగా ఈ నెల 9వ తేదీన టిపిసిసి ఒబిసి సెల్ కార్యవర్గ సమావేశం గాంధీభవన్‌లో నిర్వహించనున్నట్టు ఒబిసి సెల్ చైర్మన్ చిత్త రంజన్ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆస్పత్రి నుంచి బాలకృష్ణ డిశ్చార్జి



హైదరాబాద్ : నటుడు, హిందూపురం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణ సోమవారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. బాలకృష్ణ కుడి భుజానికి ఆపరేషన్ చేశారు. గౌతమిపుత్ర శాతకర్ణి సినిమా షూటింగ్ సమయంలో ఆయన గాయపడ్డారు. అప్పటినుంచి ఆయన రొటేటర్ కఫ్ టియర్స్ ఆఫ్ షోల్డర్ సమస్యతో బాధపడుతున్నారు. దీంతో ఆస్పత్రిలో చేరిన బాలకృష్ణకు ఆపరేషన్ చేసినట్టు డాక్టర్ ఆశిష్ బాబల్కార్ తెలిపారు. 5 నుంచి 6 వారాల పాటు బాలకృష్ణ విశ్రాంతి తీసుకోవాలని ఆయన చెప్పారు.

'డబుల్'కు ఉక్కుసాయం



● కంపెనీలకు మంత్రులు కెటిఆర్, ఇంద్రకరణ్ విజ్ఞప్తి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి సామాజిక బాధ్యతగా ఉక్కు కంపెనీ యజమానులు తమ వంతు సహాయం చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పరిశ్రమ ల శాఖ మంత్రి కెటిఆర్ కోరారు. దేశంలో ఎక్కడ లేని విధంగా నిరు పేదలకు తెలంగాణ ప్రభు త్వం నాణ్యతతో కూడిన విశాలమైన రెండు పడక గదుల ఇళ్ళను నిర్మిస్తోందని, సిమెంట్ కంపెనీలు సామాజిక బాధ్యతగా తోడ్పాటు నందించి మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా బస్తా సిమెంట్‌ను రూ. 230 కే సరఫరా చేస్తున్నాయని, ఇనుము తయారీ కంపెనీలు కూడా అదే తరహా లో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో ఇనుము ధర ఇటీవలి కాలంలో ఊహించని తీరులో పెరిగిపోవడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను నిర్మించలేమని బిల్డర్లు పది రోజుల క్రితం ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇనుమును ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదా మారిన ధర ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో బిల్డర్లతో, ఇనుము కంపెనీల ప్రతినిధులతో మంత్రులు సోమవారం సమావేశం ఏర్పాటుచేసి పై విధంగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తం గా 2.60 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికిగాను గ్రామీణ ప్రాంతాల్లోని లక్ష ఇండ్లకు 1.45 లక్షల మెట్రిక్ టన్నులు, పట్టణ ప్రాంతాల్లోని 60 వేల ఇండ్లకు 1.04 లక్షల మెట్రిక్ టన్నులు , జిహెచ్ఎంసి పరిధిలో లక్ష ఇండ్లకు 2.78 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 5.27 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కు అవసరం ఉందని కంపెనీ యాజమాన్యాలకు మంత్రులు వివరించారు. జాప్యం లేకుండా ఆన్ లైన్‌లోనే బిల్లుల చెల్లిస్తామని కంపెనీలకు స్పష్టం చేశారు. లాభాపేక్షతో కాకుండా సామాజిక దృక్పథంతో సరసమైన ధరలకు ఉక్కును సరఫరా చేయాలని కోరారు. ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో చర్చించి ప్రభుత్వానికి తమ నిర్ణయం వెల్లడిస్తామని ఈ సమావేశానికి హాజరైన కొన్ని ఉక్కు కంపెనీల ప్రతినిధులు తెలిపాయి. రెండు మూడు రోజుల్లో గృహనిర్మాణ శాఖ కార్యదర్శి మరో సారి సమావేశం ఏర్పాటుచేయనున్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అనిల్ కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ డైరెక్టర్ టికె. శ్రీదేవి, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశాంక్ గోయల్, జిహెచ్ఎంసి అడిషనర్ కమిషనర్ భారతి, గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ సత్యమూర్తి, ఆల్ ఇండియా స్టీల్ అసోసియేషన్ చైర్మన్ సురేష్ కుమార్ సింఘాల్, ఇంకా విశాఖ స్టీల్ ప్లాంట్, జిందాల్, శాలినీ స్టీల్ కంపెనీలతో పాటు ఇతర 8 స్టీల్ కంపెనీల యాజమానులు పాల్గొన్నారు.

కాళేశ్వరం డిజైన్‌తో పెరిగిన నీటి నిల్వ

● ప్రముఖ ఇంజనీర్ అనంతరాములు

మన తెలంగాణ/హైదరాబాద్ : గతంలోని ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టుకు ప్రస్తుత ప్రభుత్వం రీడిజైనింగ్ చేయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని, కృష్ణా బేసిన్‌కు సైతం నీటిని మళ్ళించే వీలు కలిగిందని ప్రముఖ ఇంజనీర్ అనంతరాములు వ్యాఖ్యానించారు. కొన్ని ప్రాంతాల్లో రెండో పంటకు కూడా సాగునీరు అందిచడం వీలవుతుందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఎం. తిరుపతి రెడ్డి 7వ స్మారక ప్రసంగ కార్యక్రమం సందర్భంగా 'కాళేశ్వరం ప్రాజెక్టు'పై రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బి.అనంతరాములు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంలోని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్‌కు, ఇప్పటి కాళేశ్వరం రీడిజైనింగ్‌కు మధ్య మూడు తేడాలు ఉన్నాయని, నీటి నిల్వ మాత్రం 11 టిఎంసిల నుంచి 140 టిఎంసిలకు పెరిగిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలు, పంపుహౌజ్‌లు మినహా మిగతా డిజైన్ అంతా పాతదేనని స్పష్టం చేశారు. తమ్మిడిహట్టి వద్ద తొలుత 160 టిఎంసిల వినియోగానికి కేంద్ర జలసంఘం అనుమతిచ్చి ఆ తర్వాత నీళ్లు లేవని చెప్పడంతో రీడిజైనింగ్ అనివార్యమైందన్నారు. తొలుత మల్లన్న సాగర్ ద్వారా హల్దీ నది నుంచి సింగూరు, నిజాంసాగర్ మీదుగా శ్రీరాం సాగర్ వరకు నీటిని తరలించాలని భావించారని, ఆ తర్వాత సమర్థ నీటి వినియోగం కోసం వరద కాలువ మీద మూడు దశల్లో రివర్స్‌లో ఎత్తిపోసేలా డిజైన్‌ను మార్చారని వివరించారు. సింగూరు, నిజాంసాగర్‌ల నీటిని దిగువకు పంపించకుండా వాడుకోవచ్చని స్పష్టం చేశారు. తమ్మిడిహట్టి నుంచి మిగులు జలాలను గ్రావిటీతో సుందిళ్ల వరకు వచ్చేలా అనుసంధానిస్తే కొంత భారం తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా పలు విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు పి. అలేఖ్య రెడ్డి, మణ్‌దీప్ సింగ్ సూడాన్, దంతోజు కావ్య తదితరులకు జ్ఞాపిక, ధృవీకరణ పత్రం అందజేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి డాక్టర్ జి.రామేశ్వర రావు, సభ్యులు ఎం. శ్యాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురపాలికలుగా 'ఔటర్' గ్రామాలు



● రెండేళ్ల వరకు పన్నులు పెంచబోం : కెటిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్ లోపల ఉన్న గ్రామాలను పురపాలికలుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. పురపాలికలుగా మారనున్న ప్రస్తుత గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రాంతాల్లో రెండేళ్ల వరకు పన్నులను పెంచబోమని స్పష్టం చేశారు. వీటికి నిధులను కూడా ప్రభుత్వమే అందజేస్తుందని, తద్వారా ఆ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. సచివాలయంలో సోమవారం పురపాలక, పంచాయతీరాజ్ శాఖాధికారులతో మంత్రి కెటిఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, మేడ్చల్, మహేశ్వరం, సంగారెడ్డి నియోజకవర్గాల ఎంఎల్‌ఎలు, నగర ఎంఎల్‌సిలు, ఎంపి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమీన్‌పూర్, బొల్లారం, కొంపల్లి, పుప్పాలగూడ, ప్రగతినగర్, తెల్లాపూర్, కొల్లూర్, తుర్కయాంజాల్‌తో పాటు మరి కొన్ని మున్సిపాలిటీల ఏర్పాటు అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. 15 వేలకు మించి జనాభా ఉన్న పంచాయతీలను కచ్చితంగా నగర పంచాయతీలు, మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మంత్రి కెటిఆర్ ప్రజాప్రతినిధులకు వివరించారు. దీనికి సంబంధించిన పరిసర ప్రాంతాలను విలీనం చేసే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. నగరంలో పెద్ద ఎత్తున చేపడుతున్న డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలలో రాబోయే కొత్త జనాభాను కూడా పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పురపాలికల పరిధిలో 167 గ్రామాలు : అవుటర్ రింగ్ రోడ్ లోపల 167 గ్రామాలు ఉన్నాయని, వాటి భౌగోళిక పరిస్థితుల ఆధారంగా నూతన పురపాలక సంస్థలుగా ఏర్పాటు, లేదా ఇతర పురపాలికల్లో విలీనం చేస్తామని మంత్రి కెటిఆర్ తెలిపారు. ఈ ప్రాంతాలను పురపాలికలుగా ఏర్పాటు చేసే అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను అందించాలని, ఈ విషయంలో స్థానిక ఎంఎల్‌ఎలతో కలిసి జిల్లా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

బిజెపియే మొదటి లక్ష్యం

● సమస్యలకు వామపక్షాలతోనే పరిష్కారమనేది వాస్తవం

● మేడారం ఆలయ ప్రతిపాదనతో బెంబేలెత్తుతున్న గిరిజనులు

● సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలోని సమస్యలకు వామపక్షాలే నిజమైన పరిష్కారం చూపగలుగుతాయనేది వాస్తవమని, అయితే వామపక్షాలు ప్రత్యామ్నాయం అయ్యేందుకు ఇంకా కొంత కాలం పడుతుందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవం సందర్భంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దేశంలో వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయమని చేసిన వ్యాఖ్యలపై సుధాకర్‌రెడ్డి పై విధంగా స్పందించారు. మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు అనుబంధం) వర్క్‌షాప్‌ను సురవరం సుధాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వెంకట్రాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు గుండా మల్లేష్, ఈర్ల నరసింహ ప్రసంగించారు. సురవరం సుధాకర్‌రెడ్డి ప్రసంగిస్తూ బిజెపి, కాంగ్రెస్ మధ్య ఆర్థిక విధానాల్లో తేడా లేదన్నారు. అయితే ఆర్థిక విధానాలతో పాటు మతోన్మాదం, నిరంకుశత్వం, సంఘ్ పరివార్ శక్తులను బిజెపి ముందుకు తెస్తున్నదని, ఈ కారణంగానే తొలుత బిజెపిని ఓడించడం, తగ్గించడం, ప్రతిఘటించడం వామపక్షాల ముందున్న ప్రధాన కర్తవ్యమన్నారు. ఇందు కోసం వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులన్నీ కలిసి విశాల ఐక్య వేదిక ఏర్పాటు చేయాలని సిపిఐ భావిస్తున్నదన్నారు. వామపక్షాలు మాత్రమే వేరుగా పోరాటాలు చేయాలని సిపిఐ(ఎం) అంటున్నదన్నారు.

మేడారంలో దేవాలయ నిర్మాణం ప్రమాదకరం : ప్రభుత్వం రూ.200 కోట్లతో మేడారంలో సమ్మక్క –సారలమ్మ దేవాలయాన్ని నిర్మించాలనే ఆలోచన ప్రమాదకరమైందని సుధాకర్ రెడ్డి అన్నారు. తద్వారా గిరిజనుల నుంచి గిరిజనుల సాంప్రదాయల నుంచి ఈ ఉత్సవాలను బ్రాహ్మణీయ సాంప్రదాయంలోకి మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. దేవాలయం కట్టిన తరువాత పుజారులు బ్రాహ్మణులుంటారని, గిరిజనులు, బ్రాహ్మణులకు ఏమి సంబంధమని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. బ్రాహ్మణులు వద్దనే ఆదివాసులు వారి పుజారులను పెట్టుకున్నారన్నారని, తిరిగి ఇప్పుడు దేవాలయం నిర్మించి సమ్మక్క, సారలమ్మ ఫోటోలు పెడతారని, ఇలాంటి చర్యలు హిందుత్వ బ్రాహ్మణీయ సాంప్రదాయాలను బలవంతంగా ప్రజలపై రుద్దడమేనని, కుల, మతాల పేరుతో ప్రజలను ఆకట్టుకునే జిమ్మిక్కు అని ఆయన అన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భూమి, ఇళ్ల స్థలాలు ప్రధాన అంశాలతో పాటు సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రజా సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా భూమి సమస్యపై దృష్టి సారించాలని, అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్ భూములను పరిరక్షించేందుకు ఆందోళన చేయడం ద్వారా అవి పేదలకు దక్కేందుకు కృషి చేయాలన్నారు.

త్వరలో రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు

మన తెలంగాణ/హైదరాబాద్: రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి విద్యార్థి వసతి గృహం (రెడ్డి హాస్టల్) తన శతాబ్ది ఉత్సవాలను త్వరలో ఘనంగా నిర్వహించనుంది. ఈ వసతి గృహంలో ఉండి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అప్పటి జ్ఞాపకాలను ఇప్పటి విద్యార్థులకు తెలియజేయనున్నారు. ఈ ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి కె. వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28లోగా ఫోన్ నెం 9490743561 ద్వారా పూర్వ విద్యార్థులు తమ సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

రూ.201.71కోట్ల నాబార్డు రుణం

మన తెలంగాణ / తెలంగాణ :మిషన్ భగీరథకు నాబార్డు రూ.201.71కోట్ల రుణం మంజూరు చేసింది. సంవత్సరం గ్రామాలకు మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులకు గతంలో పరిపాలనా అనుమతులు మంజూరుకాగా ఇప్పుడు నాబార్డు బ్యాంకు రూ. 237.37 కోట్ల అంచనా వ్యయంలో రూ. 201.71 కోట్ల మేర రుణాన్ని మంజూరు చేసింది. మిగిలిన రూ. 35.60 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

గల్ఫ్ బాధితులకు అండగా ప్రభుత్వం



మన తెలంగాణ / హైదరాబాద్ : కువైట్ సహా పలు గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని, స్వగ్రామాలకు రావాలని కోరుకుంటున్నవారికి తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే ఆ బాధితుల దగ్గరకు స్వయంగా వెళ్తానని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బసంత్‌రెడ్డి సచివాలయంలో మంత్రి కెటిఆర్‌ను కలిసి వీలైనంత త్వరలో ఎన్నారై పాలసీని అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ నుంచి తిరిగి వచ్చిన యువతకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వపరగా సాయమందించాలని మంత్రిని కోరారు. లక్షలాది రూపాయలు అప్పుచేసి ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తున్న తెలంగాణ యువతకు ఆయా దేశాల వీసా వ్యవహారాలు, ఉపాధికల్పన తదితర అంశాలపై తగిన అవగాహన లేదని, అందువల్లన నకిలీ ఏజెంట్ల మాటలకు మోసపోయి ఆ దేశాల్లో ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి స్వస్థలాలకు చేరుకున్న తర్వాత అప్పుల బాధ ఒకవైపు, ఉపాధి అవకాశాలు లేకపోవడం మరోవైపు బాధిస్తున్నాయని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి కెటిఆర్ తప్పకుండా తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ బాధితులకు అన్ని రకాల సహాయం చేస్తుందని, గల్ఫ్ దేశాల్లో ఇబ్బందుల్లో చిక్కుకున్న యువత సురక్షితంగా స్వస్థలాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తుందని, అవసరమైతే తానే స్వయంగా ఆ దేశాలకు వెళ్తానని హామీ ఇచ్చారు.

పాలనా సంస్కరణల్లో ఇదో కీలక ఘట్టం

● ఎమ్మార్వోలకు రిజిస్ట్రేషన్‌లపై శిక్షణా తరగతులు

● ఉప ముఖ్యమంత్రి మహమూద్ ఆలీ



మన తెలంగాణ / హైదరాబాద్ : సమర్థవంతమైన పరిపాలనకు అనుగుణంగా ఎన్నో సంస్కరణలను ప్రవేశపెడుతున్న ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన, దాని కొనసాగింపుగా రెవిన్యూ అధికారులకే భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌ల బాధ్యతలు అప్పజెప్పిందని, రాష్ట్ర చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఉప ముఖ్యమంత్రి మహమూద్ ఆలీ వ్యాఖ్యానించారు. మండల రెవిన్యూ అధికారులకు భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లపై అవగాహన కల్పించేందుకు సిసిఎల్ఏ అధికారులు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమూద్ ఆలీ మాట్లాడుతూ, భూముల రికార్డుల ప్రక్షాళన అనంతరం రాష్ట్రంలోని భూ యాజమాన్యంపై స్పష్టత వచ్చిందని, ఇకపైన కూడా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించేందుకు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలను సులభతరం చేయడానికి సబ్ రిజిస్ట్రార్‌లతో పాటు తహసీల్దార్‌లకు కూడా బాధ్యతలు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. కొత్త బాధ్యతలను అప్పజెప్తున్నందువల్ల తగిన అవగాహన కల్పించడం కోసం రాష్ట్రంలోని మొత్తం 443 మంది తహసీల్దార్‌లకు విడతల వారీగా ఈ నెలాఖరు వరకు తరగతులు నిర్వహిస్తున్నామని, భూముల రిజిస్ట్రేషన్ చట్టంతో పాటు స్టాంపుల చట్టం గురించి ఉన్నతాధికారులు వివరిస్తున్నారని తెలిపారు. ఎమ్మార్వోలకు భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ బాధ్యతలు అప్పజెప్పడం వలన జాప్యాన్ని నివారించవచ్చునని అన్నారు. ఇప్పటివరకు భూ రికార్డుల ప్రక్షాళనలో యావత్తు రెవిన్యూ సిబ్బంది క్రియాశీలకంగా పనిచేశారని వారిని డిప్యూటీ సీఎం అభినందించారు. రోజువారీ కార్యకలాపాలను నిర్వహిస్తూనే భూ రికార్డుల ప్రక్రియను ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్దిష్ట గడువులోనే పూర్తిచేశారని, ఇకపైన రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ బాధ్యతలు కూడా నిర్వహించబోతున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డిఐజిలు సైదిరెడ్డి, మధుసూధనరెడ్డి, సుభాషిణి తదితరులతో పాటు సిసిఎల్ఏ అధికారులు పాల్గొన్నారు.



"మాట్లాడవలసిన సమయంలో మౌనంగా ఉండటం, మౌనంగా ఉండవలసిన సమయంలో మాట్లాడటం రెండూ తప్పే.
– శ్రీశ్రీ"

బిజెపి–టిడిపి మిత్రభేదం

సంపాదకీయం

మోడీ ప్రభుత్వ కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆశలను అడియాస చేయటంతో ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ ఎంపిలు సైతం ఆయన ఆదేశిస్తే రాజీనామాకు సిద్ధమంటున్నారు. మరోవైపున, రాష్ట్ర బిజెపి నాయకులు కొంతకాలంగా టిడిపి ప్రభుత్వంపై విమర్శలకు పదునుపెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంవత్సరంన్నర తర్వాతగాని ప్రధాని నరేంద్రమోడీతో ముఖాముఖి భేటీ అవకాశం లభించకపోవటంతో టిడిపి శ్రేణుల అసంతృప్తి అప్పటికే ఆగ్రహపు అంచులకు చేరి ఉంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రం తగినన్ని నిధులు కేటాయించక పోవటం, పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా గుర్తించబడినప్పటికీ నిధుల మంజూరులో తాత్సారం, రాష్ట్ర బడ్జెట్‌లో రెవెన్యూ లోటు భర్తీకి అంగీకరించిన సహాయం అరకొరగా విడుదల చేయటం వగైరా మౌలిక అంశాలపై ముఖ్యమంత్రి అప్పటికే అసంతృప్తితో ఉన్నారు. ఢిల్లీ వెళ్లి ప్రధానిని, సంబంధిత మంత్రులందరినీ కలిసి విజ్ఞాపనలు సమర్పించినా బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవటం గోరుచుట్టుపై రోకటిపోటులా తగిలింది. ఎన్‌డిఎ కూటమిలో ఉండి ఏమి లాభం? రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోలేనపుడు బయటకు రావటమే మంచిదనే మాటలు వినిపించాయి. తెగతెంపులకు సిద్ధమవుతున్నట్లు లీకు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే అధినేత మాత్రం తన అసంతృప్తిని బాహాటపరుస్తూనే, కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, పోరాటం చేసి కోర్కెలు సాధించాలని ఎంపిలను ఆదేశించారు. బిజెపితో తెగతెంపులు చేసుకోవలసివస్తే అధినేత 'సరైన సమయంలో సరైన నిర్ణయం' తీసుకుంటారని, ఆ అవకాశాన్ని అట్టేపెట్టుకున్నట్లుగా ముఖ్యమంత్రి తరఫున వ్యూహాత్మక ప్రకటన చేశాడు కేంద్రమంత్రి సుజనాచౌదరి. ఆదివారం ఎంపిల సమావేశం ముగుస్తుండగా, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడి నచ్చచెప్పే ప్రయత్నం చేశారట. ఏమైతేనేం, కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా టిడిపి ఎంపిలు సోమవారం పార్లమెంటు ఆవరణలో ప్లెకార్డుల ప్రదర్శన చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు రాబట్టుకోవాలెగాని ఎన్‌డిఎ నుంచి బయటకువచ్చి ఏం లాభం అన్న భావన చంద్రబాబు నాయుడిలో ఉంది. బిజెపి మిత్రపక్షం శివసేన వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో టిడిపి కూడా వైదొలిగితే బిజెపి ప్రతిష్ట దిగజారుతుందని పరోక్ష హెచ్చరికగానె ఆయన తెగతెంపుల పదాలను వ్యూహాత్మకంగా ఉపయోగిస్తున్నాడు.


ఆంధ్రప్రదేశ్‌లో బిజెపితో ప్రయాణం కొనసాగించటం లాభమా, నష్టమా అన్న మీమాంసలో చంద్రబాబు నాయుడున్నారు. తాము తెగతెంపులు చేసుకుంటే జగన్ పార్టీ బిజెపి బండెక్కుతుందనే భయాందోళన ఉంది. బిజెపి రాష్ట్ర నాయకత్వం కూడా (పార్టీ అధ్యక్షుని ఆదేశమూ కావచ్చు) వైసిపిపై విమర్శలు చేయకపోగా సన్నిహితమవుతున్న సంకేతాలిస్తూ, అలయెన్స్ పక్షం టిడిపిపై 'మిత్రధర్మం' లక్ష్మణరేఖను చెరిపేసి బాహాటంగా విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు. కాబట్టి రాజకీయంగా తమకు ఏది లాభమో నిర్ధారించుకునేవరకు చంద్రబాబునాయుడు సస్పెన్స్ కొనసాగిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదాపై బిజెపితో రాజీపడి ఆయన ఒక మెట్టు కిందకు దిగారు. ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకుని రాష్ట్రానికి ఏదో ఒరుగుతుందని జనాలను నమ్మించే ప్రయత్నం చేశారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అంకెల గారడీతో అరచేతిలో స్వర్గం చూపారు. నిధులు ఇస్తామంటూ భ్రమల్లోపెట్టి బిగబట్టి గుంజీళ్లు తీయిస్తున్నారు. రాజధాని–అమరావతి నిర్మాణాన్ని వెండితెరపై పంచరంగుల ఊహాచిత్రంగా చూపుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను భ్రమల్లో పెడుతుండగా, 'డబ్బు మాది–రాజకీయ ప్రయోజనం మీకా' అన్నట్లు బిజెపి అవసరమైన నిధులివ్వకుండా చుక్కలు చూపిస్తున్నది. వచ్చే ఎన్నికలకు రాజకీయ బేరసారాలకు ఇదొక ఎత్తుగడ కావచ్చు. ఏమైతేనేం టిడిపి, బిజెపి ప్రయోజనాల ఘర్షణవల్ల రాష్ట్ర అభివృద్ధి నష్టపడుతున్నది. ప్రత్యేక హోదా ఆకాంక్ష ప్రజల్లో సజీవంగా ఉంది. ఆందోళనలు కొనసాగుతున్నాయి. దాన్ని మసిపూసి మారేడుకాయ చేసిన టిడిపి, బిజెపిలు రాజకీయ నాటకాలతో ప్రజలను మభ్యపెడుతున్నాయి.

ఫాసిస్టు శక్తుల క్రీనీడలు

చూపు

జనవరి 19 నుంచి 21 దాకా కోల్‌కతాలో సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో రాజకీయ తీర్మానం ముసాయిదాపై జరిగిన చర్చ సహజంగానే వామపక్ష, ప్రగతిశీల వర్గాలలో ఆసక్తి రేకెత్తించింది. 2019 సార్వత్రిక ఎన్నికలలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి రెండవ సారి అధికారంలోకి వస్తే అర్థ ఫాసిస్టు లేదా ఫాసిస్టు పోకడలు తలెత్తుతాయాన్న భయమందోళనలు ఈ సమావేశంలో కొంత మందిలో వ్యక్తమైనాయి. అదే జరిగితే వామపక్ష పార్టీలపై ఫాసిస్టు శక్తులను ఎదుర్కోవాల్సిన అగత్యం ఉంది కనక అది వారికి జీవన్మరణ సమస్యే. ఫాసిస్టు శక్తులను ఓడించడం వామపక్షాల మీద ఉన్న చారిత్రక కర్తవ్యం. దేశంలో ఫాసిస్టు పోకడలు ఉన్నాయా లేదా, ఒక వేళ ఉంటే ఆ శక్తులను ఎదుర్కోవడానికి ఎలాంటి ఐక్య సంఘటన అవసరం అవుతుందన్న చర్చ 2016 సెప్టెంబర్ నుంచే కొనసాగుతోంది.



ఫాసిజం తలెత్తడానికి అవసరమైన పరిస్థితులు దేశంలో లేవనీ, ఒక వేళ ఉన్నా ఆ అవకాశం చాలా బలహీనంగా ఉందన్న అభిప్రాయమే సిపిఐ (ఎం) నాయకులలో ఎక్కువ మందిలో ఉంది. ఈ వాదనను సిపిఐ (ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ వ్యక్తం చేస్తున్నారు. ఆయన అంచనాను సీపీఐ (ఎం)లో ఎక్కువమంది సమర్థిస్తున్నారు. అయితే రాజ్య వ్యవస్థలోని కొన్ని వ్యవస్థలను వినియోగించుకుని, హిందుత్వ దళాలు సామాజిక వ్యవస్థను మార్చడానికి కృతనిశ్చయంతో చేస్తున్న ప్రయత్నాల కారణంగా ప్రజాస్వామ్యానికి, సెక్యులరిజానికి పెద్ద ప్రమాదం పొంచి ఉందన్న అభిప్రాయం మాత్రం సిపిఐ (ఎం) లో అందరికీ ఉంది. అయితే ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఏం చేయాలి అన్న విషయంలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీలో అత్యధిక సంఖ్యాకులు 'నయా ఉదారవాదం', 'మతతత్వం' అనే రెండు సమస్యలను ఏక కాలంలో ఎదుర్కోవాలి అని భావిస్తున్నారు. అందువల్ల బీజేపీలాగే నయా ఉదారవాద విధానాన్ని అనుసరించే కాంగ్రెస్ పార్టీ ఈ పోరాటంలో వామపక్షాలకు తోడు నిలవదు అన్న భావన ఉంది.

మరో వేపున ప్రస్తుతం సిపిఐ (ఎం) అగ్రనాయకుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి 'కాంగ్రెస్ తో పొత్తులేదు, అవగాహనా లేదు' అన్న వాదన అర్థరహితమైందని భావిస్తున్నారు. కాని సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో ఏచూరి వాదన వీగిపోయింది. కేంద్ర కమిటీలో చర్చించడానికి రూపొందించిన ముసాయిదా తీర్మానాన్ని సవరించి కాంగ్రెస్ తో ఎలాంటి పొత్తూ ఉండకూడదని తీర్మానించింది. ఏప్రిల్ లో జరగనున్న సిపిఐ (ఎం) మహాసభలో దీనికి విరుద్ధమైన వైఖరిని అత్యధిక సంఖ్యాకులు అనుసరిస్తే తప్ప ప్రకాశ్ కారత్ నాయకత్వంలోని మెజారిటీ సభ్యుల అభిప్రాయమే సిపిఐ (ఎం) విధానంగా ఉంటుంది.

ఈ అంశాన్ని ఒక్క సిపిఐ(ఎం) దృష్టితో మాత్రమే కాకుండా చూస్తే 1920ల్లో, 1930ల్లో జర్మనీలో వామపక్షాలు చేసిన పొరపాటును గమనించి అంచనా వేస్తే దేశంలోని వామపక్షాలన్నీ అర్థ ఫాసిజాన్ని ఎదిరించాలంటే విశాల ప్రాతిపదికపై వామపక్షాలన్నీ 'సమైక్య ఫ్రంట్' గా ఏర్పడాల్సిందే. కేవలం పార్లమెంటరీ పంథాను అనుసరించే వామపక్షాలే కాకుండా, తీవ్రవాద విధానాలను అనుసరించే వామపక్షాలు, సోషలిస్టు భావాలు ఉన్న వారు ఏకం కాక తప్పదు. వామపక్ష వాదుల్లో కమ్యూనిస్టులు బాగా జీర్ణించుకుపోయిన ఒంటెత్తు పోకడ విడనాడి సోషలిస్టు సంప్రాదాయం ప్రకారం బహుళత్వాన్ని అనుసరించవలసిందే. అంతే కాక ఈ ఐక్య సంఘటన నయా ఉదారవాద విధానాలను వ్యతిరేకించేది అయి ఉండాల్సిందే. ఉదారవాద విధానాల పుణ్యమా అని పెట్టుబడి సమకూర్చే పద్ధతి వచ్చినందువల్ల భయంకరమైన వర్గాలు చెదిరిపోకుండా చూడాలి. దానితో పాటు ధన బలంతో ఎన్నికల ప్రక్రియను పక్క దారి పట్టించకుండా ఉండాలి. ఉదారవాదుల ఆధిపత్యాన్ని ఎదుర్కోవాల్సిందే.

అలాంటి ఐక్య సంఘటన పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించే పార్టీలతో, ప్రభుత్వాలతో ఎప్పుడు, ఏ రూపంలో ఐక్య సంఘటన ఉండాలో నిర్ణయించాలి. మితవాద పక్షాలతో, ప్రభుత్వాలతో ఎప్పుడు ఐక్య సంఘటన ఏర్పాటు చేయాలో కూడా నిర్ణయించుకోవాలి. ఫాసిస్టు వ్యతిరేక శక్తులను కలిపి 'జాతీయ ఐక్య సంఘటన' ఏర్పాటు చేయాలి. ఈ ఐక్య సంఘటన వివక్షను, విద్వేషాన్ని ముఖ్యంగా ముస్లింల పట్ల విద్వేషాన్ని గమనంలో ఉంచుకోవాలి. దీన్ని కేవలం మతాల వారీగా చూడకూడదు. వ్యవస్థాపరంగా ఉన్న అసమానతలను గుర్తించాలి. చాలా మంది ఇస్లాం మతాన్ని స్వీకరించిన వారు దోపిడీకి గురైన వారు, అణచివేతకు గురైన వర్గాలకు చెందిన వారేనన్న వాస్తవాన్ని గుర్తించాలి. ఈ విషయాన్ని జాతీయ సంఘటనల్లో ప్రస్ఫుటంగా వ్యక్తం చేయాలి.

ప్రస్తుతం ముస్లిం యువతలోఅనేక మంది పోలీసుల చేతిలో, నేర నిర్ధారణ చేసే న్యాయ వ్యవస్థ చేతిలో నలిగి పోతున్నారని గ్రహించాలి. నిజానికి హిందుత్వ వాద జాతీయ వాదుల చేతిలో, రాజ్య వ్యవస్థ మద్దతుతో ముస్లింలు అవమానకరమైన రీతిలో బాధలు అనుభవిస్తున్నారని గమనించాలి. న్యాయస్థానాలు, పోలీసులు ఈ వర్గాల వారికి న్యాయం చేయడంలో విఫలమవుతున్నాయి. అందువల్ల ఈ వర్గంలో చాలా మందికి రాజ్యవ్యవస్థ మీదే నమ్మకం సన్నగిల్లుతోంది. ఏ ఐక్య సంఘటన అయినా అందులో ముస్లింలకు, హిందుత్వ వాద బ్రాహ్మణీక వ్యవస్థ చేతిలో నలిగిపోతున్న వారికి చోటు కల్పించాల్సిందే. ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా వివక్షకు, దోపిడీకి, అణచివేతకు గురవుతున్న వర్గాల వారికి ఈ ఐక్య సంఘటనలో చోటు ఉండాల్సిందే.

ఫాసిజం, అర్థ ఫాసిజం మూలాలు, సామాజిక, ఆర్థిక, మానసిక అంశాలను గ్రహించగలిగితేనే ఈ ఐక్య సంఘటన ప్రయోజనకరంగా ఉంటుంది. అప్పుడే ప్రజా ఫ్రంట్, జాతీయ ఫ్రంట్ ఏర్పడడానికి వీలుంటుంది. సంఘ్ పరివార్ లోని రాజకీయ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. ఒక వేళ ఈ పార్టీ 2019లో మళ్లీ అధికారంలోకి వస్తే హిందుత్వవాద 'జాతీయతా' వాదుల మద్దతు ఉన్న ఈ ప్రభుత్వం ఉదార వాదరాజకీయ ప్రజాస్వామ్యాన్ని కూడా కాలరాసి హిందూ రాష్ట్ర లక్ష్య సాధనకు ప్రయత్నిస్తుంది.

*** (ఇ.పి.డబ్ల్యు.సంపాదకీయం)**

నష్ట నివారణకు ముందస్తు?

లోక్‌సభ ఎన్నికలు వందరోజుల ముందుగా ఎందుకు జరగవచ్చో 12 కారణాలు వివరిస్తూ ఇటీవల రాజేశ్ జైన్ అనే మేధావి రాసిన వ్యాసం రాజకీయ పండితులు, నాయకుల దృష్టిని విపరీతంగా ఆకర్షించింది. జైన్ 2014 నాటి భారతీయ జనతా పార్టీ (బిజెపి)మిషన్–272 ఎన్నికల ప్రచార ఉద్యమ రూపశిల్పి. ఇటీవల జరిగిన పరిణామాల నుంచి 2019 లోక్‌సభ ఎన్నికలు ముందుస్తుగా జరగడానికి కారణాలను జైన్ పేర్కొన్నారు. 2014 నుంచి బిజెపి ఎన్నికల్లో పెద్దగా రాణించకపోవడం మొట్టమొదటి కారణం. అందుచేత నష్టం తగ్గించుకోవడానికి ముందస్తు ఎన్నికలకు ఆ పార్టీ ప్రాధాన్యం ఇస్తుంది అని చెప్పవచ్చు.

వివిధ రాష్ట్రాల ఎన్నికల సమాచారాన్ని విశ్లేషిస్తే ఏ విధంగా బిజెపి హవా తగ్గిపోతోందో స్పష్టమవుతోంది. 2014 సార్వత్రిక ఎన్నికల తర్వాత నాలుగేళ్లలో 15రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. 2014లో మొత్తం 543 లోక్‌సభ సీట్లకు 282 గెలుచుకున్న బిజెపి ఆ తర్వాత 15 రాష్ట్రాల్లో ఎన్నికలను ఎదుర్కొంది. 2014 ఎన్నికలలో ఈ 15 రాష్ట్రాల్లో 191 సీట్లు గెలిచిన బిజెపి తర్వాత 45లోక్‌సభ సీట్లలో బలాన్ని కోల్పోయింది.

ఈ 15 రాష్ట్రాల ఎన్నికల తర్వాత బిజెపికి బలం లోక్‌సభ స్థానాల లెక్కలో 237అయింది. ఇది 2014 సంఖ్యాబలం కంటే(282)45 సీట్లు తక్కువ. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఈ రాష్ట్రాల ఎన్నికలు సంకేతం అయితే బిజెపి బలం తగ్గిపోతోందన్నది తిరుగులేని సత్యం. ఈ రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి ఓట్ల వాటా తగ్గుతూ ఉండడం స్పష్టంగా గోచరిస్తోంది. 2014లో ఆ 15 రాష్ట్రాల్లో బిజెపి 1,171 అసెంబ్లీ విభాగాలలో గెలుపొందింది. అయితే తర్వాత జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో అది కేవలం 854 అసెంబ్లీ సీట్లు గెలిచింది. 2014 నుంచి దాని అసెంబ్లీ సీట్ల సంఖ్యలో మూడింట ఒకవంతు నష్టపోయింది. ఓట్ల వాటా గురించి చెప్పాలంటే ఈ 15 రాష్ట్రాల్లో 2014 ఎన్నికల్లో బిజెపి 39 శాతం ఓట్ల వాటా సాధించింది. అప్పుడది 29 శాతానికి పడిపోయింది.

కరిగిపోతున్న మద్దతు

ఈ నియోజకవర్గాల్లో 2014లో ప్రతి 100 మంది ఓటర్లకు 39 మంది బిజెపిని ఎంచుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రతి 100మంది ఓటర్లకు 29 మందే బిజెపికి ఓటు వేశారు. 2014లో అత్యున్నత స్థాయిలో ఉన్న బిజెపి మద్దతు ఆ తర్వాత క్షీణించడం జరుగుతున్నట్లు రాజేష్ జైన్ వ్యాసం నిరూపించింది. నాలుగు పెద్ద రాష్ట్రాలయిన కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాబోయే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లబోతున్నది. ఈ నాలుగు రాష్ట్రాల నుంచి బిజెపికి 2014 ఎన్నికల్లో 79 పార్లమెంటరీ సీట్లు దక్కాయి. ప్రస్తుత స్థాయిలో ఆ పార్టీకి మద్దతు క్షీణించడం కొనసాగితే మరి 20 సీట్లు బిజెపికి తగ్గుతాయి.

దాంతో దాని మొత్తం క్షీణ బలం 217 లోక్‌సభ సీట్లకు తగ్గిపోతుంది. నోట్ల రద్దు, జిఎస్‌టి (సరకులు, సేవల పన్ను)అమలుపై ఎంత మేకపోతు గాంభీర్యాన్ని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ ఆర్థిక వ్యవస్థపై వాటి చెడు ప్రభావం జిడిపి, తదితర గణాంకాల్లో స్పష్టమవుతుండడంతో ఓటమి భయం ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఎంతగా పట్టుకుందో స్పష్టమవుతూనే ఉంది. నష్టాన్ని తగ్గించడానికి ముందస్తు ఎన్నికల మంత్రాన్ని మోడీ పఠిస్తున్నారు. అసలు ఆయన మనసులో జమిలి ఎన్నికలు మెదులుతున్నాయి.

అయితే అన్నిఅసెంబ్లీలు, లోక్‌సభకు ఒకే సారి ఎన్నికలు వినడానికి బాగున్నా ఆచరణలో అసాధ్యమయినవి. అందుకు రాజ్యాంగ సవరణ అవసరపడుతుందని, 2024 వరకు జమిలి ఎన్నికల ఊసు ఎత్తకూడదని ఇసి పూర్వపు కమిషనర్లు హెచ్చరించారు. రాష్ట్రాలలో రాజకీయ కల్లోలం తలెత్తినా, గవర్నర్ సిఫార్సు చేసినా రద్దు అయ్యే అసెంబ్లీకి 6 నెలల్లోగా ఎన్నికలు జరపాలని రాజ్యాంగం సూచిస్తోంది. కాని జమిలి ఎన్నికల ప్రతిపాదన వల్ల తదుపరి ఎన్నికల తేదీ దాకా వేచివుండాలి. అంతదాకా గవర్నర్ పాలన పొడిగించడం కుదరదు.అయితే లోక్‌సభకు, అయిదేళ్లు నిండిన అసెంబ్లీలతోబాటు ముందుస్తు ఎన్నికలు జరపడం సాధ్యమే. గతంలో వాజపేయి ప్రభుత్వం గడువుకు ముందే 2004లో ఎన్నికలు జరిపింది. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ముందస్తు ఎన్నికలు జరిపించారు.

తొందరపడి ముందే కూసిన వాజపేయి, బాబు

అవి వారిద్దరికీ ఎదురుతన్నాయి–అది వేరే విషయం. రెండు రోజుల క్రితం కేంద్రం ప్రకటించిన బడ్జెట్ తీరు చూస్తే ఎన్నికల హామీలు ఇబ్బడిముబ్బడిగా గుప్పించలేని దీనస్థితి కనపడుతోంది. సాహసించి ప్రకటించిన ఆరోగ్య రక్షణ వంటి ఆ కొద్ది భారీ పథకాలకు నిధుల కల్పన బాధ్యతను ప్రభుత్వం తీసుకోకుండా ప్రైవేటు బీమా సంసలకు అప్పగించింది. ఈ పరిస్థితిలో ముందస్తు ఎన్నికలకు వెళ్లక మోడీ సర్కారుకు గత్యంతరం లేదని పలువురు రాజకీయ నిపుణులు కూడా రాజేశ్ జైన్ వలెనే ఊహిస్తున్నారు.

ఈ విశ్లేషణను ఎదుర్కోవడానికి కొందరు రాజకీయ పండితులు ఓటర్ల ఓటింగ్ స్వభావాన్ని ఉటంకించవచ్చు. వారు రాష్ట్ర ఎన్నికలకు ఒకలా, జాతీయ ఎన్నికలకు మరోలా ఓటు చేస్తారన్నది వారి వాదన. ఇది యథార్థమని తేల్చే ఆధారాలు లేవు. ఓటర్ల ప్రవర్తనను అంచనా వేయడానికి ఈ వాదన చక్కటి ప్రాతిపదిక అందిస్తోంది. ఓటర్ నాడి పట్టుకున్నాం అని చాటే కొన్ని సర్వేలలో కంటే ఈ వాదనలో కొంత వాస్తవం లేకపోలేదు. అంతేకాకుండా నేను ఇంతకు ముందు చేసిన పరిశోధన ప్రకారం, రాష్ట్రాలకు, లోక్‌సభకు జమిలిగా ఎన్నికలు జరిపిన సందర్భాల్లో (1967కు ముందు ఆ పద్ధతిలోనే ఎన్నికలు జరిగేవి) 77 శాతం మంది ఓటర్లు రెండింటికీ ఒకే పార్టీని ఎంచుకున్నారని వెల్లడయింది.

ఇతర రాష్ట్రాలకు 2018లో జరగనున్న ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికలు కూడా ముందుకు జరిపి నిర్వహిస్తే ఓటరు ప్రవర్తన బలంగా ప్రభావితం అయ్యే పరిస్థితి వస్తుంది. ఎన్నికల లెక్కలు ముందస్తు లోక్‌సభ ఎన్నికలకు అనుకూలంగా జైన్ చెప్పిన జోస్యాన్ని బలపరుస్తున్నాయి. ప్రస్తుత ఏడాది ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీల ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో కర్నాటక, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పెద్దవి. అందు లో చివరి మూడు రాష్ట్రాల్లో బిజెపియే అధికారంలో ఉంది. రాజస్థాన్‌లో ఆ పార్టీ ఎదురుగాలి ఎదుర్కొంటోందని ఇటీవల ఉప ఎన్నికల్లో నిరూపితమయింది. అక్కడ రెండు లోక్‌సభ సీట్లు, ఒక అసెంబ్లీ సీటుకు జరిగిన ఉప ఎన్నికల్లో అనూహ్యంగా కాంగ్రెస్ గెలిచింది. అలాగే బెంగాల్‌లో తృణమూల్ గెలిచింది. అవన్నీ బిజెపి కోల్పోయిన సీట్లు. ఈ పరిస్థితిలో ఆయా రాష్ట్రాల ఎన్నికలతోపాటు లోక్‌సభకు ఎన్నికల జరపడం ద్వారా ఓటమి తీవ్రత ను తప్పించుకోవాలని బిజెపి వ్యూహం పన్నుతోంది.

ప్రస్తుత ఏడాది ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీల ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో కర్నాటక, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పెద్దవి. అందు లో చివరి మూడు రాష్ట్రాల్లో బిజెపియే అధికారంలో ఉంది. రాజస్థాన్‌లో ఆ పార్టీ ఎదురుగాలి ఎదుర్కొంటోందని ఇటీవల ఉప ఎన్నికల్లో నిరూపితమయింది. అక్కడ రెండు లోక్‌సభ సీట్లు, ఒక అసెంబ్లీ సీటుకు జరిగిన ఉప ఎన్నికల్లో అనూహ్యం గా కాంగ్రెస్ గెలిచింది. అలాగే బెంగాల్‌లో తృణమూల్ గెలిచింది. అవన్నీ బిజెపి కోల్పోయిన సీట్లు. ఈ పరిస్థితిలో ఆయా రాష్ట్రాల ఎన్నికలతోపాటు లోక్‌సభకు ఎన్నికల జరపడం ద్వారా ఓటమి తీవ్రత ను తప్పించుకోవాలని బిజెపి వ్యూహం పన్నుతోంది.

*** ప్రవీణ్ చక్రవర్తి**

నేత, కవితల కలనేత మఖ్దూం



కొలనుపాక కుమార స్వామి,
9963720669

ప్రజాసేవకుడు, ప్రసిద్ధ ఉర్దూ కవి. తెలంగాణలో కమ్యూనిస్టు భావాల వ్యాప్తికి తన రచనా పాటవాన్ని ఉపయోగించిన అబూ సయ్యద్ మహ్మద్ మఖ్దూం మొహియుద్దీన్ హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ముఖ్యులు. ఆయన మెదక్ జిల్లా ఆందోల్‌లో 1908 ఫిబ్రవరి 4న జన్మించారు. హైదరా బాద్‌లో స్టూడెంట్స్ యూనియన్ స్థాపించారు. కమ్యూనిస్టుపార్టీ హైదరాబాద్ నగర యూనిట్‌కు ప్రప్రథమ కార్యదర్శి మఖ్దూం తెలంగాణా సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యా లయం నుండి ఎంఏ డిగ్రీ చేశారు.



హైదరాబాద్ సిటి కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూ 1940లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం కోసం తన ఉద్యోగం విరమించారు. 1940–41లో వజీర్ సుల్తాన్ కార్మికుల సమ్మెతో ట్రేడ్ యూనియన్ రంగంలో ప్రవే శించి, ఆ తరువాత ఎన్నో కార్మిక సంఘా ల అధ్యక్షుడిగా ఉంటూ, కార్మికుల ఐక్యతకు సంఘటి తత్వానికి వారి న్యాయమైన కోర్కెల, సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. రాజకీయ ఆందోళనలో పాల్గొన్నందుకు గాను పలుమార్లు జైలుశిక్ష అనుభవించాడాయన. విప్లవాత్మకమైన ఉర్దూ గేయ రూపకాలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. మఖ్దూం రచనలు అనేకం పలు భారతీయ భాషల్లోకి అనువదించబడ్డాయి. తెలుగులో నూ ''మఖ్దూం కవిత''లు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యునిగా ఉన్నారు.

'గువెతర్' (తాజా రోజా) సుర్ఖ్ సవేరా (అరుణోదయం) ఉర్దూ కావ్య సంపుటాలు ఆయన రచించారు. అజాదీ తెలంగాణా, చాంద్ తారోంకాబస్ అనే ప్రసిద్ధ కవిత ఖండికలు రచించారు. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా కొంతకాలం పనిచేశారు. వియన్నాలోని ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయంలో కొంతకాలం కార్య నిర్వాహకుడిగా పనిచేశారు. చైనా, సోవియట్ యూనియన్ తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికా దేశాలలో మఖ్దూం విస్తృతంగా పర్యటించారు.

కార్మిక నాయకునిగా, కార్మికుల మదిలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్న ఆయన 1952లో హుజూర్ నగర్ నుంచి ఒక ఉప ఎన్నికలో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 1956లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎన్నికై 1969 ఆగస్టు వరకు ఆ సభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు.

ట్రేడ్ యూనియన్ నాయకునిగా, ఉర్దూ సాహితివేత్తగా, సామాన్య ప్రజా సంక్షేమం కోసం మఖ్దూం అహర్నిశలు శ్రమించారు. ఆయన 1969 ఆగస్టు 24న మరణించారు. తన అనుభూతులను, అనుభవాలను విప్ల వాత్మకమైన ఉర్దూ గేయ రూపకాలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారు.

నాసిరకం రోగ నిరోధక మాత్రల విక్రయాలు!

రెండు తెలుగు రాష్ట్రాల్లో నాసిరకం మందుల జోరు దందా విచ్చల విడిగా సాగుతున్నాయి. ఈ నాసిరకం మాత్రల కారణంగానే చాలా జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. భారతదేశంలోని 675జిల్లాల నుండి 57,450 మందుల నమూనాలు సేకరించారు. షాపుల్లో విక్రయించే మందుల కన్నా ప్రభుత్వ వ్యవస్థాపరంగా సరఫరా చేసే మందుల్లో అత్యధిక శాతం నకిలీవే. ప్రయోగశాలలకు మందులను పంపే విధానం గాడితప్పిందని చెప్పవచ్చు. దీనికి ఉదాహరణగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రిలో జరిగిన దుర్ఘటన మనందరికి తెలిసిందే. ఆ ఆసుపత్రిలో పంపిణీ చేసిన కాంపౌండ్ సోడియం లాక్టేట్ ఇంజక్షన్‌ను 2016మార్చిలో కొనుగోలు చేసి ఆసుపత్రికి పంపించారు. వీటికి ముందుగా ప్రయోగశాలల్లో నాణ్యత పరీక్షలు చేయించలేదు. ఔషధాల పరికరాల కొనుగోలుకు 2014–16లో బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 35శాతం వరకూ లోటు ఏర్పడింది. అలాగే ఔషధాల వాడకం వలన ఏర్పడిన లోటు భర్తీ కావడం లేదు. 385 రకాల మందుల గడువు 2015 నాటికే ముగిసినా దీన్నీ పొడిగించడంతో ప్రభుత్వ సరఫరా సంస్థలు మందులను సకాలంలో అందించలేక పోయాయి. సాధారణ రోగాల చికిత్సకు ఉపయోగపడే దాదాపు 300 రకాల జనరిక్ మందులు మన దేశంలో అందుబాటులోకి వచ్చినా వాటికి తగిన ప్రజాదరణ కనిపించడం లేదు. గ్రామీణ ఆరోగ్య మిషన్ మాటున వేలకోట్ల రూపాయలు ప్రజాధనం దారి మళ్ళిన సంఘటనలు ఉన్నాయి. ఔషధాల నియంత్రణ వ్యవస్థ ప్రకారం షోకాజ్ నోటీసులను జారీచేసి ఏ మందులను ఎంత తక్కువ చార్జీలకు విక్రయించారో ఆయా కంపెనీల నుండి అది తిరిగి వసూలు చేసుకొనే వెసులుబాటు ఉంది. అయితే ఇదంతా చట్టప్రకారం జరగాల్సి ఉంటుంది. ప్రస్తుత 2017–18లో ఔషధ ధరల క్రమబద్ధీకరణ వ్యవస్థ నిర్ణయించిన 56 కేసులను పరిశీ లించింది.

– శ్రీనివాస్ చిరిపోతుల

ఎడిటర్‌కు లేఖలు

వికలాగులకు పింఛన్లు సకాలంలో చెల్లించాలి

బంగారు తెలంగాణగా భాసిల్లుతున్నదని బాకాలూదుకుంటున్న రాష్ట్రప్రభుత్వం వికలాంగుల పింఛన్లు ప్రతినెల సకాలంలో అందించడం లేదు. నెలలో మొదటి తేదీ నుండి దాదాపు 20లేదా 25వ తేదీ వరకు వికలాంగులు ఎదురుచూపులు తప్పటం లేదు. సంక్షేమ పథకాలు భేషని సొంత డబ్బా కొట్టుకునే నేతలు చెల్లింపుల కొచ్చేసరికి జీవితాలే చెల్లిపోయే దుర్గతి పడుతున్నది.

పింఛనునే నమ్ముకొని బతుకు లీడుస్తున్న ఎంతోమందికి ప్రతి నెలా ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు కెవైసీ ఫారంలు సమర్పించాలని రకరకాల ధృవీ కరణ పత్రాలు తెచ్చివ్వాలని ఆదేశా లివ్వడం తో అసలే పలు శారీరక వైకల్య బాధలతో కునారిల్లుతున్న వారు బ్యాంకుల చుట్టూ, తహసీల్ కార్యాలయాల చుట్టూ తిప్పించడం మాత్రం అమానవీయ చర్యలు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇబ్బందులు కలుగని రీతిలో నడుచుకోవాల్సిన అవసర మున్నదనే సత్యాన్ని గ్రహించాలి. నెలవారీ పింఛను ఎలాంటి కొర్రీలు లేకుండా ప్రతినెల 1వ తేదీ నుండి 10వ తేదీలోగా వారివారి బ్యాంక్ అకౌంటులో జమచేయాలని వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

– నల్లెల్ల రాజయ్య





అదనపు హంగులు



బ్లేజర్ అనగానే కార్పొరేట్ లుక్‌తో ఆహార్యానికి మరింత హుందాతనాన్ని తెచ్చిపెడుతుందన్నది అందరికీ తెలిసిన విషయమే. కాలేజీల్లో జరిగే సదస్సులకైనా, దగ్గరివారి వేడుకలకైనా ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టే ఇవి ఇప్పుడు మరింత నాజూగ్గా అదనపు హంగులతో వస్తున్నాయి. రకరకాల రంగుల్లోనూ కనువిందు చేస్తున్న ఈ బేజర్లపై మీరూ ఓ లుక్కేయండి మరి!!

ఆకట్టుకునే అజ్రఖ్



ఆధునికతకు చిరునామా అజ్రఖ్ కలెక్షన్స్. విభిన్న డిజైన్లు, మోటిఫ్‌లతో అమ్మాయిల మనసును దోచుకుంటున్నాయి. వేసవిలో సౌకర్యవంతంగా ఉంటాయి. క్యాజువల్ వేర్, పార్టీ వేర్‌లాగా ఉపయోగించవచ్చు.

బోన్సాయి మొక్కల వీరుడు

పూర్వం ప్రతి ఒక్కరి ఇంట్లో, పొలం దగ్గర మనకు నచ్చిన మొక్కలని, ఆరోగ్యానికి మంచి చేసే చెట్లు, పండ్ల మొక్కలని పెంచుకునేవారు. గ్రామంలో ఉన్న పెద్దమనుషులు అందరు కలిసి గ్రామంలో ఉన్న ఒక చెట్టు కింద కుర్చొని గ్రామ సమస్యలని చర్చించుకునేవారు. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో వాటిపై ప్రేమ ఎవ్వరికీ లేకుండాపోయింది. ఓపిక లేక పోవడం, కాళీ స్థలం లేకపోవడం లాంటి రకరకాల కారణాల వల్ల పరిమళం వెదజల్ల లేని ప్లాస్టిక్ పూలు, ఆక్సిజన్ అందించలేని ప్లాస్టిక్ మొక్కలను ఇంట్లో అమర్చుకుంటున్నారు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేరకంగా ఉంటాయా? అభివృద్ధి జరుగుతున్న కొంతమంది వ్యక్తుల అభిరుచుల్లో కూడా మార్పులు సంభవిస్తున్నాయి. ఆ మార్పుకూడా జీవంతో ముడిపడి ఉండడం నిజంగా ఓ మంచి పరిణామం. నాడు భారీ వృక్షాలు పెంచితే నేడు చిన్నగా కనిపించే భారీ వృక్షాలను పెంచుతున్నారు కొంతమంది. అవే బోన్సాయి. ఈ మొక్కలు కొనాలంటే ఖర్చుతో కూడిన పని. కొనడం కన్నా పెంచితే అంత ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. ఈ బోన్సాయి మొక్కలు ప్రతి ఒక్కరూ పెంచవచ్చు అని అంటున్నాడు వీర్ చౌదరి.. బోన్సాయ్ మొక్కలను పెంచుతూ మిగతావారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

కాకినాడకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెళంగి ప్రాంతానికి చెందిన వీర్ చౌదరి ఎం.సి.ఏ పూర్తిచేసి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొన్ని సంవత్సరాల పాటు ఉద్యోగం చేస్తుండేవాడు. కాని తనలో ఒక రోజు చిన్న సందేహం వచ్చింది ఇది నా జీవితం కాదు, నా జీవితాన్ని నేను గడపడం లేదు అని తెలుసుకున్నాడు. అంతే వెంటనే తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటికొచ్చేసి తనకెంతో ఇష్టమైన బోన్సాయ్ మొక్కలను పెంచడం మొదలుపెట్టాడు. జపాన్‌లో పుట్టిన ఈ బోన్సాయ్ మొక్కలను పెంచడానికి వీర్ చౌదరికి ఎటువంటి నైపుణ్యం లేదు, కేవలం ఇంటర్నెట్‌లో చూసి మాత్రమే నేర్చుకున్నారు. మామూలు మొక్కను బోన్సాయ్ మొక్కగా వృద్ధి చేయడానికి దాదాపు మూడు సంవత్సరాలు పడుతుంది. కత్తిరింపు దగ్గరి నుండి ఎదుగుదల వరకు దీనిని ఒక పద్ధతి ప్రకారం, జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. వీర్‌కు మొదట కాస్త ఇబ్బందిగా అనిపించింది. కాని పూర్తి సమయాన్ని వీటి మీద కేంద్రీకరించడం వల్ల బోన్సాయ్ మొక్కల పెంపకంలో ఆరితేరాడు. తన సొంత ప్రాంతంలో బోన్సాయ్ మొక్కలను చూసిన బంధువులు, స్నేహితులు ఎంతగానో ముచ్చట పడిపోయేవారు. వారి ఇష్టాన్ని గమనించిన వీర్ ప్రేమగా పెంచిన మొక్కలను ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. ఈ మధ్య కాలంలో బోన్సాయ్ మొక్కలు విరివిగా దొరుకుతున్నాయి కాని వీటిని ఎలా పెంచాలి..? అనే విషయంపై కోచింగ్ ఎవ్వరూ ఇవ్వడం లేదు. ఆ రహస్యం తెలిస్తే తమ వ్యాపారం దెబ్బతింటుంది అని వ్యాపారులు అనుకున్నా, వీర్ మాత్రం తెలుగు రాష్ట్రాలు మొదలుకొని ముంబయి, ఢిల్లీ, బంగళూరులాంటి ప్రాంతాలతో పాటు విదేశాలలో కూడా ఉచితంగా ట్రైనింగ్ ఇస్తున్నాడు. ఈ ప్రయాణంలో వీర్ ఎన్నో అవార్డులు అందుకున్నాడు. వడోదరలో వీర్ ప్రదర్శించిన మర్రిజాతి బోన్సాయ్ ఫైకస్ రూబిగనోసా అనే మొక్కకు దేశంలోనే రెండో అత్యుత్తమ అవార్డు వరించింది. మైసూర్‌లో జరిగిన ఓ కాంపిటేషన్‌లో ఒక మొక్కను అప్పటికప్పుడు బోన్సాయ్‌గా మలిచి మొదటి స్థానాన్ని గెలుచుకున్నాడు. ఇలా ఎన్నో సార్లు రకరకాల అవార్డులను తన ప్రతిభ ద్వారా అందుకున్నాడు.



జాబ్రా ఇయర్ ఫోన్స్



చాలా మందికి జిమ్‌లో వ్యాయమం చేసేటప్పుడు చెవులకు హెడ్‌ఫోన్లు ఉండాల్సిందే. అందుకోసమే ఇప్పుడు రకరకాల వైర్‌లెస్ హెడ్‌ఫోన్లు వస్తున్నాయి. కానీ అవన్నీ చాలా బరువుగా ఉండటంతో అంత సౌకర్యంగా అనిపించవు. అందుకే జాబ్రా ఎలైట్ స్పోర్ట్ పేరుతో మార్కెట్లోకి వచ్చిన ఈ ఇయర్ ఫోన్స్ తేలికగా ఉండటమే కాదు అచ్చంగా వ్యాయామం చేసేవాళ్లకోసమే ప్రత్యేకంగా డిజైన్ చేశారట.


ఆన్‌లైన్ వేధింపులకు చెక్



ఎప్పటికప్పుడు సెల్ఫీలు దిగి వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లాంటి సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకోవడం చాలా మందికి అలవాటుగా మారింది. అప్పుడప్పుడూ దీని వల్ల ఇబ్బందులు పడేవాళ్లూ ఉన్నారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టారు మధ్యప్రదేశ్ పోలీసులు. ఈ మధ్య మధ్యప్రదేశ్‌లో సామాజిక మాధ్యమాలకు సంబంధించి రకరకాల ఆన్‌లైన్ వేధింపుల కేసులు అక్కడి పోలీస్ స్టేషన్లలో ఎక్కువగా నమోదయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన హోషంగాబాద్ జిల్లా పోలీసులు వినూత్నంగా ఈ సమస్యకు చెక్ పెట్టాలనుకున్నారు. అమ్మాయిలు పోలీసులతో ఫొటోలు దిగి ప్రొఫైల్ చిత్రాలుగా పెట్టుకునే అవకాశం కల్పించారు. 'టీఐ మేరా భాయ్' అనే పేరుతో ప్రచారం మొదలెట్టారు. టీఐ అంటే స్థానిక ఠాణా అధికారి అని అర్థం. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల, కాలేజీ విద్యార్థినులు, ఉద్యోగినులు స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జితో సెల్ఫీ దిగే అవకాశాన్ని అధికారులు కల్పిస్తున్నారు. ఆ చిత్రాన్ని ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకుని స్థానిక పోలీస్ అధికారి మా అన్నయ్య అని స్టేటస్ రాసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వేధింపుల పర్వం కొద్దిగన్నా తగ్గవచ్చని వారి ఆలోచన. ఇది ప్రారంభించిన వారం రోజుల్లోనే ఎంతో మంది అమ్మాయిలు పోలీస్‌స్టేషన్లకు వచ్చి పోలీసులతో సెల్ఫీలు దిగడం మొదలెట్టారట. తమ ఐడియాకి మంచి స్పందన వచ్చిందని సంతోషపడుతున్నారు అక్కడి పోలీసులు. ఈ ఆలోచన మిగతా జిల్లాల్లోనూ అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. అసలీ ఆలోచనకు ఆద్యుడైన హోషంగాబాద్ ఎస్పీ ఏ.పీ. సింగ్‌కు డీజీపీ బెస్ట్ ప్రాక్టీస్ అవార్డును ప్రకటించారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై కౌంటర్ పిటిషన్‌కు ఆదేశం



మన తెలంగాణ/ హైదరాబాద్: ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ విధానాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారి సర్వీసులకు ప్రభుత్వ ఉద్యోగాల సమయంలో వెయిటేజీ మార్కులు ఇవ్వాలనే నిర్ణయాన్ని సవాల్ చేసిన కేసుల్లో తమ వాదనతో కౌంటర్ పిటిషన్ వేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వైద్య శాఖలో నర్సులు, అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్లు, ట్రాన్స్‌కోల్లో ఇంజినీరింగ్ పోస్టుల భర్తీ సమయంలో పైవిధానాల్లో చేసే పనిచేసే వారికి వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో సింగిల్ జడ్జి.. ఇది సరైన నిర్ణయమేనని ఉత్తర్వులు ఇచ్చారు. రెగ్యులర్ అభ్యర్థులకు/పైవిధానాల్లో పనిచేసే వారికి సమాన మార్కులు వచ్చినప్పుడు మాత్రమే వెయిటేజీ అమలు చేయాలని ఇంకో సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారు. రెండు వేరువేరు విరుద్ధ ఆదేశాలు వెలువడిన నేపథ్యంలో ఈ వ్యాజ్యాలను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని సింగిల్ జడ్జి హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. సోమవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ రిట్లను విచారించింది. ఇప్పటికిప్పుడే ఉద్యోగాల భర్తీ కాబోవు కాబట్టి స్టే మంజూరు అవసరం లేదని అడ్వకేట్ జనరల్ ప్రకాష్‌రెడ్డి వినతిని బెంచ్ ఆమోదించి స్టే ఇవ్వడానికి వ్యతిరేకించింది.

అభివృద్ధి, పన్నుల తీరుపై ఆరా

10 పురపాలికలను పరిశీలించనున్న అధికారుల బృందం



మన తెలంగాణ/హైదరాబాద్: పురపాలికలలో అమలవుతున్న 14వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, వివిధ అభివృద్ధి కార్యక్రమాల తీరుపై ప్రత్యక్షంగా పరిశీలన జరపాలని పురపాలక శాఖ నిర్ణయించింది. తొలుత పది పురపాలికలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో 14వ ఆర్థిక సంఘం ద్వారా చేపడుతున్న పనులు, వాటి పురోగతిపై ఆరా తీయనున్నారు. ఆస్తిపన్నుల వసూళ్లను సమీక్షించడంతోపాటు 50 శాతం పన్ను వసూలు కాని పురపాలికలను పరిశీలించి క్షేత్ర స్థాయి నివేదికను రూపొందించి అందించనున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల విడుదల, వాటి ఖర్చులపై పురపాలక శాఖ సమీక్ష నిర్వహించగా గత ఆర్థిక సంవత్సరంలో 60% నుంచి 95% వరకు ఆస్తి పన్నులు వసూలైనా ఈ సంవత్సరం మాత్రం 50% కూడా వసూలు కాలేదని ఉన్నతాధికారులు గుర్తించారు. కొన్ని పురపాలికలలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నట్లు గుర్తించారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి కాకపోతే కేంద్ర నిధులు వచ్చే అవకాశాలు లేవని, పనుల వేగాన్ని మరింత పెంచాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. కేంద్ర నిధులతో చేపడుతున్న పనులను నిర్ణీత కాలపరిమితిలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పది పురపాలికలు ఇవే..



కొత్తగూడెం, పాల్వంచ, ఎల్లందు, మధిర, సత్తుపల్లి, మంచిర్యాల, హుస్నాబాద్, నారాయణ్‌పేట్, ఇబ్రహీంపట్నం, జెల్‌పల్లి పురపాలికలను పురపాలిక శాఖలోని ఉన్నతా ధికారులు పర్యవేక్షించనున్నారు. కాగా 2017–18 ఆర్థిక సంవత్సరంలో(నవంబర్ నాటికి) ఇబ్రహీంపట్నం, పాల్వంచ పురపాలికలలో కేవలం 15 శాతం లోపే పన్నులను వసూలైనట్టు తెలిసింది. త్వరలోనే 50 శాతం మేర పన్నును వసూలు చేయడంతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి 90 శాతం వరకైనా చేరుకోవాలని, ఇందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పురపాలక శాఖ ఆదేశించినట్లు తెలిసింది.

కర్నాటకలో భారీ బహిరంగ సభ



మనతెలంగాణ /హైదరాబాద్/ముషీరాబాద్ : పార్లమెంటలో బిసి బిల్లు పెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ల పెట్టాలని డిమాండ్‌తో రెండు తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటకలో భారీ ఎత్తున బహిరంగ సభలు జరుపుతున్నట్లు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం హైదరాబాద్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో కృష్ణయ్య మాట్లాడుతూ ఈ నెల 7న కరీంనగర్ జిల్లా మంథనిలో, 9వ తేదీన పరిగిలో, 21న తిరుపతిలో, 25న విజయవాడలో, 29వ తేదీన కర్ణాటక బీదర్‌లో భారీ ఎత్తున బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో, రాజ్యసభలో సభ్యులు విజయసాయి రెడ్డి బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని ప్రవేశపెట్టిన బిల్లుకు అన్ని రాజకీయ పార్టీల పార్లమెంట్ సభ్యులు మద్దతు తెలిపారన్నారు. రాష్ట్రాల వ్యాప్తంగా జరగనున్న బహిరంగ సభలకు బిసి సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, ఆయా పార్టీల్లో ఉన్న బిసి నాయకులు రాజ్యాధికారంలో వాటా కోసం జరిగే ఈ పోరాటంలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, గుజ్జ రమేష్, సి.రాజేందర్‌లున్నారు.

నేడు కలెక్టరేట్ల ముందు ధర్నాలు- దీక్షలు

చట్ట సభల్లో రిజర్వేషన్లు పెట్టాలని, కాలేజీ విద్యార్థులకు పూర్తి ఫీజుల రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు (మంగళవారం) తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, దీక్షలు జరపాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజనం వాటికి ఇవ్వొద్దు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అక్షయ, నాంది లాంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా అందజేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐటియుసి జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) అధ్యక్షురాలు పి.ప్రేంపావనిలతో కూడిన ప్రతినిధి బృందం రాష్ట్ర పాఠశాల విద్యా డైరెక్టర్ జి.కిషన్‌ను సోమవారం కలిసి ఒక వినతి పత్రాన్ని అందజేసింది.

రోడ్డుపై డ్యాన్స్‌తో యువతి నిరసన



చండీగఢ్: ఇటీవల కాలంలో ప్రేమ పేరుతో మోసపోతున్న యువతి యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతన్న ఘటనలు తరుచూ జరుగుతునే ఉన్నాయి. అయితే తాజాగా హర్యానాకు చెందిన ఓ యువతి మాత్రం తనను మోసం చేసిన ప్రియుడి ఇంటిముందు వెరైటీ నిరసనకు దిగింది. ప్రియుడి ఇంటి ముందు డిజె పెట్టుకుని డ్యాన్స్ చేసి హల్‌చల్ చేసింది. హర్యానాలోని పటౌడీ ప్రాంతంలో వినూత్న నిరసనకు దిగింది ఆ ప్రియురాలు. గత కొంతకాలంగా తనను ప్రేమిస్తున్నానని చెప్పి ఇటీవల వదిలేయడంతో తట్టుకోలేకపోయిన యువతి పూటుగా మద్యం సేవించి ప్రియుడి ఇంటిముందు చిందులేసింది. ఆమె చిందులు చూసి అక్కడివారంతా నోరెళ్లబెట్టారు. చాలా మంది గుమిగూడిన తను మాత్రం తనకేమి పట్టనట్లు నృత్యం చేస్తూనే ఉంది. అయితే ఈ తతంగాన్నంతటినీ అక్కడే ఉన్న ఓ యువకుడు వీడియో తీసి అంతర్జాలంలో పెట్టాడు. బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ నటించిన బ్లాక్‌బస్టర్ రాజా హిందుస్థానీ చిత్రంలోని 'తేరే ఇష్క్ మే నాచేంగే' అనే పాటపై యువతి ఓ రేంజ్‌లో రెచ్చిపోయింది. ప్రస్తుతం ఈ భగ్న ప్రేమికురాలి వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తోంది.

12న ఉపాధి కార్యాలయాల ముట్టడి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వశాఖల్లో ఖాళీగా వున్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కల్పన కార్యాలయాలను ముట్టడించనున్నట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధినేని కర్ణకుమార్, ప్రధానకార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం వారు ఆవిష్కరించారు. సిద్ధినేని కర్ణకుమార్ మాట్లాడుతూ ఉపాధి కల్పన కార్యాలయాల్లో పేరు నమోదు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం లేదా ఉపాధి కల్పించాలని, లేదా నిరుద్యోగులకు ప్రతి నెల రూ.5 వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష ఉద్యోగాల కల్పన హామీని తక్షణమే అమలు చేయాలని అనిల్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.




ప్రచ్ఛన్న యుద్ధం ఆలోచన వద్దు

బీజింగ్ : అణ్వాయుధాల ప్రయోగాల విషయంలో అమెరికా చేసిన హెచ్చరికలను చైనా తప్పుబట్టింది. ప్రచ్ఛన్న యుద్ధం అనే ఆలోచనా విధానాన్ని అమెరికా విడిచి పెట్టాలని చైనా హితవు పలికింది. అమెరికా అణ్వస్త్ర వ్యూహ సమీక్ష(ఎన్‌పిఆర్)పై చైనా రక్షణశాఖ మంత్రిత్వశాఖ సోమవారం నాడు ఓ ప్రకటనను విడుదల చేసింది. భద్రతా పరమైన అంశాల కోసం మాత్రమే కొద్దిస్థాయిలో అణ్వస్త్రాలు అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రచ్ఛన్న యుద్ధమనే ఆలోచనా విధానం నుంచి యూఎస్ బయటకు రావాలని పేర్కొంది.

అణ్వాయుధ ప్రయోగాల విషయంలో బీజింగ్ పరిమితులు పాటించాలని, ఆసియా ప్రాంతంలో ప్రయోజనాలను పొందేందుకు అణ్వాయుధాలను ప్రయోగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా రష్యా, చైనా దేశాలకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. అమెరికా, దాని మిత్ర దేశాలపై ఎటువంటి అణుప్రయోగాలు జరిపినా, అణ్వస్త్రాలు ఉగ్రవాదులకు దక్కేలా చేసినా సహించబోమని అందుకు ఆయా దేశాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని శనివారం యుఎస్ హెచ్చరించిన విషయం తెలిసిందే.

లోథా సిఫార్సుల అమలేది?

హెచ్‌సిఎపై హైకోర్టు ఆగ్రహం



మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం జస్టిస్ లోథా కమిటీ చేసిన సిఫార్సులు ఎందుకు అమలు చేయడం లేదో వివరణ ఇస్తూ కౌంటర్ వ్యాజ్యం దాఖలు చేయాలని హెచ్‌సీఏను హైకోర్టు ఆదేశించింది. హెచ్‌సీఏలో అక్రమాలు జరిగాయని, నిధుల స్వాహా కూడా జరిగిందని, జస్టిస్ లోథా కమిటీ సిఫార్సులు అమలు చేయకుండా పాలన ఇష్టానుసారంగా చేస్తున్నారని పేర్కొంటూ న్యాయవాది గోవింద్‌రెడ్డి దాఖలు చేసిన కేసును సోమవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ ఆరోపణలపై హైకోర్టు నియమించిన సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఎ.ఆర్.దవే, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి సీతాపతిలతో కూడిన కమిటీ హైకోర్టుకు నివేదిక సమర్పించింది. గతంలోనే ఈ కమిటీ హెచ్‌సీఏలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు నివేదిక ఇచ్చింది. తాజాగా జస్టిస్ లోథా కమిటీ సిఫార్సులు కొంతమేరకే అమలు జరుగుతు న్నాయని రిటైర్డు న్యాయమూర్తుల కమిటీ నివేదిక ఇచ్చింది. దీనిని చూసిన హైకోర్టు బెంచ్.. హైచ్‌సీ ఏతోపాటు పిటిషనర్ కూడా ఆ నివేదికపై కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణ ఈ నెల చివరి వారానికి వాయిదా పడింది.

న్యాయవాదుల సంక్షేమానికి
బడ్జెట్‌లో నిధులు
ఐఎఎల్ డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలోని న్యాయవాదుల సంక్షేమానికి, కోర్టుల అభివృద్ధికి, సిబ్బంది ఏర్పాటుకు కక్షిదారుల సౌలభ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) డిమాండ్ చేసింది. జైపూర్‌లో రెండు రోజుల పాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్.ఎస్. చీమా అధ్యక్షతన జరిగిన ఐఎఎల్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగీవ్రంగా ఆమోదించింది. దేశంలో పెరుగుతున్న అసహనం పట్ల జాతీయ కార్యవర్గ సమావేశం తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ మూలసూత్రాలను నిర్వీర్యం చేయకుండా వ్యవహరించాలని, ఆదేశిక సూత్రాల అమలుకు చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది. అందుకు దేశ వ్యాపితంగా ప్రజలను, న్యాయవాదులను చైతన్యపరచేందుకు కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది జితేంద్ర శర్మ, సమావేశాల ఆహ్వాన సంఘ అధ్యక్షులు కునాల్ రావత్, ప్రధాన కార్యదర్శులు మురళీధర, ఆర్.లోహిత్, బి. ప్రభాకర్, వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఎల్ సభ్యులు ఎ.వి.కృష్ణారావు, రాథోడ్ సుమన్, కె.యం. ప్రసాద్, డి. జనార్ధన్ తదితరులు సమావేశంలో ప్రసంగించారు. 'దేశంలో అసమానతలు – వాటి పరిష్కారం' అంశంపై మహావీర్ అడిటోరియంలో జాతీయస్థాయి సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మునీష్ పాండరీ, సంజీవ్ ప్రకాష్ శర్మ, జాతీయ విశ్రాంత న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు ఎ.బి.దావేలో హాజరయ్యారు. మహారాష్ట్ర సీనియర్ న్యాయవాది నిలోఫర్ భగవతి ఈ అంశంపై పత్రాన్ని సమర్పించగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది మథుర్, తదితరులు ప్రసంగించారు.

వడ్డీలేని రుణం



(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలో ఎక్కడా లేని విధంగా మహిళలకు మంత్రి వర్గంలో అవకాశం కల్పించకుండా వారిని అవమానించారన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 60ఏళ్లు దాటిన వారికి ఇచ్చే అభయాస్తం రూ.500 పెన్షన్‌ను రద్దు చేశారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభయాస్తంపెన్షన్‌ను రూ.1000 కి పెంచుతామన్నారు. రాష్ట్రంలోని 4,200 మంది సెర్ప్ ఉద్యోగులను పర్మినెంట్‌చేస్తామన్నారు. ఒక్కొ మహిళా సంఘానికి రూ. లక్ష రివాల్వింగ్ ఫండ్ ఇస్తామన్నారు. మహిళల పట్లచిన్నచూపు చూసే కెసిఆర్‌కు 2019 ఎన్నికల్లో మహిళలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మహిళలకు న్యాయంగా రావాల్సిన వడ్డీలేని రుణాల బకాయి 70 లక్షల మంది మహిళలకు రూ.2వేలకోట్లు ఇవ్వకుండా బకాయి ఉంచిందని ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2వేలకోట్లు మహిళా సంఘాలకు చెల్లిస్తామన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల భవనాలకు రూ.15లక్షలు,మండల స్థాయిలో రూ.30 లక్షలు ఇచ్చి భవనాలను నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి,జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుస్మితాదేవ్, అసెంబ్లీ ఉప నేత జానారెడ్డి, మాజి ఎంపి మధుయాష్కి, మల్లుబట్టివిక్రమార్క, గీతారెడ్డి, డికె అరుణ,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నేరేళ్ల శారదా,ఎంఎల్‌ఎ సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఉరేసుకున్న ఇద్దరు విద్యార్థులు

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో విద్యార్థి ఆత్మహత్య : పరీక్షలో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లోని బిట్స్ ఫిలానీ క్యాంపస్‌లో సోమవారం జరిగింది. జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వివి చలపతి తెలిపిన వివరాల ప్రకారం చెన్నై నగరానికి చెందిన రాఘవ్ శాంతారాం (21) బిట్స్ పిలాని క్యాంపస్‌లో ఇఇఇ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ఇండియా, దక్షిణాఫ్రికా క్రికెట్ ఆట చూసిన పిదప తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్న రాఘవ్ సోమవారం మధ్యాహ్నం 1.45 అవుతున్నా బయటకు రాకపోవడంతో స్నేహితుడు తేజస్ గది తలుపు కొట్టగా, ఎలాంటి స్పందన లేకపోవడంతో హాస్టల్ వార్డెన్ నాగమోహన్‌కు సమాచారం ఇచ్చాడు. వార్డెన్ తలుపులు పగలగొట్టగా రాఘవ్ శాంతారాం గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకొనిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ చలపతి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు సిఐ తెలిపారు. అనతరం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ ఘాతుకాన్ని ఏమనాలి?

(మొదటిపేజీ తరువాయి)

డెంటల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా హరేందర్‌గౌడ్‌కు భార్య జ్యోతితో పలు విషయాల్లో మనస్పర్థలు వచ్చినట్లు, దానికి తోడుగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు, దాంతో హరేందర్‌గౌడ్ మద్యానికి అలవాటు పడ్డాడని, నిత్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ చేసే వాడని స్థానికులు తెలిపారు. ఆదివారం రాత్రి హరేందర్‌గౌడ్, జ్యోతి తీవ్రంగా ఘర్షణ పడ్డారు. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో హరేందర్‌గౌడ్ భార్య జ్యోతి, అభితేజ్, సహస్రలను గొంతునులిమి దారుణంగా హత్య చేసి నేరుగా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సంఘటన స్థలానికి మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మదన్ మోహన్, ఎస్‌ఐ రాఘవేందర్‌లు హుటాహుటిన చేరుకొని మృత దేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వికేంద్రీకరణే

(మొదటిపేజీ తరువాయి)

పట్టణాల్లో ఇప్పటికే రూ.4500 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. 15 వేల జనాభా మించిన గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగాను, మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, ఇందుకు కావాల్సిన నిధులను కూడా విడుదల చేస్తామన్నారు. వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు పాలన ఫలాలు అందుతాయన్నారు. ఈ ఏడాదిలో పలు పథకాలు కీలకమైన దశకు చేరుకున్నాయని, వాటిని పూర్తి చేసే దిశగా పని చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పదోన్నతులు,ఖాళీల భర్తీ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్ర కరణ్‌రెడ్డి, ఎంఎల్‌ఎ వి.శ్రీనివాస్‌గౌడ్ తదితరుల పాల్గొన్నారు.

పాస్‌బుక్కుల వ్యథ

(మొదటిపేజీ తరువాయి)

లోపల పూర్తయ్యేటట్లు చూడాలని' ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేయడంతో ఆ లక్ష్యాన్ని ఏ విధంగా పూర్తి చేయాలనేదానిపై రెవిన్యూ అధికారులు తలమునకలయ్యారు. నాసిక్, దేవాస్ లాంటి చోట్ల పాస్‌బుక్‌ల ముద్రణ సాధ్యంకాకపోవడంతో హైదరాబాద్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ మాత్రమే ఏకైక వనరు అనే స్పష్టత వచ్చింది. అయితే ఈ ప్రెస్‌కు ఉన్న పరిమితుల దృష్ట్యా మార్చి 11వ తేదీన పాస్‌బుక్‌ల పంపిణీ ఏ విధంగా జరుగబోతుందనేదానిపై అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. ఒకే రోజున 72 లక్షల మంది రైతులకూ పంపిణీ అవుతాయా లేక లాంఛనంగా ప్రారంభించి దశలవారీగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

ఖాప్ షటప్!

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వం లోని ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. 'తల్లిదండ్రులు, సమాజం, ఎవరైనా సరే.. ఇద్దరు వయోజనులు వివాహం చేసుకుంటే అందులో కల్పించుకునే హక్కు ఎవరికీ లేదు. వ్యక్తిగతంగా, మూకుమ్మడిగా కాని ఆ వివాహంలో జోక్యం చేసుకోవడానికి వీలులేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఒక వివాహం సరైనదా కాదా? మంచిదా? చెడ్డదా? అనేది మనం చెప్పలేం. ఈ వాదనకు దూరంగా ఉండాలి' అని దీపక్ మిశ్రా అన్నారు. 'ఇద్దరు వ్యక్తులు పెళ్లి చేసుకున్నారు. వారిద్దరూ మేజర్లు..అలాంటప్పుడు వారి వివాహంలో మీరు జోక్యం చేసుకోవడం కుదరదు' అని పేర్కొన్నారు. మేజర్లయిన మహిళ, పురుషుడు వివాహం చేసుకుంటే ..ఖాప్ లేదా పంచాయతీ లేదా సమాజం ఎవరూ కూడా వారిని ప్రశ్నించే హక్కు లేదని ధర్మాసనం పేర్కొంది. 'ఖాప్ పంచాయత్' పేరిట చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుంటున్న వారిపైనా, పరువు హత్యలపైనా నిషేధం విధించాలంటూ శక్తి వాహిని అనే సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మధ్యయుగం నాటి సంప్రదాయాలను కాపాడడం తమ బాధ్యత అన్నట్టు భావిస్తున్న ''ఖాప్ పంచాయత్''లు.. కుటుంబం ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకునే జంటలను విచారించి శిక్షిస్తున్నాయని తన పిటిషన్‌లో పేర్కొంది.

ఉత్తర భారత దేశంలో ప్రత్యేకించి హర్యానాలో ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నాయని శక్తి వాహిని నివేదించింది. అయితే అలాంటి పరువు హత్యలకు తాము వ్యతిరేకమని ఖాప్ పంచాయత్‌ల తరపున వాదిస్తున్న లాయర్ కోర్టుకు తెలిపారు. అయితే ఖాప్ పంచాయత్‌లతో తమకు సంబంధం లేదనీ.. పెళ్లిచేసుకున్న జంటల హక్కులపైనే అడుగుతున్నామని సుప్రీం స్పష్టం చేసింది. కాగా, ధర్మాసనం ఈ కేసును ఈనెల 16కు వాయిదా వేసింది.

పకోడీలు అమ్మితే ఏం?

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ విఫలమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఓ ప్రక్క ప్రశంసిస్తూనే మరో ప్రక్క కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. తాము అధికారంలోకి రాక ముందు దేశ పరిస్థితి ఎలా ఉండేదో గుర్తించుకోవాలని, అప్పుడు విధాన వైఫల్యం చాలా ఎక్కువగా ఉండేదని అన్నారు. గత మూడున్నరేళ్లలో ఆ పరిస్థితిని చాలా వరకు మార్చేశామని అన్నారు.

ఈ మూడున్నరేళ్ల ఎన్‌డిఎ పాలనలో చరిత్రలో నిలిచిపోయే పనులు చేశామన్నారు. మహాత్మా గాంధీ, దీన్‌దయాళ్ కలల్ని సాకారం చేసే దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జన్ ధన్ యోజన తమ గొప్ప విజయమని, 31 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిపించామని అన్నారు. అంతేకాక స్వచ్ఛభారత్, మరుగుదొడ్ల నిర్మాణం, సర్జికల్ స్ట్రయిక్స్, ట్రిపుల్ తలాక్, ఒకే ర్యాంకు ఒకే పింఛను, 16 వేల గ్రామాలకు విద్యుదీకరణ, బడ్జెట్‌లో పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య సంరక్షణ పథకం తదితర అంశాలను అమిత్ షా చెప్పుకొచ్చారు. పేదలు, అణగారిన వర్గాలు, రైతులు, యువత, గిరిజనులు, దళితులు, మహిళలకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీ కోసం కృషి చేస్తున్నామన్నారు.

మోడీని మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రితో అమిత్ షా పోల్చారు. నాడు పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధ సమయంలో ఒక రోజు ఉపవాసం ఉండి ఆహార సరుకును ఆదా చేయాలని లాల్ బహదూర్ శాస్త్రి దేశప్రజలకు పిలుపునిచ్చారని, నేడు సంపన్నులు స్వచ్ఛందంగా గ్యాస్ సబ్సిడీని వదులుకోవాలని మోడీ కోరారని ఆయన ఉదాహరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని అందరికీ ఇళ్ల నిర్మాణాన్ని తమ ప్రభుత్వం వాగ్దానం చేసిందని, ఉజ్వల పథకం కింద ఇస్తున్న గ్యాస్ కనెక్షన్లు మహిళల జీవితాన్ని మార్చేస్తున్నాయని అమిత్ షా చెప్పారు. వంశపాలన, కులతత్వం, వివక్ష వంటి రుగ్మతలకు మోడీ అంతం పలికారని కూడా తెలిపారు. గత ఏడాది రాజ్యసభకు ఎన్నికైన అమిత్ షా వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి)ని కాంగ్రెస్ 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' అని హేళన చేయడాన్ని విమర్శించారు. ప్రతిపక్షం పన్నులు చెల్లించొద్దని ప్రజలను రెచ్చగొడుతుందని అన్నారు.



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : కుందూరు జానారెడ్డి

మన తెలంగాణ/గుర్రంపోడ్ : ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి కాలం గడుపుతూ ప్రజా సమస్యలను టిఆర్‌ఎస్ ప్రభుత్వం గాలికొదిలేస్తుందని సిఎల్‌పి నేత జానారెడ్డి అన్నారు. సోమవారం పలు గ్రామాలను ఆయన పర్యటించి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలను పార్టీ కండువాలతో కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్‌ఎస్ ప్రజలకు ఉపయోగపడని పథకాలను ప్రవేశపెట్టి కోట్లాది ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తుందన్నారు. ఎన్నికల్లో దళితులకు 3ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మిస్తానని నేటికి ఎక్కడా కూడా శంకుస్థాపన చేసిన దాఖలులేవన్నారు. ప్రభుత్వం ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులైన వారికి ఇండ్లను మంజూరు చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో 2019లో అధికారంలోకి తీసుకరావడానికి పార్టీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాల చిన్న సత్తయ్య యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కుప్ప రాములు గౌడ్, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, దామెరగూడెం, పోచంపల్లి, తానేదా రిపల్లి, గ్రామాల్లో టిఆర్‌ఎస్, టిడిపికి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు సీఎల్పీ నేత జానారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

అత్యధిక రైతు ఆత్మహత్యల జిల్లా సిద్దిపేట

జెఎసి చైర్మన్ ప్రొ.కోదండరామ్



మన తెలంగాణ/సిద్దిపేట అర్బన్ : రాష్ట్రంలో అత్యధిక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న జిల్లా ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న సిద్దిపేట అని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొ.కోదండరామ్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా ఫోరం 6వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికే వెన్నెముక అయిన రైతు ఆత్మహత్యలు ఆగి వారి కష్టానికి సరైన ఫలితం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. రైతులకు ఋణాలు సకాలంలో అంది విత్తనాలు సరైన ధరలకు అందినప్పుడు పంట పండి సరైన ధర వచ్చినప్పుడే వారికి సంతోషమని, అలాగే పంటకు నష్టం వాటిల్లితే నష్ట పరిహారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 3500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే అందులో ప్రభుత్వం గుర్తించింది 750 మంది రైతులని, వారిలో కేవలం 405 మందికి మాత్రమే చెక్కులు అందాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి శ్రీకారం కడుతున్నామని ప్రొ.కోదండరాం అన్నారు. లక్ష్య సాధనలో ప్రచార యాత్రలు, అవగాహన సదస్సులు, దీక్షలు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నామని రైతులకు న్యాయం జరిగే వరకు ఇవి కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాక్ నాయకులు వంగరాంచంద్రారెడ్డి, బాపురావు, భైరి నర్సింలు మురిరాజ్, పాల్గొన్నారు.

సంగీత దర్శకుడు మణిశర్మ ఇంట్లో చోరీ

మన తెలంగాణ / సిటీబ్యూరో : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మణిశర్మ ఇంట్లో చోరీ జరిగింది. తన ఇంట్లోని బీరువాలో ఉన్న రూ. 4 లక్షలను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్టు బంజారాహిల్స్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్‌లోని తన ఇంట్లో కొద్ది రోజుల క్రితం రూ. 4 లక్షల నగదును బీరువాలో భద్రపరిచానని, అనంతరం ఈ ఆదివారం అవసరాల నిమిత్తం బీరువాలోని నగదును తీసుకునేందుకు చూడగా ఆ నగదు కనిపించలేదు. దీంతో తన మేనేజర్ సుబ్బానాయుడు ద్వారా బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు మృతి

మన తెలంగాణ/ ఇబ్రహీంపట్నం : రెండు మోటర్ సైకిళ్ళు ఎదురెదురుగా ఢీ కొని ఓ యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికి అక్కడే మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మహేశ్వరం మండలం రావిరాల గ్రామానికి చెందిన ఆలేటి సురేష్(33) అనే యువకుడు ఆదివారం రాత్రి కొంగర కలాన్ నుండి రావిరాలకు బైక్‌పై వెళుతుండగా ఇబ్రహీంపట్నం మండలం తుర్క గూడ గ్రామానికి చెందిన మంద నరేందర్(24) బైక్‌పై రావిరాల నుండి కొంగర కలాన్ గ్రామానికి వస్తున్నారు. ఆదివారం రాత్రి సాయిబాబ దేవాలయం సమీపంలో రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. సురేష్ తీవ్ర గాయాలతో మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నరేందర్ మృతి చెందారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ గోవిందారెడ్డి తెలిపారు.

ఘరానాదొంగ మంత్రి శంకర్ అరెస్టు

రూ. 15 లక్షల సొత్తు స్వాధీనం

మన తెలంగాణ/ సిటీబ్యూరో : 39 ఏళ్ళుగా ఇంళ్ళల్లో దొంగతనాలు చేస్తున్న ఘరానా దొంగ మంత్రి శంకర్‌ను నగర పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ. 370 గ్రా॥ బంగారం, ఒక అవెంజర్ మోటార్‌సైకిల్, రూ. 3.20 లక్షల నగదుతో పాటు మొత్తం రూ. 15 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం 58 ఏళ్ళున్న మంత్రి శంకర్‌రావు పదవీ విరమణ లేకుండా చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. గత మూడు మాసాల్లో 11 చోరీలు చేసినట్టు వెల్లడించారు. కేవలం 3నిమిషాల్లోనే ఇంటి తాళం పగులగొట్టే నేర్పరని చెప్పారు. 39 ఏళ్ళ నేర జీవితంలో ఇప్పటి వరకు 250 చోరీల్లో నిందితుడిగా శంకర్ ఉన్నాడని కమిషనర్ పేర్కొన్నారు. కాలాపత్తర్‌లో ఒక రౌడీషీటర్‌తో కలిసి 11 ఇళ్ళల్లో చోరీలు చేసినట్టు ఆయన తెలిపారు. 20 ఏళ్ళ వయస్సులో మొదటి చోరీచేసిన శంకర్‌కు జైలులో నాగిరెడ్డి, బీరేందర్ సింగ్, దీపక్ సక్సేన, నాగులుతో పరిచయమేర్పడి దొంగతనమే వృత్తిగా చేసుకున్నాడని కమిషనర్ తెలిపారు.

మహిళ దారుణ హత్య

మన తెలంగాణ/చెన్నూర్ : మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని కాబోజీపేట అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం లభ్యమైంది. అటవీ ప్రాంతంలో గొర్ల కాపరి మహిళ మృతదేహాన్ని చూసి చెన్నూర్ పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న చెన్నూర్ పోలీసులు, జైపూర్ ఎసిపి సీతారాములు ఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. ఈ మహిళ సుమారు మూడు నుంచి నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూర్ సిఐ కిషోర్ తెలిపారు.

ఉత్తమ్ పద్మావతిరెడ్డి పాదయాత్ర



మన తెలంగాణ/మోతె : ఎన్నికల్లో చివరి భూములకు నీరు అందిస్తామని ఇచ్చిన హామీని టిఆర్‌ఎస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోదాడ శాసన సభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఆంజనేయ స్వామి విగ్రహానికి పూలమాల వేసి ఆమె పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీడు భూములను సాగులోకి తేవాలనే పట్టుదల, ఎజెండాతో పాలేరు జలాశయం నుంచి పాదయాత్ర సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుందని అన్నారు. పక్కనే ఉన్న పాలేరు రిజర్వాయరు నుండి 50 కిలోమీటర్ల దూరం వరకు ఉన్న భక్త రామదాసు ఎత్తిపోతల పథకం చేపట్టి నీటిని తీసుకెళ్తున్నారని చెప్పారు. పక్కనే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోతె మండలానికి నీరు ఇవ్వడం సాధ్యం కాదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

గాంధీలో వైద్య విద్యార్థుల సమ్మె

- సూపరింటెండెంట్‌కు వ్యతిరేకంగా ధర్నా
- పిజీ వైద్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపణ



మన తెలంగాణ / సిటీబ్యూరో : తమపై సూరింటెండెంట్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ గాంధీ ఆసుపత్రిలో పీజీ వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి విధులు బహిష్కరించి ఆందోళన వ్యక్తం చేశారు. తాము కష్టపడి విధులు నిర్వహిస్తుంటే సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ తమను వేధిస్తున్నాడని ఆరోపించారు. గత ఆరు నెలలుగా తాము గాంధీలో ఎదుర్కొంటున్న సమస్యలను సూపరింటెండెంట్‌కు ఎన్ని సార్లు విలపించినా పట్టించుకోవడంలేదం టూ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కనీసం అత్యావసర విభాగంలో తాము తాగేందుకు మంచినీరు కూడా అందుబాటులో లేవని ఆరోపంచారు. ఇంతే కాకుండా అత్యవసర విభాగానికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తగిన మౌలిక వసతులు లేవని, వీటిపై తాము సూపరింటెండెంట్‌ను ప్రశ్నిస్తే తమపై అనుచిత వ్యాఖ్యాలు చేస్తున్నాడని అన్నారు. తక్షణమే తమకు సూపరింటెండెంట్ క్షమాపణ చెప్పి, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. నేటి నుంచి అత్యవసర సేవలు మినహా మిగతా వైద్యసేవలన్నీ నిలిపేస్తున్నట్టు ప్రకటించారు.

సమస్యల్ని పట్టించుకోవడం లేదు : డా.సంజయ్, జూడా అధ్యక్షుడు

తాము గాంధీ ఆసుపత్రిలో, కళాశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను గత ఆరు నెలలుగా సూపరింటెండెంట్ దృష్టికి పలు మార్లు తీసుకొచ్చిన సమస్యలను పట్టించుకోవడంలేదు. ఇంతే కాకుండా పీజీ వైద్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. కనీసం మహిళ వైద్యులు అని కూడా చూడటంలేదు. అత్యసవర విభాగంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొందరు రోగులు వచ్చినప్పుడు వారికి అరగంటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తేనే వైద్య సేవలు అందించడానికి వీలుంటుంది. కానీ ఈ విషయంలో చాలా ఆలస్యం జరుగుతోంది. సెక్యూరిటీ విభాగం కూడా సరిగ్గా లేదు. గాంధీ ఆసుపత్రికి ఎన్నో నిధులు వస్తాయి. కానీ, వైద్యులకు కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. మాపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు సూపరింటెండెంట్ క్షమాపణ చెప్పి అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. అప్పటి వరకు సమ్మె కొనసాగుతోంది. నేడు అత్యవసర విభాగం మినహా అన్ని వైద్యసేవలు నిలిపివేస్తున్నాం.

పేదలకు సేవలే నా లక్ష్యం: డా.శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్

గాంధీ ఆసుపత్రికి అధికంగా పేదరికంతో రోగులు వస్తుంటారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించడమే నాలక్ష్యం. ఇటీవల ల్యాబ్‌లో చోటు చేసుకున్న సంఘటనపై విచారణ కొనసాగిస్తున్నాం. గాంధీలో రోగుల నుంచి డబ్బులు వసూలు చేసి ఇతర ప్రైవేటు ల్యాబ్ లో రక్త పరీక్షలు నిర్వహించడం చాలా బాధకరం. వైద్యులు అందరూ నాకు సమానమే, నేను ఎవ్వరికీ వ్యతిరేకం కాదు.

డిఎంఇ డాక్టర్ రమేష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ

డిఎంఇ డాక్టర్ రమేష్‌రెడ్డి సోమవారం గాంధీ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. పిజి వైద్యులకు సమస్యలుంటే సూపరింటెండెంట్, దృష్టికి లేదా తన దృష్టికి తీసుకొస్తే తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు, సేవలు ఎప్పటికప్పుడు అందేలా పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

- సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : మతతత్వ బిజెపిని ఓడించడానికి వచ్చే ఎన్నికల్లో ఏ రకంగా ముందుకు సాగాలో ఎన్నికల సమయంలో నిర్ణయిస్తామని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ స్పష్టం చేశారు. త్వరలో మరో ఆరు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగాల్సి ఉన్నందున ముందస్తు ఎన్నికలకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నించకపోవచ్చునన్నారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, దీనిని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విధానం వల్ల మెజారిటీ రాష్ట్రాల్లో గవర్నర్, రాష్ట్రపతి పాలన సాగే వీలుంటుందని అన్నారు. నల్లగొండలో జరుగుతున్న సిపిఐ (ఎం) రాష్ట రెండవ మహాసభలలో భాగంగా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధపోరాట ఛాయాచిత్ర ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కారత్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పోరేట్ శక్తులను బలోపేతం చేస్తూ సామాన్యులపై ఆర్థిక భారంమోపుతోందని విమర్శించారు. రైతులకు పంట ఉత్పాధక ఖర్చు కన్నా కనీసం 50 శాతం ఎక్కువ ఉండేలా మద్దతు ధర కల్పిస్తామని బడ్జెట్‌లో ప్రకటించినప్పటికీ కార్యాచరణకు ఏమిటో స్పష్టం చేయలేదని విమర్శించారు. ప్రజారోగ్యానికి రూ. లక్ష కోట్లు అవసరమని ఆరోగ్య నిపుణులు చెబుతుంటే రూ. 2వేల కోట్లు మాత్రమే కేటాయించి ఏ రకంగా ప్రజలకు ధీమా కల్పిస్తారని ప్రశ్నించారు. ఆరోగ్య బీమా పేరుతో ప్రైవేటు ఆసుపత్రులు, ఇన్సూరెన్స్ కంపెనీల జేబులు నింపడానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పెట్రోల్ ధరలు నిత్యం పెంచుకుంటూ వస్తున్నారని, ఇది ఏ మేరకు సమ్మతమని అన్నారు. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌ను ఇతర రాష్ట్రాల్లో అక్కడి పరిస్థితులకు అనుగుణంగా విస్తరింపచేయనున్నట్లు కారత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెర్కుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి జూలకంటి రంగారెడ్డి, జ్యోతి, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ జైలుకు సందర్శకుల తాకిడి

- ముగ్గురు మిత్రులతో ఒకరోజు కర్మాగారానికి వ్యాపారి



మన తెలంగాణ/సంగారెడ్డి ప్రతినిధి : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని హెరిటేజ్ జైలుకు సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ బంగారం వ్యాపారి బాబీ చమనూరు తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఒకరోజు జైలు జీవితం అనుభవించడానికి సోమవారం సంగారెడ్డికి వచ్చారు. జైలులో వుండటానికి నిబంధనల గురించి జైలు అధికారులు వారికి వివరించగా అందుకు వారు అంగీకరించారు. రూ.500 చెల్లించి జైలు జీవితం ఎలా వుందో చూడాలనుకుంటున్నప్పటికీ ఖైదీలకు వర్తించే నిబంధనలన్నీ వీరికి కూడా వర్తిస్తాయని జిల్లా జైలు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్ వివరించారు. ఈ సందర్భంగా బాబీ మచనూరు మాట్లాడుతూ తాను పలు దేశాల్లో బంగారం వ్యాపారం చేస్తుంటానని, దీంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటానని చెప్పారు. అయితే జైలులో ఖైదీల జీవన విధానం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి తనలో వుండేదని అన్నారు. కేరళ రాష్ట్రంలో ఒకరోజు జైలులో తాను వుండటానికి జైలు అధికారులను తాను కోరగా అందుకు చట్టాలు ఒప్పుకోలేదని, కానీ తెలంగాణాలోని సంగారెడ్డి హెరిటేజ్ జైలులో రూ.500 చెల్లించి ఒకరోజు జైలు జీవితం గడపవచ్చని మీడియా ద్వారా తెలుసుకున్న తాను తనకున్న ఆసక్తి మరింత రెట్టింపయ్యిందన్నారు. దీంతో తన స్నేహితులైన జర్నలిస్టు ఆషీర్ అలీ, యోగా శిక్షకుడు ప్రశాంత్, వినయ్‌లతో కలిసి వెంటనే సంగారెడ్డికి వచ్చానని వివరించారు. గత పదిహేను సంవత్సరాలుగా తనకున్న కోరికనే నేడు తీర్చుకుంటున్నట్టు ఆయన ఆనందంగా తెలిపారు. ఇదిలా వుంటే కేరళ రాష్ట్రంలో తాను ఒక అనాథ ఆశ్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్టు బాబి చమనూరు తెలిపారు. నిరాశ్రయులైన వారు రోడ్డుపై తిరుగుతున్న వారికి తన ఆశ్రమంలో చోటు కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే కేరళ రాష్ట్రంలో ఒక సామాజిక లక్ష్యం కోసం డొనేట్ ద బ్లడ్, సేవ్ ద లైఫ్ అనే నినాదంతో 812 కిలోమీటర్ల పరుగు పందెం కూడా నిర్వహించినట్లు ఆయన వివరించారు. దేశ, విదేశాల్లో బంగారం వ్యాపారం చేసి లక్షలు గడిస్తున్నా పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి వుందని ఆయన వివరించారు.

మావోయిస్టుల బంద్ హింసాత్మకం

- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల్లో టెన్షన్
- వెంకటాపురం మండలంలో బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ పేల్చివేత
- రైలు పట్టాలు తొలగింపు.. ఆరు బోగీలు పల్టీ
- బేస్ క్యాంప్‌పై బాంబు పేలుడు, తప్పిన ముప్పు



మన తెలంగాణ/భద్రాచలం : బంద్ పేరిట మావోయిస్టులు హల్ చల్ సృష్టించారు. పలు విధ్వంసాలకు పాల్పడ్డారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ 2, భూ సేకరణ బిల్లును నిలిపివేయాలని కోరుతూ ఆదివాసీలు, దళితులపై జరుగుతున్న దాడులు ఆపేయాలని మావోయిస్టు కేంద్ర కమిటీ తెలంగాణ ఛత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్‌కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భద్రాచలం డివిజన్‌కు ఆనుకుని ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండల పరిధిలో గల ఎదిరలో ఉన్న బిఎస్‌ఎన్ టవర్‌ను పేల్చేశారు. ఎదిర చేరుకున్న నక్సలైట్లు అక్కడే టవర్‌పై డీజిల్ పోసి వస్తువులు తగుల బెట్టారు. ఇటీవల పినపాక మండలంలోని భూపతిరావుపేట గ్రామంలో గల ఇసుక ర్యాంపుపై దాడికి చేసేందుకు మావోయిస్టులు ఇదే ప్రాంతం నుండి వెళ్లినట్లు తెలుస్తోంది. చర్ల మండల పరిధిలోని కలివేరు వద్ద ఉన్న సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ఎదురుగా ఉన్న గుట్టలపై బాంబులు వేసి పేల్చి కవ్వించే ప్రయత్నం చేశారు. దీంతో సోమవారం సిఆర్‌పిఎఫ్ సిబ్బంది అక్కడి గ్రామస్తులను పిలిపించి విచారణ చేసినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుక్మా, నారాయణ్‌పూర్,దంతెవాడ జిల్లాల్లోని ఆవుపల్లి,మర్దండ గ్రామాల మధ్య మావోయిస్టులు కరపత్రాలు విడిచి సభలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అదే జిల్లాలోని నెల్సానార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫుల్‌గుట్టా ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న వాటర్‌ట్యాంకర్, క్రషర్లను ధ్వంసం చేశారు. దంతెవాడ జిల్లా ఫర్సాప్లా పోలీస్టేషన్ పరిధిలో చెట్లు నరికి రోడ్లపై కందకాలు తవ్వారు. కిరణ్‌డోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బచేలీ, భాంసీ మార్గంలో రైలు పట్టాలను తొలగించారు. దీంతో 6 రైలు బోగీలు పల్టీ కొట్టాయి. వెంటనే రైల్వే సిబ్బంది రంగంలోకి దిగి పట్టాలకు మరమ్మత్తులు చేశారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని అరోచా గ్రామ శివారులో రోడ్డు పనుల వాహనాలకు నిప్పుపెట్టారు. బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపేసి వాహనాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కిరణ్ డోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌ఎండిసికి చెందిన పంప్ హౌస్‌లో పనిచేస్తున్న నలుగురిని మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. కొద్ది సేపటి తర్వాత వదిలేశారు. 30వ జాతీయరహదారి లోని సుక్మా, దంతెవాడ, బీజాపూర్, రాయ్‌పూర్ జగ్దల్‌పూర్ ప్రాంతాలకు బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిక్షణం భయంగా ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని గ్రామల ప్రజలు వణికిపోతున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో పోలీస్ ప్రత్యేక బలగాలు ముమ్మర కూంబింగ్ నిర్వహిస్తుండటంతో ఏక్షణం ఎక్కడ విధ్వంసం చోటుచేసుకుంటుందో అర్థంకాని పరిస్థితులు అలుము కున్నాయి. ఇటీవల మావోయిస్టు పార్టీల చోటుచేసుకున్న అంతర్గక మార్పులు చేర్పులతో కమిటీలు దూకుడు ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. వెటరన్ కామ్రేడ్ తీర్మానాన్ని ఆమోదించి వయస్సు మళ్లిన వారిని తప్పించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా నంబాల కేశవరావును నియమించినట్లు సమాచారం.



రైతుల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం

మన తెలంగాణ/దోమకొండ: రైతులు బాగుండాలనే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లింగుపల్లిలో నూతనంగా నిర్మించిన గిడ్డంగిని కామారెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఎల్లవేళలా పాటు పడుతుందన్నారు. అందుకు వ్యవసాయానికి నిరంతరాయంగా 24గంటల ఉచిత కరెంటు అందిస్తుందని, పంటలు పండించే రైతులకు ప్రతి ఎకరాకు రూ.4వేల చొప్పున అందించడానికి ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలను వ్యవసాయ గిడ్డంగులలో నిల్వ ఉంచుకోవడానికి లింగు పల్లి గ్రామంలో నాబార్డ్ నిధులతో 5వేల మెట్రిక్ టన్నుల కెపాసిటిగల గోదాంను ప్రారంభించినట్లు తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంగు బాల్ రాజవ్వ, జెడ్పీటిసి గంగ్రా మధుసూదన్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అమృతారెడ్డి పాల్గొన్నారు.

కెసిఆర్ ప్రజలను మోసం చేశారు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎన్నికలలో టిఆర్ ఎస్ అధ్యక్షులు కెసిఆర్ ప్రజలకు అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని మాజీ ఎంఎల్‌సి, సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ కనుకుల జనార్ధన్ రెడ్డి విమర్శించారు. సోమవారం నాడు గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇస్తామని చెప్పారని, 2018 నాటికి 2.75లక్షల ఇళ్ళు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ కేవలం 4 వేల ఇళ్ళ నిర్మాణం మాత్రమే జరిగిందన్నారు.

గిరిజన తండాల్లో పర్యటిస్తా

మన తెలంగాణ/ హైదరాబాద్ : గిరిజనుల మధ్య చిచ్చు పెట్టిన సిఎం కెసిఆర్‌పై త్వరలోనే పోరాటం చేసేందుకు తండాలలో పర్యటిస్తానని మాజీ ఎంపి, టిపిసిసి అధికార ప్రతినిధి రవీంద్ర నాయక్ అన్నారు. గాంధీ ట్రస్ట్ సభ్యులు సూర్యానాయక్‌తో కలిసి ఆయన సోమవారం నాడు గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో గిరిజనుల మధ్య జరిగిన చిచ్చు రాష్ట్ర వ్యాప్తంగా పాకిందని,టిఆర్ ఎస్ నాయకులు ఆయనకు పాలాభిషేకాలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.

రాజకీయ నిరుద్యోగుల కోసమే..

కోదండరామ్ పార్టీ ఏర్పాటుపై పిడమర్తి రవి విమర్శ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాజకీయ నిరుద్యోగులు కోసమే కోదండరామ్ రాజకీయ పార్టీ పెడుతున్నారని ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉద్యమంలో కలిసిరాని కోదండరామ్, మంద కృష్ణ, గద్దర్ ఇప్పుడు ఎందుకు కలుస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కోదండరామ్ ట్రాప్‌లో పడొద్దని సూచించారు. కోదండరామ్ రాజకీయ పార్టీ పెట్టడం 2018లో ఒకపెద్ద జోక్‌గా అభివర్ణించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పూర్తి స్థాయి జీతం తీసుకున్న వ్యక్తి, సమాజం కోసం ఏం చేస్తాడో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క విద్యార్థికి కూడా ఏ రాజకీయ పార్టీ నుంచైనా కోదండరామ్ ఎంఎల్‌ఎ టికెట్ ఇప్పించలేదని, కనీసం సిఫారసు కూడా చేయలేదని ఆయన విమర్శించారు.

క్రేజీ మూవీలో చిత్ర శుక్లా



అల్లరి నరేష్, సునీల్ హీరోలుగా భీమినేని శ్రీనివాసరావు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు చేయనుండగా ఇప్పటికే ఒక హీరోయిన్‌గా నందినిరాయ్‌ను ఖరారు చేశారు. రెండో హీరోయిన్‌గా కాస్త నటనతో మెప్పించగలిగే సొగసరి కోసం వెతికారు ఫిల్మ్‌మేకర్స్. చివరకు రాజ్‌తరుణ్ 'రంగుల రాట్నం' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన చిత్ర శుక్లాను ఓకే చేశారు. రంగుల రాట్నంలో ఆమె నేటి తరం యువతిగా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. నటనాపరంగా ఆమెకు మంచి మార్కులే పడ్డాయి. అందంగా కనిపించడంతో పాటు చక్కటి భావాలు పలికించగల నటి కావడంతో చిత్ర శుక్లాను ఎంపిక చేశాడు దర్శకుడు భీమినేని శ్రీనివాసరావు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ భామకు ఇది లక్కీ ఆఫర్‌గా చెప్పుకోవాలి. తొలి చిత్రం నిరాశ పరిచినప్పటికీ తన రెండో చిత్రంతో మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటోంది చిత్ర శుక్లా. ఈ చిత్రంతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా నిలదొక్కుకోవాలని భావిస్తోంది.



అను ఇమాన్యుయేల్, అల్లు అర్జున్

లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో

అల్లు అర్జున్ తన అభిమానులకు ప్రేమికుల దినోత్సవ కానుకను ఇవ్వనున్నారు. తన తాజా చిత్రం 'నా పేరు సూర్య...' చిత్రంలో ని రెండో పాట 'లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో' అనే పాటను ప్రేమికుల దినోత్సవ కానుకగా విడుదలచేయనున్నారు. ఈమధ్యే రిలీజ్ చేసిన సైనిక పాటతో తనలోని దేశభక్తిని చాటుకున్న అల్లు అర్జున్... ఇప్పుడు లవర్ ఆల్సో అంటూ ప్రేమను పంచబోతున్నారు. ఈ పాట కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించగా విశాల్ శేఖర్ సంగీత మందించారు. శేఖర్ ఈ పాటను పాడారు. ఈ పాటను అల్లుఅర్జున్ అను ఇమాన్యుయల్‌పై అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించారు. రచయిత వక్కంతం వంశీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ "ఈసారి ప్రేమికుల దినోత్సవం అల్లు అర్జున్ అభిమానులకు ఎంతో ప్రత్యేకంగా ఉండనుంది. ఈ చిత్రంలోని లవర్ ఆల్సో... ఫైటర్ ఆల్సో అనే పాటను ప్రేమికులకు కానుకగా అందించబోతున్నాం. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ అద్భుతమైన పాటను రిలీజ్ చేస్తున్నాం. రామజోగయ్య శాస్త్రి తన అనుభవాన్ని అంతా రంగరించి ఈ పాటను రచించారు. విశాల్ శేఖర్ అద్భుతమైన ట్యూన్ అందించారు. శేఖర్ గాత్రంతో ఈ పాట మరింత అందంగా తయారైంది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం"అని చెప్పారు. అర్జున్, శరత్‌కుమార్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్ః రామ్ లక్ష్మణ్.




సి.కళ్యాణ్, సాయిధరమ్‌తేజ్, వి.వి.వినాయక్, లావణ్య త్రిపాఠి

చిరంజీవి, పవన్‌కళ్యాణ్ కలిస్తే తేజు

సాయిధరమ్ తేజ్ హీరోగా లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. అధినేత సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. సెన్సార్ పూర్తిచేసుకున్న ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా రాజమండ్రిలో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ " వి.వి.వినాయక్ నాకు ఎంతో ఇష్టమైన దర్శకుడు. ఇంత మంచి సినిమా చేసే అవకాశాన్ని ఆయన నాకు ఇచ్చారు. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. నా స్నేహితుడు తమన్ ఎంతో మంచి మ్యూజిక్ ఇచ్చాడు. జానీ, శేఖర్‌లు నాతో డ్యాన్స్‌ను కుమ్మించేశారు. మెగాస్టార్ చిరంజీవి, పవన్‌కళ్యాణ్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, వరుణ్ ఇలా అందరూ నాకు పంచభూతాలు. ఈనెల 10న వరుణ్ చిత్రం 'తొలిప్రేమ' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఒకే రోజు ఇద్దరు మెగా హీరోలు బాక్సాఫీస్ వద్దకు వచ్చి హిట్ కొడితే ఆ కిక్కే వేరు"అని అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ "పవన్‌కళ్యాణ్‌కు ఓ విజ్ఞప్తి. ఆయన సినిమాలు చేయనని అన్నారు. కానీ ఆయన రాజకీయంగా ఎంత ఎదిగినా, ప్రజా సమస్యలపై ఎంత పోరాడినా... సమయం దొరికినప్పుడల్లా సినిమాలు చేయండి. ఇక 'ఇంటిలిజెంట్' సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది. తేజుతో 'చమకు చమకు...' సాంగ్ చేసేటప్పుడు నాకు చిరంజీవి గుర్తుకు వచ్చారు. అలాగే రెండు, మూడు సన్నివేశాలను పవన్‌కళ్యాణ్‌లా తేజు కనపడేలా షూట్ చేశాను. ఎందుకంటే చిరంజీవి, పవన్‌కళ్యాణ్ కలిస్తే ఎలా ఉంటుందో అలా తేజు స్టైల్ ఉంటుంది. మెగా ఫ్యామిలీలో కష్టపడేతత్వం ఎలా ఉందో... తేజులో ఆ తత్వం కనపడుతుంది. చిరంజీవిలా తేజు అందరినీ కలుపుకుపోతుంటాడు. కాబట్టి తేజు కూడా అన్నయ్య అంత, పవన్‌కళ్యాణ్ అంత పెద్ద స్టార్ కావాలని కోరుకుంటున్నాను. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచి పెద్ద డైరెక్టర్‌ను అవుతానని నమ్మినవారిలో నిర్మాత సి.కళ్యాణ్ అన్నయ్య ఒకరు. ఆయన రామానాయుడిలా వంద సినిమాలు తీస్తారు. ఆ జర్నీలో నేను కూడా ఉంటాను. మాతో పాటు విడుదలవుతున్న తొలిప్రేమ, మోహన్‌బాబు 'గాయత్రి' సినిమాలు కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను"అని తెలిపారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ "ఇప్పటివరకు సాయిధరమ్ తేజ్ చేసిన సినిమాలు వేరు... ఈ సినిమా వేరు. తప్పకుండా ఈ సినిమా హిట్ అవుతుంది. మా సోదరుడు వినాయక్ సినిమాను ఇరగదీయించారు. పాటలు చూస్తుంటే చిరంజీవి సాంగ్స్ చూస్తున్నట్లుంటుంది. ఈ సినిమా కొత్త రికార్డులను సృష్టిస్తుంది"అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపి మురళీమోహన్, లావణ్య త్రిపాఠితో పాటు చిత్ర బృందం పాల్గొంది.

తొలిసారిగా ఐటమ్‌సాంగ్

రామ్‌చరణ్‌సుకుమార్ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రంగస్థలం' సెట్‌లోకి హాట్ బ్యూటీ పూజా హెగ్డే అడుగు పెట్టేసింది. షూటింగ్‌లో మిగిలిపోయిన చివరి ఐటమ్‌సాంగ్ చిత్రీకరణ సుకుమార్ సోమవారం మొదలుపెట్టాడు. దేవిశ్రీ ప్రసాద్ అదిరిపోయే ట్యూన్‌కి చరణ్, పూజా వేసే స్టెప్స్ అభిమానులను ఉర్రూతలూగించడం ఖాయమని అంటున్నారు సినిమా యూనిట్ సభ్యులు. ఇక మూడు రోజుల క్రితమే సమంత తన షూటింగ్ అయిపోయిందని... విడుదల కోసం ఎదురుచూడటమే మిగిలిందని ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పూజా హెగ్డే పాట చిత్రీకరణ పూర్తయ్యాక గుమ్మడికాయ కొట్టేస్తారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో సుకుమార్ ఈ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నాడు. ఇటీవల విడుదలైన టీజర్‌కు భారీ స్పందన వచ్చిన నేపథ్యంలో సినిమా ప్రమోషన్ విషయంలో ఇంకా జాగ్రత్తలు తీసుకుంటున్నారు ఫిల్మ్‌మేకర్స్. డీజే సినిమాలో బికినీతో అందరి మతులు పోగొట్టిన పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ 'రంగస్థలం'లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇక మొదటిసారిగా పూజ ఐటమ్‌సాంగ్ చేస్తోంది. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో 'సాక్ష్యం' చిత్రంలో నటిస్తోంది ఈ బ్యూటీ. దీని తర్వాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేష్‌బాబు హీరోగా చేయనున్న 25వ సినిమాలో కూడా తనే హీరోయిన్‌గా ఓకే అయినట్టు తెలిసింది. ఇంత క్రేజ్‌లోను రామ్‌చరణ్‌తో స్పెషల్ సాంగ్‌కు ఒప్పుకుంది అంటే అందులో చాలా ప్రత్యేకత ఉండే ఉంటుంది.



పూజాహెగ్డే



నితిన్

ప్రేమికుల రోజున టీజర్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఒక్క పాట మినహా పూర్తయింది. ఇది నితిన్‌కు 25వ చిత్రం కావడం విశేషం. దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో కృష్ణచైతన్య దర్శకత్వంలో ఎన్.సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు హైదరాబాద్, ఊటీ, అమెరికాలలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ "ఈనెల 12న సినిమా ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేయబోతున్నాం. అలాగే చిత్రం టీజర్‌ను ప్రేమికుల రోజైన ఈనెల 14న, చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయనున్నాం"అని అన్నారు. చిత్ర దర్శకుడు కృష్ణచైతన్య మాట్లాడుతూ "ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. చాలా సరదాగా సాగుతుంది. ప్రస్తుతం సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది"అని తెలిపారు. డా.కె.వి. నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః ఎం.నటరాజ సుబ్రమణియన్, సంగీతంః తమన్, ఎడిటింగ్ః ఎస్.ఆర్.శేఖర్, డ్యాన్స్ః శేఖర్, ఫైట్స్ః స్టంట్ సిల్వ, రవివర్మ.

తలసానికి 'మా' ఆహ్వానం

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని అమెరికాలోని డల్లాస్‌లో మెగాస్టార్ చిరంజీవి నేతృత్వంలో మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రావాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌ను 'మా' కార్యవర్గ సభ్యులు ఆహ్వానించారు. మంత్రి నివాసానికి వెళ్లిన 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి ఏడిద శ్రీరామ్, సురేష్, ఉత్తేజ్, సురేష్ కొండేటి తదితరులు ఈ వేడుకలో పాల్గొనాలని ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది.



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో శివాజీరాజా, సురేష్, శ్రీకాంత్, సురేష్ కొండేటి



కీర్తి సురేష్

ఆమెతో నాకు ఏ గొడవలు లేవు


తెలుగు, తమిళంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది కీర్తి సురేష్. తెలుగులో ఇప్పటికే పవన్‌కళ్యాణ్ సరసన నటించి పెద్ద హీరోయిన్ అయిపోయింది. ఇక తమిళంలోనూ సూర్య, విక్రమ్‌ల పక్కన నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అయితే సినిమాలతో పాటు అమ్మడికి వివాదాలు కూడా కాస్త ఎక్కువవుతున్నాయి. ప్రస్తుతం కీర్తి కోలీవుడ్‌లో విక్రమ్‌తో 'సామి 2' చిత్రం చేస్తోంది. 13 ఏళ్ల క్రితం విడుదలై సూపర్‌హిట్ నిలిచిన సామి చిత్రానికి సీక్వెల్ ఇది. మొదటి పార్టులో త్రిష హీరోయిన్‌గా చేసింది. ఇప్పుడు 'సామి 2'లో లీడ్ రోల్ కీర్తి సురేష్‌కు ఇచ్చారు. ఆమె పాత్రకు ప్రాధాన్యత కూడా ఎక్కువ. ఇక త్రిష ఇందులో ఫ్లాష్ బ్యాక్‌లో కనిపించే పాత్ర దక్కించుకుంది. ఏమైందో ఏమో ఆ పాత్రను చేయనని చెప్పి ఆమె సినిమా నుంచి బయటికి వచ్చేసింది. ఇలా ఆమె వెళ్లిపోవడం వల్ల తమకు నష్టం కలిగిందంటూ నిర్మాతలు కేసు పెట్టడం కూడా జరిగింది. అయితే అసలు త్రిష సినిమా నుంచి బయటకు రావడానికి కారణం కీర్తి సురేషేనని రూమర్లు వినిపించాయి. అవి ఆమె చెవిన కూడా పడ్డాయి. "అయ్యో నా వల్ల త్రిష సినిమా వదిలేయడం ఏంటి? ఆమెతో నాకు ఏ గొడవలు లేవు. ఆమెతోనే కాదు ఎవరితోనూ లేవు"అని చెప్పింది కీర్తి. ఏ హీరోయిన్‌తోనైనా కలిసి నటించేందుకైనా తాను సిద్ధమేనని పేర్కొంది. త్రిష వెళ్లిపోవడానికి కారణం ఏంటో మాత్రం చెప్పలేదు. అయితే కీర్తికి ఎక్కువ ప్రాధాన్యత ఉన్న పాత్ర ఇచ్చి తనకు మాత్రం తక్కువ ప్రాధాన్యత ఉన్న పాత్ర ఇవ్వడమే త్రిష అలకకు కారణమని తెలిసింది.

టాలెంటెడ్ డైరెక్టర్‌తో సినిమా

దర్శకుడినవ్వాలనే కసి, నిజాయితీతో చేసే ఏ చిన్న ప్రయత్నమైనా ఒక్కోసారి పెద్ద ఫలితాన్నే అందిస్తుంది. అలాంటి ఫలితాన్నే తమిళ షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు సర్జున్ కె.ఎం. అందుకున్నాడు. గతంలో ఈ దర్శకుడు చేసిన 'లక్ష్మి' అనే షార్ట్‌ఫిల్మ్‌కు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు తాజాగా ఆయన చేసిన మరొక షార్ట్‌ఫిల్మ్ 'మా' సంచలన విజయాన్ని అందుకొని కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. యూట్యూబ్‌లో ఈ లఘు చిత్రానికి 2.7 మిలియన్ల వ్యూస్ దక్కాయి. విమర్శకులు, సినీ పెద్దలు అతని పనితనాన్ని మెచ్చుకోగా లేడీ సూపర్‌స్టార్ నయనతార ఏకంగా అతనికి తనతో సినిమా చేసే బంపర్ ఆఫర్ ఇచ్చింది. హార్రర్ కంటెంట్‌తో తెరకెక్కే ఈ చిత్రం కథ ఆమెకు ఎంతగానో నచ్చిందట. దీంతో టాలెంటెడ్ డైరెక్టర్ సర్జున్‌తో సినిమా చేసేందుకు ఆమె ఓకే చెప్పిందట. కె.జె.ఆర్ స్టూడియోస్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో మొదలుకానుంది.



నయనతార



ఒళ్లు గగుర్పొడిచే స్థాయిలో...

ఇప్పటికే ఐదు భాగాలు వచ్చినా ఇంకా తరగని క్రేజ్ జురాసిక్ పార్క్ సిరీస్ సొంతం. 90వ దశకంలో స్టీవెన్ స్పీల్‌బర్గ్ పరిచయం చేసిన ఈ రాకాసి బల్లుల విధ్వంసం చిన్న పిల్లలు మొదలుకొని పెద్దవాళ్ల వరకు అందరినీ అలరిస్తూనే ఉంది. ఇప్పుడు ఈ సిరీస్‌లో వస్తున్న కొత్త సినిమా 'జురాసిక్ వరల్డ్‌ది ఫాలెన్ కింగ్‌డమ్'. జె.ఎ.బెయోనా దర్శకత్వం వహించిన ఈ మూవీలో క్రిస్ ప్రాట్, బ్రేస్సీ డల్లాస్ హోవార్డ్, వాంగ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టీవెన్ స్పీల్‌బర్గ్ దీనికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. అయితే ఈసారి కథలో చాలా మార్పులు చేసినట్టు సమాచారం. ఒక ద్వీపంలో చిక్కుకుపోయిన హీరో టీమ్ డైనోసార్ల బారి నుంచి తప్పించుకోవడం అనే పాయింట్‌తో ఒళ్లు గగుర్పొడిచే స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. తాజాగా విడుదలైన సినిమా ట్రైలర్ డైనోసార్ భీభత్సంతో ప్రేక్షకులను అలరిస్తోంది. కథ కంటే గ్రాఫిక్స్‌తో ఎక్కువ ప్రభావాన్ని కలిగించే ఈ చిత్రాన్ని 3డి వర్షన్‌లో రూపొందిస్తున్నారు. జూన్ 22న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.



14న మార్కెట్లోకి రెడ్‌మి 5 ఫోన్లు

న్యూఢిల్లీ: ప్రేమికుల దినోత్సవం ఫిబ్రవరి 14న షియోమీ రెడ్‌మి 5, రెడ్‌మి 5 ప్లస్ ఫోన్‌లు విడుదల కానున్నాయి. న్యూఢిల్లీలో లాంఛింగ్ కార్యక్రమం కోసం ఇప్పటికే మీడియా సంస్థలకు కంపెనీ ఆహ్వానాలు పంపినట్టు తెలుస్తోంది. ఈ సమాచారం మేరకు షియోమీ రెండు కొత్త ఫోన్లను ప్రవేశపెట్టనుంది. షియోమీ రెడ్‌మీ 5 ఫీచర్లు చూస్తే 5.7 ఇంచ్ హెచ్‌డి ప్లస్ 2.5డి కర్వ్‌డ్ గ్లాస్ డిస్‌ప్లే, 1.8 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 450 ప్రాసెసర్, 2/3 జీబి ర్యామ్, 16/32 జీబి స్టోరేజ్, 128 జీబి ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 7.1.2 నౌగట్, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, 12 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్, 4జి వోల్ట్, బ్లూటూత్ 4.2, బ్యాటరీ సామర్థ్యం 3300 ఎంఎహెచ్ ఉంటుంది. షియోమీ రెడ్‌మీ 5 ప్లస్ విషయానికొస్తే.. 5.99 ఇంచ్ ఫుల్ హెచ్‌డి ప్లస్ 2.5డి కర్వ్‌డ్ గ్లాస్ డిస్‌ప్లే, 2 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్, 3/4 జీబి ర్యామ్, 32/64 జీబి స్టోరేజ్, 128 జీబి ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 7.1.2 నౌగట్, హైబ్రిడ్ డ్యుయల్ సిమ్, 12 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్, 4జీ వీవోఎల్‌టీఈ, బ్లూటూత్ 4.2, బ్యాటరీ సామర్థ్యం 4000 ఎంఎహెచ్ ఉంది.

మూడోసారి మార్పుండదు

వడ్డీ రేట్లు యథాతథంగానే కొనసాగించే అవకాశం : నిపుణులు

నేడు ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలో ఎంపిసి సభ్యుల భేటీ



న్యూఢిల్లీ: ఈనెల 7న ఆర్‌బిఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షలో వడ్డీ రేట్లు యథాతథంగానే ఉంటాయనిఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. వరుసగా మూడోసారి కూడా ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వడ్డీ రేట్లు యథాతథంగానే కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం ఆందోళనలు, అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల, వ్యవసాయదారులకు మద్దతు ధర వంటి అంశాల కారణంగా వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశం లేదని వారంటున్నారు. 2017–18 ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షకు మంగళవారం ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ) సమావేశం కానుంది. ఈ సమావేశంలో చర్చించి వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకుంటారు. ఆ తర్వాత బుధవారం మధ్యాహ్నం ఉర్జిత్ మీడియా సమావేశంలో వడ్డీ రేట్లపై ప్రకటన చేస్తారు. డిసెంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. అప్పుడు కూడా ద్రవ్యోల్బణం భయాలు, అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనా 6.7 శాతానికి మందగించడం వంటి అంశాలను ఆర్‌బిఐ పరిగణనలోకి తీసుకుంది. అయితే ఆగస్టు నెలలో మాత్రమే ఆర్‌బిఐ వడ్డీ రెట్లను 0.25 శాతం తగ్గించగా.. అప్పుడు అది 6 శాతానికి చేరుకుంది. 6 శాతం వడ్డీ రేటు అంటే ఆరేళ్ల కనిష్ఠ స్థాయి రేటు.. వరుసగా మూడోసారి కూడా రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేసే అవకాశం లేదని బ్యాంకర్లు, విశ్లేషకులు పేర్కొంటున్నారు. వడ్డీ రేట్లు ఇప్పటికే చాలా వరకు దిగిరావడం, మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణంపై ప్రభావం వంటి అంశాలు పరిశీలించి నిర్ణయాలు తీసుకోనున్నారని వారు పేర్కొన్నారు.

బుధవారం ఆర్‌బిఐ పరపతి నిర్ణయాల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఆర్‌బిఐ నిర్ణయాలు మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఇప్పటికే మార్కెట్‌పై బడ్జెట్ ఎఫెక్ట్ కొనసాగుతోంది. తాజాగా ఆర్‌బిఐ నిర్ణయాలూ కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.ఈక్విటీలలో దీర్ఘకాలిక పెట్టుబడులనూ పన్ను పరిధిలోకి తీసుకురావడంతో వారాంతం శుక్రవారం మార్కెట్లు బేర్‌మన్నాయి. సెన్సెక్స్ 840 పాయింట్లు పడిపోయింది. వ్యవసాయానికి అనుకూలంగా బడ్జెట్‌లో నిర్ణయాలు తీసుకోవడంతో ఈసారి వడ్డీ రేట్ల పెంపు ఆలోచన చేయొద్దని ఆర్‌బిఐని ఇండస్ట్రీ చాంబర్ అసోచామ్ కోరింది. ద్రవ్యోల్బణం ఆందోళనలతో వడ్డీ రేట్లు పెంచాలని ఆర్‌బిఐ యోచిస్తోంది. అయితే ప్రస్తుతం కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి అనుకూలంగా నిర్ణయాలు చేయడం ఆర్‌బిఐకి సానుకూలంగా మారింది. ఈ నేపథ్యంలో వడ్డీ రేట్ల పెంపు నిర్ణయం ఉండకపోవడం మంచిదని రిజర్వ్ బ్యాంక్‌ను ఇండస్ట్రీ చాంబర్ అసోచామ్ విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలో 'ఫ్రెంచ్ అడ్మిషన్ టూర్'



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు క్యాంపస్ అవకాశాలను వెల్లడించేందుకు సోమవారం 'క్యాంపస్ ఫ్రాన్స్' సంస్థ హైదరాబాద్‌లో ''ఫ్రెంచ్ అడ్మిషన్ టూర్''ను తాజ్ బంజారాలో నిర్వహించింది. క్యాంపస్ ఫ్రాన్స అనేది ఫ్రాన్స్‌లో నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యొక్క ఫ్రెంచ్ మంత్రిత్వశాఖల కింద పని చేస్తున్న సంస్థ. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులను ఉన్నత విద్యా రంగంలో ప్రోత్సహిస్తోంది. ఫ్రాన్స్ నుండి సుమారు 30 ఇనిస్టిట్యూషన్లు, వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు ఈ అడ్మిషన్ టూర్ ప్రోగ్రామ్‌లో హైదరాబాద్‌లోని విద్యార్థులకు తమ ఫ్రెంచ్‌దేశంలోని యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సైన్స్, హాస్పిటాలిటీ డెవలప్‌మెంట్ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఆయా కోర్సుల్లో టాప్ మార్కులు సాధిస్తే ప్రతిభావంతులైన ఆ విద్యార్థులకు యూనివర్సిటీల ద్వారా నగదు పురస్కారాలు , ప్రత్యేక స్కాలర్ షిప్‌లను కూడా ఇవ్వనున్నట్లు తెలిపింది. అంతే కాకుండా ఫ్రెంచ్ కంపెనీలు కూడా విద్యార్థులకు గణనీయంగా నిధులు పొందే అవకాశాలను కల్పిస్తాయని వెల్లడించింది. మరిన్ని వివరాలకు https://at.schedul.org ని సంప్రదించవచ్చని తెలిపింది.

హైదరాబాద్‌లో హువావే కేంద్రం

మన తెలంగాణ / హైదరాబాద్ ః హువావే ఈ బ్రాండ్ సంస్థ హానర్ తాజాగా అమీర్‌పేట లాల్ బంగ్లా సమీపంలో ఎక్స్‌క్లూజివ్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. హువాయ్స్ ఇండియా సర్వీస్ హెడ్ స్కోట్ ఉపెంగ్ ఈ సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మొబైల్ ఫోన్లు, హ్యాండ్‌సెట్‌ల మరమ్మత్తు, రీప్లేస్‌మెంట్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ చెకింగ్, అప్‌డెట్లతో పాటు హువావే ప్రత్యేక సర్వీస్ సెంటర్ ద్వారా మరిన్ని సదుపాయాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.

ఏప్రిల్ 1 తర్వాత ఎల్‌టిసిజి పన్ను



న్యూఢిల్లీ: ఈక్విటీ హోల్డింగ్స్‌పై ప్రతిపాదించిన ఎల్‌టిసిజి(దీర్ఘకాలి పెట్టుబడి లాభాలు) పన్ను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా ప్రకటించారు. ఏప్రిల్ నుంచి షేర్ల విక్రయాల నుంచి పొందిన లాభాలపై ఈ పన్ను విధించనున్నట్లు వెల్లడించారు. దీర్ఘకాలిక మూలధన లాభాలపై 10 శాతం పన్ను విధింపును కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్లో ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. వాస్తవ కొనుగోలు ధర లేదా 2018 జనవరి 31నాటి గరిష్ట ధర ఆధారంగా మూలధన లాభాల్ని లెక్కించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. 2018 ఫిబ్రవరి 1 మార్చి 31 మధ్య జరిపే లావాదేవీల లాభంపై ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 10 క్లాజ్ 38 కింద మినహాయింపు వుంటుందని ప్రభుత్వం వివరించింది. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఎల్‌టిసిజి పన్నును మళ్లీ ప్రవేశపెట్టింది. ఈ కారణంగా స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.

పతనం పన్ను వల్ల కాదు

రూ. లక్షకు పైబడ్డ ఈక్విటీ లాభాలపై 10శాతం ఎల్‌టిసిజి పన్ను ప్రకటనతో దేశీయ స్టాక్‌మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. అయితే ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలకు ఎల్‌టిసిజి పన్ను కారణం కాదని హస్ముఖ్ అదియా అంటున్నారు. బలహీనమైన అంతర్జాతీయ సంకేతాల వల్లే ఈక్విటీ మార్కెట్లు పతనమయ్యాయని అన్నారు. అంతర్జాతీయంగా మార్కెట్లు పడిపోయిన సమయంలోనే ఎల్‌టిసిజి పన్ను నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, దీనివల్లే ఈక్విటీ మార్కెట్లు పతనమయ్యాయని అంతా భావిస్తున్నారని, అది వాస్తవం కాదని ఆయన వివరించారు. ప్రపంచంలోని అన్ని ఈక్విటీ మార్కెట్లకు బలమైన సంబంధాలుంటాయని అన్నారు. గతవారం ఈ మార్కెట్ల ఎంఎస్‌సిఐ సూచీ 3.4 శాతానికి పడిపోయింది. ముఖ్యంగా గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ మార్కెట్లు మరీ బలహీనంగా ఉన్నాయి. అయితే ఎంఎస్‌సిఐ పతనం ప్రభావం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా ఉందని అన్నారు.

అమ్మకాల ఒత్తిడితో నష్టాలు

● బడ్జెట్, అంతర్జాతీయ అంశాల ప్రభావం ● 310 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్



ముంబై: బడ్జెట్ అంశాల ప్రభావంతో బెంచ్‌మార్క్ సూచీలు నష్టాలను కొనసాగిస్తున్నాయి. బడ్జెట్ ప్రసంగంలో ప్రతిపాదించిన ఎల్‌టిసిజి(దీర్ఘకాలి పెట్టుబడి లాభాలు) పన్నుతో శుక్రవారం ట్రేడింగ్‌లో కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు.. సోమవారం కూడా అదే పరిస్థితిని కొనసాగించాయి. ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్షియల్ రంగాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు కుదేలయ్యాయి. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం, రేపటి నుంచి జరగబోయే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరపతి విధాన సమీక్ష కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 309.59 పాయింట్ల నష్టంతో 34,757.16 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 94.05 పాయింట్లు కోల్పోయి 10,667 వద్ద ముగిసింది. 352 పాయింట్లకు పైగా నష్టపోయిన బ్యాంక్ నిఫ్టీ 26,098 స్థాయికి పడిపోయింది. వచ్చే ఏడాది మేలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆఖరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఈనెల 1న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాలకు బడ్జెట్‌లో ఎక్కువగా ఖర్చు చేయడం, రైతులకు భరోసా ఇవ్వడంపై ఎక్కువగా దృష్టిపెట్టారు. అయితే ద్రవ్యలోటు లక్ష్యం, ఎల్‌టిసిజి పన్నులతో ఇన్వెస్టర్లలో ఆందోళనలు నెలకొన్నాయి. అదే సమయంలో గతవారం అమెరికా మార్కెట్ల పతనం, ఆసియా మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాలు సూచీలను నష్టాల వైపు నడిపించాయి. 14 నెలలుగా కొనసాగుతున్న ర్యాలీకి తాజాగా భారీ బ్రేక్ పడినట్టయింది. అన్ని రంగాలకు చెందిన స్టాక్స్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

ఆటోమొబైల్ సెక్టార్ 0.8 శాతం లాభపడగా.. ఎఫ్ఎంసిజి, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్, పిఎస్‌యు సెక్టార్లు నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లోని షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. స్మాల్‌క్యాప్ కూడా నష్టాల ట్రెండ్‌లోనే ఉండగా, మిడ్‌క్యాప్ మాత్రం గత ముగింపునకు చేరువలోనే ముగిసింది. మొత్తంగా రెండు సెషన్లలో సెన్సెక్స్ 1150 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీలో భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, హిందుస్తాన్ పెట్రోలియం, బాష్, పవర్ గ్రిడ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు హెచ్‌డిఎఫ్‌సి, ఎల్ అండ్ టి, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదాని పో ర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టపోయాయి.

5 శాతం లాభపడిన ఎయిర్‌టెల్

ఓ వైపు స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నప్పటికీ భారతీ ఎయిర్‌టెల్ మాత్రం ఎదురీది లాభపడింది. ఎయిర్‌టెల్ షేరు ధర 5 శాతం లాభాలను నమోదుచేసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో షేరు విలువ 4.98 శాతం పెరిగి రూ.443.40 వద్ద స్థిరపడింది. ఎయిర్‌టెల్‌లో 47.17 శాతం వాటా కలిగి ఉన్న సింగపూర్ టెలికమ్యూనికేషన్స్ (సింగ్‌టెల్) పేరెంట్ కంపెనీలో రూ.2,649 కోట్ల పెట్టుబడి పెట్టనుందనే వార్తల నేపథ్యంలో షేరు ధర రూ.446.75 చేరుకుంది. ఇంట్రాడేలో గరిష్టస్థాయిని నమోదుచేసింది. ప్రిఫరెన్షియల్ ఎలాట్‌మెంట్ పద్ధతిలో తమ అనుబంధ సంస్థ అయిన సింగ్‌టెల్ ఇన్వెస్ట్ చేయనుందనే విషయాన్ని ఎయిర్‌టెల్ యాజమాన్యం ప్రకటించింది. ఇందుకు షేర్ హోల్డర్ల అనుమతి పొందవలసి ఉందని, ఈ మొత్తాన్ని సంస్థ రుణ తగ్గింపునకు కేటాయించనున్నామని వెల్లడించింది.


11 రెట్లు పెరిగిన టాటా మోటార్స్ లాభం

క్యూ3లో నికర లాభం రూ.1,215 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయ అతిపెద్ద వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల్లో నికర లాభం రూ.1,215 కోట్లతో 11 రెట్లు పెరిగింది. గతేడాది ఇదే సమయంలో సంస్థ లాభం రూ.111.6 కోట్లుగా ఉంది. గ్రూప్ రెవెన్యూ కూడా 16 శాతం పెరిగి రూ.74,156 కోట్లు నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రెవెన్యూ రూ.63,933 కోట్లుగా ఉంది. ఈమేరకు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ వివరాలను వెల్లడించింది. విశ్లేషకుల అంచనాలను అధిగమించిలేక ఇన్వెస్టర్లను నిరాశపర్చింది. రూ.3,040 కోట్ల లాభాలను సాధించనుందని అంచనా వేయగా, ఈ స్థాయి ఫలితాలను ప్రదర్శించలేకపోయింది. వైడ్ మార్జిన్లు, జాగ్వార్ ల్యాండ్ రోవర్ బలహీనమైన అమ్మకాలు ఫలితాలను దెబ్బతీశాయి. అయితే దేశీయ వ్యాపారంలో ఆరోగ్యకరమైన పనితీరును నివేదించింది. ముఖ్యంగా కమర్షియల్ వెహికల్ విభాగంలో పటిష్టమైన పనితీరును కనబర్చింది. 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆపరేటింగ్ మార్జిన్లు 57.8 శాతం పెరిగి రూ .16,101.6 కోట్లకు పెరిగింది. ఇబిఐటిడిఎ వృద్ధిరేటు 77 శాతం క్షీణించి రూ.1,383 కోట్లు నమోదైంది. ఏకీకృత ఆపరేటింగ్ లాభం 80 శాతం వృద్ధితో రూ. 8,671 కోట్లుగా నమోదైంది. జెఎల్‌ఆర్(జాగ్వార్ ల్యాండ్ రోవర్) ఆపరేషన్లలో మెరుగైన పనితీరుతో టాటా మోటార్స్ లాభాలు పెరిగాయి. మూడో త్రైమాసికంలో జెఎల్‌ఆర్ రిటైల్ సేల్స్ మొత్తం 3.5 శాతం పెరిగాయి. టాటా మోటార్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ఈసారి సరైన వ్యూహంతో పనిచేశామని.. కమర్షియల్, ప్రయాణికుల వాహనాల వ్యాపారం మెరుగైన ఫలితాలను ఇచ్చిందని అన్నారు.

నగల వ్యాపారి నీరవ్ మోడీపై సిబిఐ కేసు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు సంబంధించిన మోసం కేసులో ప్రముఖ నగల వ్యాపారి నీరవ్ మోడీపై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దాదాపు రూ.280 కోట్ల మోసం కేసులో ఆయన నిందితుడిగా ఉన్నాడు. నిరావ్ మోడీ దేశంలోని టాప్ డైమండ్ వ్యాపారుల్లో ఒకరు.. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పిఎన్‌బి)ను కోట్ల రూపాయల మేర మోసం చేశారని ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈమేరకు సిబిఐ కేసు నమోదు చేసింది. నిరావ్ మోదీ అనుమాన్సాద లావాదేవీలపై సిబిఐ విచారణ నిర్వహిస్తోందని పిఎన్‌బి వెల్లడించింది. బ్యాంకుకు సంబంధించి రూ.280 కోట్ల మోసం కేసులో భాగంగా ఆయనపై సిబిఐ అభియోగాలు మోపిందని సోమవారం అధికారు వెల్లడించారు. పిఎన్‌బి ఫిర్యాదు మేరకు సిబిఐ ఈ చర్యలు చేపట్టింది. కంపెనీ భాగస్వాములైన మోడీ, ఆయన సోదరుడు నిషాల్, భార్య అమీ, మెహల్ చినూభాయ్ చోక్సి బ్యాంకు అధికారులతో కుట్ర పన్నారని పిఎన్‌బి ఫిర్యాదు చేసింది. తద్వారా తమకు భారీ నష్టం వాటిల్లిందని బ్యాంకు ఆరోపించింది. ప్రభుత్వ అధికారి హోదాను దుర్వినియోగం చేసినందుకు గాను బ్యాంక్ అధికారి మనోజ్ హనుమత్, పదవీ విరమణ చేసిన డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ షెట్టీలపైనా సిబిఐ ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసింది. అవినీతికి పాల్పడినందుకు గాను గుర్తుతెలియని మరికొందరు అధికారులపైనా ఏజెన్సీ కేసు నమోదు చేసింది. జనవరి 29న ముంబై బ్రాంచ్ పిఎన్‌బి డిప్యూటీ జనరల్ మేనేజర్ అవినీష్ నెపాలియా సిబిఐకి ఫిర్యాదు చేశారు. కాగా బిలియనీర్ నిరావ్ మోడీ ఆస్తులపై దృష్టిపెట్టిన ఐటీ అధికారులు ఢిల్లీ, సూరత్, జయపూర్‌లోని ఆఫీసులపై జనవరి 31న దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. లండన్, న్యూయార్క్, లాస్ వెగాస్, హవాయి, సింగపూర్, బీజింగ్, మకావ్‌లోనూ, ఇండియాలో ముంబై , ఢిల్లీ నగరాల్లో సెలబ్రిటీ డైమండ్ జ్యుయలరీ స్టోర్స్ ఉన్నాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34757.16	–309.59	–0.88%
నిఫ్టీ	10666.55	–94.05	–0.87%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28960	30973.26	0.31%
ముంబై	29940	32021.39	0%
ఢిల్లీ	29350	31390.37	0.17%
కోల్‌కతా	28100	30053.48	0%
కేరళ	28100	30053.48	–0.35%
బెంగళూరు	28500	30481.28	0%
హైదరాబాద్	28900	30909.09	0.52%
గల్ఫ్	1412.08	1510.25	1.29%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42400.00	0.47
ముంబై	42600.00	42400.00	0.47
ఢిల్లీ	42600.00	42400.00	0.47
కోల్‌కతా	42600.00	42400.00	0.47
హైదరాబాద్	42600.00	42400.00	0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	360	విశాఖపట్నం	355
వరంగల్	362	చిత్తూరు	378
విజయవాడ	354	చెన్నై	385
గోదావరి	354	బెంగళూరు	370

ఆర్థిక అనిశ్చితితో మూడో ఫ్రంట్‌కు అవకాశం : అఖిలేశ్ యాదవ్



ముంబై : సమాజంలోని అన్ని వర్గాలపై ప్రభావాన్ని చూపే ఆర్థిక అనిశ్చితి వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిజెపికి వ్యతిరేకంగా మూడో ఫ్రంట్‌కు దారి తీసే అవకాశముందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్‌తో మైత్రీబంధం కొనసాగుతుందని, మిగతా ప్రతిపక్షాలతో మంచి సంబంధాలున్నాయని కూడా చెప్పారు. దీంతో పాటు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి)తో కూడా స్నేహపూర్వకంగా మెలుగుతున్నట్టు వివరించారు. 'దేశంలో ఇప్పుడు ఆర్థిక అనిశ్చిత నెలకొంటున్నది. దీంతో దేశం మొత్తం ఇప్పుడు గంగరగోళంతో ఉంది. బ్యాంకులు, రైతులు, వ్యాపారులు, యువత, వేతన జీవులు..ఇలా అన్ని వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ పరిస్థితితో వచ్చే ఎన్నికల నాటికి మూడో ఫ్రంట్ ఏర్పడే అవకాశాలున్నాయి' అని పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇక్కడ ముంబై హిందీ జర్నలిస్టుల అసోసియేషన్ సభ్యులతో ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి, పెద్ద నోట్ల రద్దు కారణంగా ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారని అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ సరిగా లేదని, ఇది సక్రమంగా ఉంటే ఆర్థిక విధానం బావుంటుందని అన్నారు. కాని ఇప్పుడు బ్యాంకులు ఆర్థిక ఇబ్బందులను ఎందుకు ఎదుర్కొంటున్నాయి? అని ప్రశ్నించారు.

కునాల్‌లో పురావస్తు తవ్వకాలు

చండీగఢ్ : హర్యానాలోని ఫతేహాబాద్ జిల్లా కునాల్ వద్ద హరప్పా నాగరికతకు కంటే ముందటి దాదాపు 5వేల సంవత్సరాల ప్రాచీనమైన ప్రాంతంలో కొత్తగా తవ్వకాలు ప్రారంభించారు. ఇక్కడ పురావస్తు తవ్వకాలు 1986లో ప్రారంభమయ్యాయని, అయితే పలుమార్లు వీటిని నిలిపివేశారని, తిరిగి ఇప్పుడు మొదలయ్యాయని అధికారులు తెలిపారు. జాతీయ మ్యూజియంల డైరెక్టర్ జనరల్ బిఆర్ మణి, హర్యానా పురావస్తు, మ్యూజియంల శాఖ (హెచ్‌ఎఎండి) డిప్యూటీ డైరెక్టర్ బనానీ భట్టాచార్యల ఆధ్వర్యంలో ఈ తవ్వకాలు ఆదివారం ప్రారంభమైనట్టు వారు ఒక ప్రకటనలో వివరించారు. జాతీయ మ్యూజియంలు, హెచ్‌ఎఎండిలతో పాటు భారతీయ పురావస్తు సొసైటీ (ఐఎఎస్) నిపుణులు కూడా ఈ తవ్వకాల్లో పాల్గొంటున్నారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో తవ్వకాలు కొనసాగించేందుకు హెచ్‌ఎఎండి, ఢిల్లీకి చెందిన ఐఎఎస్‌లు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

రూ.10 నాణెం మింగి బాలిక మృతి



నాసిక్ : పది రూపాయల నాణెం ఓ బాలిక పాలిట మృత్యువుగా మారింది. ఆటలాడుతూ పది నాణెంను మింగడంతో నాలుగేళ్ల పాప మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం మహారాష్ట్ర నాశిక్ నగర సమీపంలో ఉన్న చంద్రగిరి చోటు చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. తినడానికి ఏదైనా ఇవ్వమని షాలిని హెండ్గే (4) తన తల్లిని డిమాండ్ చేసింది. బాలిక కోరిక మేరకు ఆమె తల్లి పది రూపాయల కాయిన్ ఇచ్చి పక్క షాపుకు వెళ్లి ఏదైనా కొనుక్కోమని చెప్పినట్లు నాసిక్ రోడ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ పిఆర్ ధోకనే చెప్పారు. అయితే నాణెంతో బాలిక ఆడుతూ ఆడుతూ దానిని గొంతులో వేసుకుందన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే బాలిక తల్లిదండ్రులు స్థానిక ఆసుపత్రికి తరలించారని, పరిస్థితి తీవ్రంగా ఉండడంతో అక్కడి నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్లు ఆయన చెప్పారు. ప్రమాద కేసుగా నమోదు చేశామన్నారు.

సిబిఐ కస్టడీకి ఇంద్రాణి



న్యూఢిల్లీ : సంచలనం సృష్టించిన షీనా బోరా హత్యకేసులో ప్రధాన నిందితురాలైన ఇంద్రాణి ముఖర్జియా ప్రత్యేక కోర్టు సోమవారం రెండు రోజుల సిబిఐ కస్టడీకి పం పింది. ఐఎన్‌ఎక్స్ మీడియాకు సంబంధించిన ఓ కేసులో ఆమెకు సంబంధాలుండడంతో కోర్టు ఇంద్రాణికి సిబిఐ కస్టడీవిధించింది. ఇంద్రాణిని విచారించేందుకు మూడు రోజుల కస్టడీ కావాలని సిబిఐ కోరగా, సిబిఐ ప్రత్యేక జడ్జి రెండు రోజుల కస్టడీకి అనుమతించారు. అయితే ఈనెల 7 లోపు ఆమెను తీసుకురావాలని ఆదేశించారు. ఈ కేసులో ఉన్న ఇతర నిందితులతో పాటు ఇంద్రాణి కూడా ప్రశ్నించాల్సి ఉందని కేసు విచారణ సందర్భంగా దర్యాప్తు సంస్థ కోర్టుకు విన్నవించింది. అయితే గతంలో ఆమెను విచారించిప్పుడే మరోసారి కూడా కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరముందని చెప్పినట్లు వివరించింది.

కాస్‌గంజ్‌లో మళ్లీ ఉద్రిక్తత



కాస్‌గంజ్ : ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో సోమవారం మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రశాంతంగా ఉన్న కాస్‌గంజ్‌లో ఓ ప్రార్థనా మందిరం గేటుకు కొంతమంది దుండగులు నిప్పు పెట్టి పెట్టి కల్లోహాలు సృష్టించేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వెంటనే రంగంలోకి దిగి మంటలను ఆర్పినట్లు ఓ అధికారి చెప్పారు. ఈ ఘటనలో విధులపట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. అదే విధంగా ఇటీవల మత ఘర్షణలు జరిగిన ఈ ప్రాంతంలో మళ్లీ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరింపజేశారు. సోమవారం తెల్లవారు జామున నగరంలోని గంజ్‌దుద్వారా ప్రాంతంలో కొంత మంది సంఘ వ్యతిరేకులు ఓ ప్రార్థనా మందిరం గేటుకు నిప్పు పెట్టగా వెంటనే పోలీసులు రంగంలోకి దిగి మంటలను ఆర్పినట్లు ఎస్‌పి పీయూష్ శ్రీవాత్సవ చెప్పారు. శ్రీవాత్సవతో పాటు జిల్లా మేజిస్ట్రేట్ కూడా ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని చక్కబెట్టారు. ఎలాంటి కల్లోహాల తలెత్తకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున యుపి పోలీసు, పిఎసి సిబ్బందిని మొహరింప చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

మావోయిస్టు నేత ఆస్తులు జప్తు


న్యూఢిల్లీ : బీహార్ మావోయిస్టు కమాండర్‌కు చెందిన రూ.86 లక్షల విలువైన ఆస్తులను సోమవారం ఎన్‌ఫోర్స్‌మెట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. మనీ లాండరింగ్ వ్యతిరేక చట్టం కింద నేరస్థులపై చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. మణీలాండరింగ్ నిరోధక చట్టం కింద సందీప్ యాదవ్ అలియాస్ బద్కా భాయ్‌యా, అతని కుటుంబ సభ్యులకు చెందిన స్థిర, చర ఆస్తులను జప్తు చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ తాత్కాలిక ఉత్తర్వు జారీచేసింది. సందీప్ యాదవ్ నిషిద్ధ సిపిఐ (మావోయిస్టు) బీహార్–జార్ఖండ్ మధ్యజోన్ ప్రాంతీయ ప్రత్యేక కమిటీ ఇన్‌చార్జ్‌గా ఉన్నట్లు ఇడి పేర్కొంది. జప్తు చేసిన ఆస్తుల్లో బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా సందీప్ భార్య పేరు మీద ఉన్న మూడు ప్లాట్లు, గయాలో ఉన్న రెండు ప్లాట్లు, ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో సందీప్ అల్లుడు ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్‌గా ఇవ్వనున్న రూ.10.43 లక్షలు ఉన్నాయి. అదే విధంగా కొన్ని వాహనాలు, బ్యాంకు డిపాజిట్లను కూడా జప్తు చేసినట్లు ఇడి తన ఉత్తర్వులో వెల్లడించింది.

కన్నడిగుల ప్రతిష్ట దెబ్బతీశారు

బెంగళూరు : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కర్ణాటక గురించి అవాస్తవాలను మాట్లాడి రాష్ట్ర ప్రజల మనోభావాలను కించపర్చారని ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య అన్నారు. రాష్ట్రం గురించి అన్నీ అబద్ధాలే చెబుతూ కన్నడిగుల ప్రతిష్టను మోదీ దెబ్బతీశారని విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి బిఎస్ ఎడ్యూరప్పలపై విరుచుకుపడ్డారు. అమిత్‌షాకు ఓ హత్య కేసులో ప్రమేయం ఉందని, ఆయన కేవలం అబద్ధాలే చెబుతుంటారని సిద్ధరామయ్య అన్నారు. జైలుకు వెళ్లిన వ్యక్తినే కర్ణాటక ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆ పార్టీ ప్రతిపాదిస్తోందని విమర్శించారు. రాష్ట్రాలకు చాలా సొమ్ములిచ్చామంటూ ప్రధాని గొప్పలు చెప్పుకుంటున్నారని, అసలు ఆ సొమ్ము ఎక్కడదని ప్రశ్నించారు. అవన్నీ రాష్ట్రాలు పన్నులుగా వసూలు చేసి కేంద్రానికి పంపితే అవి మళ్లీ రాష్ట్రానికి వచ్చినవేనని వివరించారు.

ఆ రెండు బిజెపి ఆయుధాలు

● దేశంలో చీలిక, భయాందోళనల సృష్టి వాళ్ల పని ● రాజ్యసభలో కేంద్రంపై విపక్ష నేతల ధ్వజం



న్యూఢిల్లీ: బిజెపి దేశంలో చీలిక, భయాందోళనలు సృష్టిస్తోందని ప్రతిపక్షాలు సోమవారం రాజ్యసభలో విరుచుకుపడ్డాయి. పాత పథకాల ప్రయోజనాలు పేదలకు అందివ్వకుండానే వాటి పేర్లు మరుస్తోందని ఆరోపించాయి. బిజెపి ప్రభుత్వం నేమ్ చేంజరేగానీ గేమ్ చేంజర్ కాదని అన్నాయి. రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానం చర్చలో పాల్గొంటూ ప్రతిపక్ష నాయకుడు గులామ్ నబీ అజాద్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రభుత్వం కేవలం ప్రజల్లోనే కాక, ప్రభుత్వాధికారులు, ప్రతిపక్ష నాయకులలో కూడా భయాన్ని సృష్టిస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకులను ఉగ్రవాదులన్నట్లు చూస్తూ వారి ఫోన్లను ట్యాప్ చేస్తోందని ఆయన ఆరోపించారు. 'ఈ రోజు నాతో ఎవరూ ఫోన్లో మాట్లాడలేదు. పైగా నా ఫోన్ ట్యాప్ అయింది' అని ఆజాద్ సభలో ఆక్షేపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞత తీర్మానం చర్చలో భాగంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఎన్‌సిపి, వామపక్షాలు సహా ప్రతిపక్షాలు దాదాపు 324 సవరణలు ప్రతిపాదించాయి. అజాద్ తన ప్రసంగంలో 'ప్రభుత్వం దేశాన్ని చీల్చడమేకాదు, ప్రతిపక్షాలను కూడా చీలుస్తోంది. సిబిఐ, ఇడిలను ఉపయోగించి ప్రతిపక్షాల నాయకులను భయపెడుతోంది' అన్నారు. 'మీరు షియా, సున్నీలంటూ చీల్చారు. ఇప్పుడు భార్యాభర్తలను చీలుస్తున్నారు. మీరు దేశాన్ని చీల్చలేరు...అసలు మీదే వర్గం? మైనారిటీ వర్గాన్ని మీరెందుకు భయపెడుతున్నారు' అని ప్రశ్నించారు. కశ్మీర్‌కు ఎలాంటి స్పష్టమైన విధానాన్ని రూపొందించడంలేదన్నారు. ప్రభుత్వం జాతీయ ఆరోగ్య సంరక్షణ పేరుతో బీమా సంస్థలకు మేలు చేస్తుందే తప్ప సామాన్యులకు కాదని, 2022 నాటికల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానంటూ తప్పుడు వాగ్దానాలు చేస్తోందని విరుచుకుపడ్డారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా నివారణకు ఏమీ చేయడంలేదన్నారు. పేద వారి బ్యాంకు ఖాతాల్లో రూ. 15 లక్షలు వేస్తామని, 10 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చు కన్నా 50 శాతం ఎక్కువ కనీస మద్దతు ధర ఇస్తామని చెప్పిన ప్రభుత్వ అసంపూర్తి వాగ్దానాల గురిం చి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించలేదని కూడా గులామ్ నబీ అజాద్ విమర్శించారు.

ఒకే దేశం ఒకే ఎన్నికకు యోగి ఆదిత్యనాథ్ సిద్ధమా?

'బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన ఆయుష్మాన్ వైద్య బీమా పథకం ప్రజలకు అనుకూలం కాక, ప్రైవేట్ బీమా కంపెనీలకు అనుకూలం కానున్నాయి, పెట్రోలియం, డీజిల్ ధరలను రూ.9, రూ.7 మేరకు పెంచారని, పేదలకు రూ. 800కు ఒక్క గ్యాస్ సిలిండర్‌ను ఇస్తు న్నారు' అని సమాజ్‌వాది పార్టీ నేత నరేశ్ అగర్వాల్ అన్నా రు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే దానిని కూడా ఆయన ఖండించారు. యుపి సిఎం యోగి ఆదిత్యానాథ్ దానికి సిద్ధమా అనేది ప్రకటించాలన్నారు.

ఉమ్మడి జాబితాలో ఉన్న చట్టాలను మార్చుకునేందుకు అనుమతించాలని, అసెంబ్లీలు ఆమోదించిన సవరణలను కేంద్ర ప్రభుత్వం దీర్ఘ కాలం దగ్గర పెట్టుకుని కూర్చో రాదని ఎఐఎడిఎంకె నాయకుడు ఎ.నవనీతకృష్ణ అన్నారు. నేషనల్ ఎల్జిబిలిటీ–కమ్– ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)మీద తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన ఏకగ్రీవ బిల్లు ఇంకా కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉందన్న విషయా న్ని కూడా ఆయన ఈ సందర్భంగా ఉదాహరించారు.

నల్ల డబ్బు ప్రస్తావనేది? : వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి), పెద్ద నోట్ల రద్దు(డీమానిటైజేషన్) సామాన్యుడి నడ్డీ విరిచిందని తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి) నాయకుడు సుఖేందు శేఖర్ రే అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రధాని మన్‌కీ బాత్‌కు మరో రూపమే తప్ప వేరేమి కాదని కూడా అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగంలో నల్ల డబ్బు ప్రస్తావనే చేయలేదన్నారు.పనామా పేపర్స్‌లో 500 భారతీయుల పేర్లున్నాయి. పారడైజ్ పేపర్స్‌లో 900 పేర్లున్నాయి. వీరంతా భారతీయులే కానీ పారడైజ్‌కు చెందిన వారు కాదని చురకవేశారు. ఆ జాబితాలో వచ్చిన భారతీయులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలిపే శ్వేత పత్రాన్ని ప్రభుత్వం విడుదల చేయాలని కూడా శేఖర్ రే కోరారు.

ఓ ప్రక్క రైతుల ఆత్మహత్యలు పెరుగుతుంటే...

ఓ ప్రక్క రైతుల ఆత్మహత్యలు పెరుగుతుంటే మరో ప్రక్క వారి ఆదాయం రెట్టింపు చేయడానికి ప్రభుత్వం 2022 వరకు గడువు కోరుతోందని సిపిఐ(ఎం) నాయకుడు టి.కె. రంగరాజన్ విమర్శించారు.'మరో నాలుగేళ్ల ఆగితే ఆత్మహత్యలు మరిన్ని రెట్టు పెరుగుతుందని సర్వే చెబుతోంది' అన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు కావేరి మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయలేదని, తమిళనాడు రైతులు బాధలనుభవిస్తున్నారనివివరించారు.ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన అనేక ప్రాజెక్టులపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని టిడిపి నాయకుడు టి.జి.వెంకటేశ్ అన్నారు. బాలికల సమస్యను ఎన్‌సిపి నాయకుడు డి.పి. త్రిపాఠి లేవనెత్తారు. భారత్‌లో అవాంఛనీయ బాలికలు 2 కోట్ల 10 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు.

బిటి పత్తి ఉత్పత్తి రెట్టింపు

న్యూఢిల్లీ : 2002లో బీటీ పత్తిని ప్రవేశపెట్టాక దేశంలో పత్తి ఉత్పత్తి దాదాపు రెట్టింపు అయినట్లు ప్రభుత్వం రాజ్యసభకు సోమవారం నాడు తెలిపింది. కొన్ని రకాల తెగుళ్లను నివారించి ఉత్పత్తి పెంచడంలో హైబ్రిడ్ రకాలు సహాయపడినట్లు కేంద్ర మంత్రి మహేశ్ శర్మ రాజ్యసభలో తెలిపారు. జిఎం పంటల నియంత్రణ సంస్థ జీఈ అప్రైజల్ కమిటి (జిఇఎసి) సిఫార్సులపై ప్రస్తావన సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. జన్యుమార్పిడి జరిగిన ఆముదం ఉత్పత్తికి ఆ కమిటి చేసిన సిఫార్సుపై చర్చ జరిగింది. ఈ సిఫార్సును జిఎం వ్యతిరేక కార్యకర్తలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అనంతరం ప్రభుత్వం ఈ అంశాన్ని తిరిగి జిఈఎసికి నివేదించింది. ఎగువ సభలో ఈ అంశంపై మంత్రి లిఖితపూర్వక జవాబునిచ్చారు.

పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు తగ్గించింది 4 రాష్ట్రాలే..



న్యూఢిల్లీ : 2017 అక్టోబర్ నుంచి కేవలం నాలుగు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే పెట్రోల్, డీజిల్‌పై స్థానిక అమ్మకం పన్ను లేదా వ్యాట్‌ను కోత కోశాయి. ఈ రెండు ఇంధనాలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని కేంద్రం నిర్ణయించిన తరువాత వచ్చిన మార్పు ఇది. పెట్రోల్, డీజిల్ ధరలు గత మూడేళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగాక కేంద్రం ఆ నిర్ణయం తీసుకుంది. లోక్‌సభలో ఒక లిఖిత ప్రశ్నకు చమురుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఈ సమాచారం అందించారు. సుంకాన్ని తగ్గించిన రాష్ట్రాల పేర్లను ఆయన తెలుపలేదు. కానీ అవి మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ అని తెలుస్తోంది. అంతర్జాతీయ చమురు ధరలు తగ్గుతున్న ప్రభావాన్ని లేకుండా చేయడానికి కేంద్రం ఇంతవరకు తొమ్మిదిసార్లు పెట్రోల్ డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది.

పరీక్షలకు బాగా చదువుకోండి

వీరమరణానికి ముందు కుమారుడు, కూతురుకు జవాను సూచనలు

జమ్ము/అగర్తలా: రాజౌరి జిల్లాలో ఆదివారం పాక్ బలగాలు జరిపిన దాడిలో మరణించిన హవల్దార్ రోషన్ లాల్ చనిపోయే ముందు తన కుమారుడితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన తన ఫోన్‌లో ' పరీక్షలకు బాగా చదువు' అని కుమారుడికి చెప్పారు. 42 ఏళ్ల రోషన్ లాల్ జమ్ములోని సాంబ జిల్లాలోని ఘగ్‌వాల్ తహసీల్‌లోని నిచ్లా గ్రామానికి చెందినవారు. ఆయన 1995లో సైన్యంలో చేరారు. లాల్‌కు తండ్రి దేశ్‌రాజ్, భార్య ఆశా దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 'పాకిస్థాన్ చేస్తున్న పరోక్ష యుద్ధంలో లాల్ చనిపోయారు' అని ఆయన అన్న దర్శన్ కుమార్ చెప్పారు. పారా మిలిటరీ సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో ఆయన పనిచేస్తున్నారు. పాకిస్థాన్ పరోక్ష యుద్ధం కాకుండా నేరుగా యుద్ధం చేసి ఉంటే తన తమ్ముడు పాకిస్థాన్ సైన్యాన్ని ఊహించని స్థాయిలో దెబ్బతీసిఉండేవాడని ఆయన చెప్పారు. 'మా నాన్న ఆదివారం ఉదయం మా ఇద్దరిని ఫైనల్ పరీక్షల కోసం బాగా చదవండి' అని చెప్పారని సాంబ ఆర్మీ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న రోషన్ లాల్ కుమారుడు అభినందన్ చెప్పాడు. అతడి సోదరి ఆర్తిక 8వ తరగతిలో చదువుతోంది. రోషన్ మరణంపై ప్రజలు ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతున్నారు. పట్టలేని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా లాల్‌తో పాటు కాల్పుల్లో మరణించిన కెప్టెన్ కపిల్ కుందు మరి ఆరు రోజుల్లో తన



23వ పుట్టినరోజు జరుపోకోవాల్సి ఉండగా కాల్పుల్లో మరణించాడని ఓ సైనికాధికారి తెలిపారు. పాకిస్థానీల కాల్పుల్లో మరణించిన మరి ఇద్దరు జవానులను రామవతార్, శుభం సింగ్‌లుగా గుర్తించారు. భారత, పాకిస్థాన్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దులో, నియంత్రణ రేఖ వద్ద గత వారం రోజులుగా పాకిస్థాన్ బలగాలు పరోక్ష యుద్ధం చేస్తూ కాల్పులు జరుపుతున్నాయి. ఈ ఏడాది 12 మంది భద్రతా సిబ్బంది సహా 19 మంది పౌరులు మరణించారు. పాకిస్థాన్ బలగాలు చేస్తున్న భారీ బాంబుల దాడుల వల్ల సరిహద్దులోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాల్సి వస్తోంది. అనేక ప్రాంతాల్లో పాఠశాలలు కూడా మూసేశారు.

భారత్ సైన్యం దీటైన జవాబివ్వగలదు



పాకిస్థాన్ జరిపిన సీమాంతర కాల్పుల్లో నలుగురు సైనికులు మరణించడంపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు.'పాకిస్థాన్ జరిపే కాల్పులను నివారించే సత్తా భారత సైన్యానికి ఉంది. భారత్ సైన్యం దీటుగా జవాబివ్వగలదు. సరిహద్దులో పాక్ దళాల నుంచి ఒక్క బుల్లెట్ వచ్చినా,భారత్ తరఫు నుంచి లెక్కలేనన్ని బుల్లెట్లు సమాధానమిస్తాయని, అయితే పాకిస్థాన్‌పై రోజూ దాడులు చేసే ఉద్దేశం లేదు. వారితో శాంతియుత,సామరస్యపూర్వక సహజీవనాన్నే కోరుతున్నాం'అని ఆయన అగర్తలాలో అన్నారు. పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి నలుగురు సైనికులను హతమార్చడంపై భారత ఆర్మీ కూడా తీవ్రంగా స్పందించింది. ఇందుకు తగిన సమాధానాన్ని చేతల్లోనే చూపిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పి తీరుతామని, చేతల్లోనే బదులిస్తామని ఆర్మీ వైస్ చీఫ్ శరత్ చంద్ సోమవారం తెలిపారు.



సోమవారంనాడు రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్ అందాలను వీక్షిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు. మంగళవారం నుంచి గార్డెన్‌లోకి సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. దీంతో కొద్ది రోజుల పాటు అందులోని అరుదైన పుష్పాలను చూసే అవకాశం దక్కుతుంది.

జర్నలిస్టు భార్య సాహసం



లక్నో : ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ మహిళ తన భర్తపై దాడికి దిగుతున్న వారి నుంచి సినీ ఫక్కీలో కాపాడింది. రాజధాని లక్నోలో సోమవారంనాడు జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. కాకోరీ ప్రాంతానికి చెందిన అబిద్ అలీ జర్నలిస్టు. ఉదయం అలీ తన ఇంటి ముందు నిల్చుని మరో వ్యక్తితో మాట్లాడుతుండగా హఠాత్తుగా అక్కడికి వచ్చిన నలుగురు దుండుగులు అలీపై దాడికి దిగారు. ఒక వ్యక్తి రాడ్‌తో తలపై తీవ్రంగా కొట్టాడు. అలీ అరుపులు విన్న అతడి భార్య(వృత్తిపరంగా లాయర్) ఏదో ముప్పు జరిగివుంటుందని ముందే గ్రహించింది. ఏకంగా తుపాకీ చేత పట్టుకొని బయటికి వచ్చింది. వెంటనే దుండగులపైకి తుపాకీ గురిపెట్టి, కొన్ని రౌండ్లు కాల్పులు కూడా జరిపింది. దీంతో భయపడిపోయిన ఆ దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటన సిసిటివిల్లో రికార్డయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అయితే అలీపై ఎవరు దాడి చేశారన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు.

ఆ టూత్ పేస్టును మళ్లీ నమ్ముతారా?

మోడీపై ప్రకాశ్ రాజ్ పరోక్ష విమర్శలు



న్యూఢిల్లీ : విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సోమవారం సోషల్ మీడియాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై పరోక్షంగా విమర్శలు చేశారు. 'జస్ట్ ఆస్కింగ్' అంటూ కడిగిపారేసే ప్రకాష్ రాజ్ తాజాగా సరదాగా.. కాసింత వెటకారం గా ట్విటర్‌లో పోస్ట్ ఒకటి పెట్టారు. '2014లో ప్రామిస్ టూత్ పేస్ట్‌ను అమ్మేవారు. అప్పటి నుంచి నా దేశంలో నష్టాల్లో ఉన్న రైతులు, నిరుద్యోగులైన యువత ముఖాలపై చిరునవ్వు లేదు. మీరు ప్రామిస్ టూత్ పేస్ట్‌ని నమ్ముతారా.. నిన్న కర్ణాటక ర్యాలీలో మళ్లీ తీసుకొచ్చి అమ్మారు' అంటూ పొలిటికల్ సెటైర్ పేల్చారు ప్రకాశ్ రాజ్. ఆదివారం మోడీ కర్ణాటకలో పర్యటించారు. కాంగ్రెస్ కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఇపుడు కర్ణాటకలో పార్టీ ఎగ్జిట్ గేట్ వద్ద ఉందని, త్వరలోనే బిజెపి విజయభేరి మోగించనుందని మోడీ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ అన్నారు. ఈ పర్యటననుద్దేశించి ప్రకాష్ రాజ్ తాజా వ్యాఖ్యలు చేసినట్లు నెటిజన్లు భావిస్తున్నారు.

బిజెపి టూ మెన్ ఆర్మీ : శత్రుఘ్నసిన్హా

నర్సింగ్‌పూర్ : సొంతపార్టీపై తరచుగా విమర్శలు గుప్పించే బిజెపి ఎంపి శత్రుఘ్నసిన్హా సోమవారం తాజాగా ప్రభుత్వంపై, మంత్రుల వ్యవహారశైలిపై విమర్శలు చేశారు. ప్రభుత్వం ఒన్ మేన్ షో, పార్టీ టూ మేన్ ఆర్మీగా మారిందని పేర్కొన్నారు. 'మనమే కాదు, ఇతరులంతా కూడా ఇదే విధంగా అనుకుంటున్నారు. పార్టీ, ప్రభుత్వం సంయుక్తంగా నిర్ణయాలు తీసుకోవాల్సివుంది' అని సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు. బిజెపి ఇప్పుడు ప్రధాని మోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షాలతో టూ మెన్ ఆర్మీగా మారిందని విమర్శించారు. మంత్రులు కేవలం విగ్రహాలుగా మారారని, దేశంలో 80 శాతానికిపైగా ప్రజలకు వారెవరో కూడా తెలియదని అన్నారు.



ఆరు రోజుల పర్యటన కోసం భారత్‌కు నేపాల్ రాజు

భువనేశ్వర్: నేపాల్ చివరి రాజు జ్ఞానేంద్ర బీర్ బిక్రమ్ సాహ్ దేవ్ ఒడిశాలో బుధవారం నుంచి ఆరు రోజులపాటు పర్యటించనున్నారు. ఆయన తన పర్యటన సందర్భంగా 12వ శతాబ్దానికి చెంది న శ్రీ జగన్నాథ మందిరంలో ప్రత్యేక పూజ చేయనున్నారు. అలాగే సఖీగోపాల్ మందిరాన్ని కూడా ఆయన సందర్శించనున్నారని సమాచారం.నేపాల్‌కు ఒడిశాకు మధ్య గట్టి ఆధ్యాత్మిక సంబంధాలు న్నాయి. ఆది శంకరాచార్యులు జగన్నాథ్, పశుపతి మందిరాలు, నేపాల్ మధ్య క్రతువులు, ఆచారాలను నెలకొల్పారు. నేపాల్ పూరీ శంకరాచార్య వారి గోవర్ధన్ మఠ్ ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. నేపాల్ రాజు ఒడిశాకు రాగానే రథిపూర్‌లో గోశాల కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేస్తారు. ఫిబ్రవరి 8న భువనేశ్వర్‌లోని లింగరాజ మందిరాన్ని సందర్శించను న్నారు. ఫిబ్రవరి 9, 10 తేదీల్లో పూరీ జగద్గురు శంకరాచార్య పట్టాభిషేకం సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలకు ఆయన హాజరు కానున్నారు. జ్ఞానేంద్ర బీర్ బిక్రం సాహ్ దేవ్ 2001 నుంచి 2008 వరకు రాజుగా ఉన్నారు. కానీ నేపాల్‌లో ప్రజాతంత్రం వచ్చాక రాచరికం అంతరించిపోయిందన్నది తెలిసిన సంగతే.

పెళ్లి రోజూ లైవ్ రిపోర్టింగ్



కరాచీ : ఓ పాకిస్థాన్ జర్నలిస్టు పెళ్లి రోజు కూడా సెలవు పెట్టకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాడు. మరికొన్ని నిమిషాల్లో పెళ్లి జరుగుతుండగా బ్రేకింగ్ న్యూస్ అంటూ రిపోర్టర్‌గా అవతారమెత్తాడు. సిటీ 41 చానెల్‌లో పనిచేసే హనాన్ బుకారీ తన పెళ్లినే వార్తగా రిపోర్ట్ చేసి వార్తల్లోకెక్కాడు. తనకు కాబోయే భార్యను, వారి తల్లి తండ్రులు, అత్త, మామలను ఇంటర్వ్యూ చేశాడు. తన ది ప్రేమ పెళ్లని కూడా తెలియజేశాడు. ఈ జర్నలిస్టు మాట్లాడిన మాటలు ఇప్పుడు విస్తృతంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లి రోజు సైతం విధులు నిర్వర్తించడాన్ని కొందరు సమర్థిస్తే మరి కొందరు విమర్శలు కురిపించారు.

'సీపెక్' రూట్లో దాడుల ప్రమాదం!

భారత్‌పై పాకిస్థాన్ అనుమానం

ఇస్లామాబాద్: చైనా పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్(సీపెక్)ను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసేందుకు భారత్ ప్రణాళికలు రచిస్తోందని పాకిస్థాన్ ఆరోపించింది. సీపెక్ దారిలో దాడులు జరిగే అవకాశముందని హెచ్చరించింది. ఈ మేరకు పాక్ హోం మంత్రిత్వ శాఖ, గిల్గిత్‌బల్టిస్థాన్ హోంశాఖకు లేఖ రాసినట్లు సమాచారం. ఈ మేరకు పాక్‌లో ప్రముఖ మీడియా సంస్థ 'డాన్' ఆన్‌లైన్ సోమవారం వెల్లడించింది. కారాకోరమ్ హైవేలోని వంతెనలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో ఈ దాడులు జరగొచ్చని, ముందు జాగ్రత్త చర్యగా సీపెక్‌లో ముమ్మర భద్రతా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ఆ లేఖలో పేర్కొన్నట్లు డాన్ తెలిపింది. ఇందుకు గిల్గిత్ బాల్టిస్థాన్ ప్రభుత్వం కూడా స్పందించినట్లు తెలుస్తోంది. సీపెక్ మార్గంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అక్కడి ప్రభుత్వం పాక్ హోంశాఖకు తెలిపింది. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటుచేసినట్లు పేర్కొంది.

జపాన్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

టోక్యో : జపాన్‌లో సోమవారం నాడు సైనిక హెలికాప్టర్ కూలిపోయి కనీసం ఒక్క ఇల్లు మంటల్లో చిక్కుకుంది. నివాస ప్రాంతాల్లో ఆ హెలికాప్టర్ క్రాష్‌ల్యాండ్ అయింది. కన్‌జాకి పట్టణంలో జరిగిన ఈ ఘటనలో మృతుల వివరాలు తెలియలేదు. ఆ ప్రాంతంలో నల్లటి పొగ దట్టంగా ఎగజిమ్మడాన్ని టీవీలు చూపుతున్నాయి. ఆ ప్రాంతం నుంచి చాలా మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు సహాయక సిబ్బంది తరలిస్తున్నారు. మరోపక్క నీటిపంపులతో వారు మంటలతో పోరాడటం దృశ్యాలను న్యూస్ చానల్స్ చూపుతున్నాయి. రక్షణ మంత్రి జపాన్ సాగా ప్రాంతంలో రక్షణ కాప్టర్ కూలిపోవడాన్ని ధ్రువపర్చారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మన తెలంగాణ / హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న వరంగల్‌లో మహాధర్నాను నిర్వహించనున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.కరుణాకర్‌రెడ్డి చెప్పారు. మహాధర్నా పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వై.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2004 తరువాత నిమితులైన దాదాపు 1.40 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సిపిఎస్ పథకంలో ప్రతి నెలా ఉద్యోగులు జమచేసే డబ్బును ప్రభుత్వం మునిగిపోయే బ్యాంకులు, సంస్థలలో పెట్టుబడి పెడుతుందని, ఫలితంగా ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తరువాత ఆ డబ్బు తిరిగి చెల్లిస్తుందా అపనమ్మకం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చోరవ తీసుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ఆయన కోరారు. ఎస్‌టియు నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వహీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

'మాస్టర్ అరేటర్ కాంటెస్ట్–2'

మన తెలంగాణ / హైదరాబాద్ : ఏదైనా అంశంపై సమగ్ర అవగామనతో, తడబాటు లేకుండా ఆకట్టుకునేలా మాట్లాడడం చాలా గొప్ప విషయమని సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ పి.దిలీప్ అన్నారు. నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో'మాస్టర్ అరేటర్ కాంటెస్ట్–2' సత్యసాయి నిగమాగమంలో సోమవారం ఘనంగా జరిగింది. హైకోర్టు న్యాయవాది రవిప్రసాద్, నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ కె.పునిత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రవి ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ఆత్మవిశ్వాసం, మరెంతో ప్రతిభ ఉంటే తప్ప మంచి అరేటర్ కావడం సాధ్యం కాదని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తుందని కె.పునిత్ అన్నారు. 'మాస్టర్ అరేటర్ కాంటెస్ట్2' మూడు విభాగాల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

ఆర్‌టిసి ఎండికి 'స్ఫూర్తి' పురస్కారం

మన తెలంగాణ / హైదరాబాద్ : రోడ్డు భద్రతలో అతి తక్కువ ప్రమాదాల రేటు సాధించడం, ఇంధన పొదుపు, వాయు కాలుష్య నివారణకు బయో డీజిల్ వాడకం తదితర చర్యలను చేపట్టినందుకు టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావుకు సేవ్ లైఫ్ ఫౌండేషన్ 'స్ఫూర్తి' పురస్కారాన్ని ప్రకటించింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.శ్రీధర్, సలహాదారులు కె.విజయ్ బస్‌భవన్‌లో సోమవారం ఎండి రమణరావును శాలువాతో సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. కార్మికులు, అధికారుల సమిష్టి కృషితోనే ఆర్‌టిసి ప్రతిష్ట పెరుగుతున్నదని, జాతీయ స్థాయిలో సంస్థ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నదని, ఈ పురస్కారం వారికే చెందుతుందని జి.వి.రమణరావు ఈ సందర్భంగా అన్నారు. పురస్కారంతో సంస్థపై మరింత భాధ్యత పెరిగిందని, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే కాకుండా సిబ్బంది, కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



మాల్దీవుల్లో ఎమర్జెన్సీ

ముదిరిన రాజకీయ సంక్షోభం



మాలే: మాల్దీవుల్లో అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ 15 రోజులపాటు అత్యవసర స్థితి(ఎమర్జెన్సీ)ని విధించారు. ఆయన సహాయకుడు అజీమా షుకూర్ దీనిని ప్రకటించారు. అక్కడ రాజకీయ సంక్షోభం తీవ్రం కావడంతో ఈ అత్యవసర స్థితిని ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ చర్యతో అనుమానితులను అరెస్టు చేయడానికి, నిర్బంధించడానికి భద్రతా బలగాలకు అంతులేని అధికారాలు లభించాయి. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మధ్య ప్రతిష్టంభన ఏర్పడిన నేపథ్యంలో ఈ ఎమర్జెన్సీని ప్రకటించారు. తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని యామీన్ న్యాయమూర్తులకు మూడు లేఖలు పంపిన కొద్ది సేపటికే అత్యవసర పరిస్థితికి సంబంధించిన ప్రకటనను షుకూర్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారంలో చదివి వినిపించారు. యామీన్ అత్యవసర పరిస్థితిని ప్రకటించడం ఇది రెండోసారి. 2015 నవంబర్‌లో తనపై హత్యాయత్నం నెపంతో మొదటిసారి ఎమర్జెన్సీని ఇదివరలో ప్రకటించారు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన ప్రకటనను అధ్యక్షుడు పార్లమెంటుకు రెండు రోజుల్లో తెలపాలి, కానీ ప్రస్తుతం మాల్దీవుల పార్లమెంటును అధికారులు నిరవధికంగా రద్దు చేశారని సమాచారం. మాల్దీవుల పార్లమెంటులో మొత్తం 85 మంది సభ్యులున్నారు. యామీన్ పార్టీకి చెందిన 12 మంది ఎంపీలు ఆయనకు దూరమయ్యారు. దాంతో ప్రతిపక్షానికి బలంపెరిగింది. తొలగించిన ఆ 12 మంది ఎంపీలను సుప్రీంకోర్టు తిరిగి పదవుల్లో కొనసాగేలా ఆదేశాలిచ్చింది. దాంతో అధ్యక్షుడిపై అవిశ్వాసం పెట్టేందుకు మార్గం సుగమమైంది. కానీ ఈ నేపథ్యంలో మాల్దీవుల్లో ఇప్పుడు రాజకీయ సంక్షోభం పేరిట అత్యవసరస్థితిని ప్రకటించారు.

అంతర్జాతీయ జోక్యాన్ని కోరిన మాల్దీవ్స్ ప్రతిపక్షం

రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యామిన్ అనుసరించేలా ఒత్తిడి చేయాలని ప్రతిపక్ష నాయకులు సోమవారం నాడు అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. జైలు పాలైన తొమ్మిది మంది అసమ్మతి నాయకులను విడుదల చేయడానికి యామిన్ ప్రభుత్వం నిరాకరిస్తూ వస్తుంది. అలాగే, ప్రతిపక్ష ఎంపిలను తన పదవుల్లో తిరిగి నియమించాలని సుప్రీంకోర్టు గతవారం ఇచ్చిన ఉత్తర్వులు కూడా యామిన్ ప్రభుత్వం నిరాకరించి దేశాన్ని కల్లోలంలోకి నెట్టింది. తన ఉత్తర్వును అమలుపరచాలని ఆదివారం నాడు యామిన్‌ను సుప్రీంకోర్టు తిరిగి ఆదేశించింది. ప్రతిపక్ష నేతలపై రాజకీయ దురుద్దేశంతో జైల్లోకి నెట్టారు కాబట్టి వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. అయినప్పటికీ తాజా ప్రకటనలో సుప్రీంకోర్టు ఉత్తర్వును లక్ష్యపెట్టేది లేదని ప్రభుత్వం ప్రకటించింది. బందీలుగా ఉన్న రాజకీయ ఖైదీల్లో మాజీ అధ్యక్షుడు కూడా ఉన్నారు.

మన నక్షత్ర మండలం ఆవల అనేక గ్రహాలు



వాషింగ్టన్ : మన పాలపుంత గెలాక్సీ ఆవల అనేక గ్రహాల సముదాయాన్ని సైంటిస్ట్‌లు తాజాగా కనుగొన్నారు. నాసాకు చెందిన చంద్రా ఎక్స్‌రే పరిశోధనశాల సమాచారం విశ్లేషించగా, ఈ సంగతి వారికి తెలుసు. సూక్ష్మ లెన్స్‌లను ఉపయోగించి నక్షత్రమండలం ఆవల భారీ సంఖ్యలో గ్రహాలు గుమిగూడి ఉండడాన్ని వారు గ్రహించారు. ఇందుకు 'మైక్రోలెన్సింగ్' ప్రక్రియను శాస్త్రజ్ఞులు వాడారు. గురుత్వాకర్షణ శక్తి ద్వారా కాంతిని వంచి అన్వేషణ జరపడానికి మైక్రో లెన్సింగ్ ప్రక్రియను వాడుతారు. నాసా చంద్రా ఎక్స్‌రే అబ్జ్వటరీ రోదసీలోని ఒక టెలిస్కోపు. మన నక్షత్ర మండలం వెలుపల గ్రహాలను కనుగొనడం ఇదే తొలిసారి అని శాస్త్రజ్ఞుడు దాయ్ తెలిపారు.

భారతీయుడికి జాక్‌పాట్

అబుదాబి లాటరీలో రూ.17.5 కోట్లు



దుబాయ్ : భారత్ నుంచి బహిష్కరణకు గురైన ఒకరు అబుదాబిలో రూ.17.5 కోట్ల లాటరీని దక్కించుకుని మిలియనీర్ అయ్యారు. కేరళకు చెందినసునీల్ మప్పట్ట కృష్ణణ్ కుట్టీ నెయిర్ భారత్ నుంచి బహిష్కరణకు గురయ్యారు.అబుదాబిలో ఉంటున్న ఆయనకు రెండో అతిపెద్ద లాటరీ మొత్తం 10 మిలియన్ దిర్హాంలు (దాదాపు రూ.17,68,00,000) వరించినట్టు గల్ఫ్ న్యూస్ పేర్కొంది. కాగా, తన సహచరులు ముగ్గురితో కలిసి టికెట్ కొనుగోలు చేసిన ఆయన తనకు లభించిన ఈ మొత్తాన్ని ముగ్గురం సమాన భాగాలుగా పంచుకోనున్నట్టు తెలిపారు. అంతకు ముందు జనవరి 7న మొదటి భారీ మొత్తం 12 మిలియన్ దిర్హాంలను భారత్‌కు చెందిన వి.నెయిర్ గెల్చుకున్నట్టు గల్ఫ్ న్యూస్ వివరించింది.

అయ్యో పాపం.. పెళ్లి కొడుకులు

● బీహార్‌లో గతేడాది 3,400 మంది యువకుల కిడ్నాప్, బలవంతపు వివాహాలు



పాట్నా : బీహార్‌లో గత ఏడాది ఏకంగా 3,400 మంది యువకులు బలవంతపు వివాహాల కోసం అపహరణకు గురయ్యారు. స్థానికంగా 'పకడువా వివాహ్'గా పిలిచే ఈ దురాగతం బీహారంలో ప్రబలంగా ఉంది. 3,405 మంది యువకులు బలవంతంగా వివాహాలు జరిపేందుకు గాను అపహరణకు గురయ్యారు. ఇందులో చాలా మందికి తుపాకీని నుదుటికి ఎక్కుపెట్టి, కుటుంబ సభ్యులను హతమారుస్తామని భయపెట్టి బలవంతపు వివాహాలు జరిపించారు' అని ఓ పోలీసు అధికారి తెలిపారు. పాట్నాలోని ఓ గ్రామానికి చెందిన ఇంజినీర్‌ను కిడ్నాప్ చేసి గన్ చూపి భయపెట్టి, బలవంతంగా ఓ యువతితో వివాహం జరిపించారు. అనంతరం ఆ యువకుడు ఆమెను స్వీకరించడానికి విముఖత చూపిన వార్త గత నెలలో జాతీయ స్థాయిలో పతాక శీర్షికలకు ఎక్కింది. '2016లో 'పకడువా వివాహ్' కోసం 3,070 మంది యువకులు అపహరణకు గురయ్యారు. 2015లో 3 వేల మంది, 2014లో 2,526 మంది కిడ్నాప్ అయ్యారు. ఈ అన్ని ఘటనల్లో యువకులు లేదా వారి తల్లిదండ్రులను కిడ్నాపర్లు తుపాకులతో భయపెట్టి వివాహాలు జరిపించారు' అని పోలీసు అధికారి తెలిపారు. అయితే, పోలీసు రికార్డు మేరకు...ప్రతిరోజూ 9 మంది బలవంతపు వివాహాలకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు ఎక్కువవుతున్నందున దీన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసు యంత్రాంగం ఈ మాసంలో ప్రారంభమయ్యే 'లగాన్' (వివాహాల సీజన్)పై ప్రత్యేక దృష్టిని సారించాలని జిల్లాల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది.



సోము వీర్రాజుపై టిడిపి నేతలు మండిపాటు

అమరావతి: తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేసిన బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై టిడిపి నేతలు మండిపడుతున్నారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో గుంటూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మీడియాతో విడివిడిగా మాట్లాడారు. సోము వీర్రాజు బిజెపి కంటే వైసిపి నేతగానే ఎక్కువ పనిచేస్తున్నారని అంజనేయులు ధ్వజమెత్తారు. ఆయన మిత్ర ధర్మాన్ని మరిచి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోకపోతే సహించేది లేదని హెచ్చరించారు. స్వతంత్ర అభ్యర్థి కంటే తక్కువ ఓట్లు వచ్చిన వీర్రాజును తాము ఎమ్మెల్సీని చేశామన్నారు. వైసిపి నేతల తరహాలో మాట్లాడే బదులు ఆ పార్టీలో చేరి పోవాలని సూచించారు. కేసుల మాఫీ కోసం జగన్ పార్టీ పూర్తిగా కేంద్రం ముందు మోకరిల్లిందని, బడ్జెట్ బాగుందంటూ కేంద్రాన్ని ప్రశంసించడమే అందుకు నిదర్శనమని అన్నా రు. వైసిపికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలే ముఖ్యమని డొక్కా మాణిక్యవరప్రసాద్ ధ్వజమెత్తారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదన్న అక్కసును సోము వీర్రాజు టిడిపిపై చూపిస్తున్నారని ఆరోపించారు.

పార్లమెంట్‌లో ఎపి ఎంపిల ఆందోళన



ఢిల్లీ: కేంద్రం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై సోమవారం పార్లమెంటు బయటా.. లోపలా ఆందోళనలు కొనసాగాయి. విభజన చట్టం ప్రకారం తమ రాష్ట్రానికి దక్కాల్సిన హామీలు, ప్రయోజనాలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ తెలుగుదేశం ఎంపీలు పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి 'మాకు న్యాయం చేయండి.. ప్రధాని దీనిపై స్పందించాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో తోట నరసింహం, టీజీ వెంకటేశ్, శివప్రసాద్, రామ్మోహన్‌నాయుడు, నిమ్మల కిష్టప్ప, గల్లా జయదేవ్ సహా తెదేపా ఎంపీలందరూ పాల్గొన్నారు. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌లో అరకొర నిధులతో అభివృద్ధి సాధ్యపడదని.. అందుచేత కేంద్రం విరివిగా నిధులిచ్చి ఆదుకోవాలని ఎంపీలు కోరారు. విభజన హామీలు నెరవేర్చక పోతారా అని చూస్తుంటే.. నాలుగేళ్లుగా నిరాశే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్లమెంటులో పోరాడండి-ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంటు బయటా లోపలా తెలిసేలా నిరసన చేపట్టాలని తెదేపా అధినేత చంద్రబాబు పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. దిల్లీలో ఉన్న ఎంపీలతో ఆయన అమరావతి నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'రాష్ట్రానికి రావాల్సినవన్నీ సాధించుకునే విషయంలో రాజీలేదు. ఇస్తామన్నవి ఇవ్వడం లేదు, బడ్జెట్‌లోనూ పొందుపరచడం లేదు. నిధుల కేటాయింపు పూర్తిగా ఉండట్లేదు. ఇవన్నీ పార్లమెంటు, కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి' అని ఎంపీలకు సూచించారు. అన్ని హామీలు నెరవేర్చేవరకు పోరాటాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. మనకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తెలిసేలా చేయాలని సూచించారు.

రాజ్యసభలో కాంగ్రెస్..: విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు రాజ్యసభలో ఆందోళన చేపట్టారు. కేవీపీ రామచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. సభ కార్యకలాపాలకు అడ్డుతగలొద్దని, సభ నిర్వహణకు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యానాయుడు కాంగ్రెస్ సభ్యులను కోరినా ఫలితం లేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడంతో కేంద్రం విఫలమైందని సభ్యులు ఆరోపించారు. గందరగోళం నెలకొనడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యానాయుడు ప్రకటించారు.

8న లారీల సమ్మె!

అమరావతి: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2018 బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రజలు భగ్గుమంటున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 8న తలపెట్టిన బంద్‌కు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వర్ రావు ఈ విషయాన్ని ధృవీకరించారు. దీంతో 8వ తేదీన ఎక్కడి లారీలు అక్కడే నిలిచిపోనున్నాయి.

ఎపి ప్రజల కోసం పిచ్చివాడినయ్యా : కెవిపి

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు న్యాయంచేయాలంటూ ఈనెల 1వ తేదీన రాజ్యసభ వెల్‌లో ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తంచేస్తున్న తనకు పిచ్చిపట్టిందా? అంటూ రాజ్యసభ ఉపాధ్యక్షుడు పీజేకురియన్ వ్యాఖ్యానించడంపై కెవిపి రామచంద్రరావు విచారం వ్యక్తంచేశారు. అందుకు కారణాలను వివరిస్తూ ఆయన ఆదివారం కురియన్‌కు లేఖ రాశారు. ఎపి ప్రజల కోసం తాను పిచ్చివాడినయ్యానని పేర్కొన్నారు. సభలోని మిగతా సభ్యులు, కేంద్రంలో వివిధ హోదాల్లో ఉన్న వారు విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను నెరవేర్చే విషయంలో అదే పిచ్చితనంతో వ్యవహరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఏపీకి రాజ్యాంగ బద్ధంగా ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమై దేశ అత్యున్నత చట్టసభ నవ్వులపాలుకాకుండా పోరాడటమే తన ఉద్దేశమన్నారు.

కశ్మీరీలకు పాక్ మద్దతు

ఇస్లామాబాద్ : కశ్మీర్ అంశాన్ని పరిష్కరించకపోతే ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలు కేవలం కలగా మిగులుతాయని పాకిస్తాన్ సోమవారం నాడు ప్రపంచాన్ని హెచ్చరించింది. కశ్మీర్ లోయలో ప్రజలు స్వయం నిర్ణాయక హక్కు కోసం సాగిస్తున్న పోరాటానికి మద్ధతును పాక్ పునరుద్ఘాటించింది. కశ్మీర్ సంఘీభావ దినోత్సవ సందర్భంగా అధ్యక్షుడు మామునూన్ హుస్సేన్, ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ వేరువేరు ప్రకటనల్లో ఈ విధంగా పేర్కొన్నారు. ఆక్రమిత కశ్మీర్ ప్రజలకు రాజకీయ, నైతిక, ఆర్థిక, దౌత్య మద్దతును అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు అనుగుణంగా ఈ కృషి సాగాలని సూచించారు. ఏడు దశాబ్దాలు గడిచినా జమ్మూ కాశ్మీర్ ప్రజలకు ప్రాథమిక హక్కు అయిన స్వయం నిర్ణాయక సౌలభ్యం గగనకుసుమమైందని ప్రధాని పేర్కొన్నారు.

ఇకపై సొంత లోగోతో నేపాల్ తేయాకు ఎగుమతి

ఖాట్మండు : నేపాల్ తేయాకు ఎగుమతులపై పూర్వం నుండి వస్తున్న 'డార్జిలింగ్, ఇండియా' అనే లోగో ఇకపై కనపడదు. ఆ చోట సొంత గుర్తింపుతో నేపాల్ తేయాకును విదేశాల్లో అమ్ముతుంది. ఆ హిమాలయ దేశంలో 154 సంవత్సరాల క్రితం తేయాకు సాగు మొదలయ్యాక ఇలా జరగడం ఇదే ప్రథమం. నేపాల్ టీ అండ్ కాఫీ డెవలప్‌మెంట్ బోర్డు సుదీర్ఘకాలం కృషి చేశాక సొంత ట్రేడ్‌మార్క్‌ను, లోగోను సంపాదించుకుంది. తేయాకు ఉత్పత్తిలో పాలుపంచుకుంటున్న అనేక సంఘాలు ఈ కృషి సాధించాయి. పర్వతాల కింద హిమాలయ అని రాసి వున్నా ట్రేడ్‌మార్క్‌ను నేపాల్ సొంత చేసుకుంది.ఇంతకు ముందు డార్జిలింగ్ ఇండియా అనే పేరుతోనే నేపాల్ తేయాకు ఎగుమతి అయ్యేది.

శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత



శ్రీకాకుళం : శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమను ఎస్టీల జాబితాతో చేర్చాలంటూ మత్స్యకారులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని గిరిజనులు ధ్వంసం చేశారు. కలెక్టర్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వీలు లేదంటూ గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో గిరిజనులు శ్రీకాకుళంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. గత 57 రోజులుగా కలెక్టరేట్ వద్ద మత్స్యకారులు ఎస్టీల జాబితాలో చేర్చాలని రిలే దీక్షలు చేపడుతున్న శిబిరాన్ని గిరిజనులు ధ్వంసం చేసి కుర్చీలు, బ్యానర్లను తగులబెట్టారు. దీంతో ఆందోళనకర వాతావరణం నెలకొంది. మత్స్యకారులు, బోయ, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ ధనుంజయరెడ్డి జోక్యం చేసుకుని ఐక్యవేదిక ప్రతినిధులతో మాట్లాడారు. డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

గాయం బాధిస్తున్నా సెంచరీ కొట్టాడు..



న్యూఢిల్లీ: భారత యువ ఆటగాడు ఉన్ముక్త్ చంద్ అసమాన పోరాట పటిమతో అందరిని ఆకట్టుకున్నాడు. ఒక పక్క గాయం వెంటాడుతున్నా అంకితాభావంతో బరిలోకి దిగిన ఉన్ముక్త్ చంద్ అద్భుత సెంచరీతో అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. అతని అంకితభావానికి అభిమానులు నీరాజనం పలికారు. వివరాల్లోకి వెళితే.. దేశవాళి క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీకి సన్నాహకంగా ఆదివారం ఢిల్లీలో జరిగిన సాధన సందర్భంగా ఉన్ముక్త్ దవడకు తీవ్ర గాయమైంది. ఒక పక్క గాయం బాధిస్తున్నా ఉన్ముక్త్ ఢిల్లీ తరపున బరిలోకి దిగాడు. ఉత్తరప్రదేశ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఉన్ముక్త్ అసాధారణ పోరాట పటిమను కనబరుస్తూ కళ్లు చెదిరే సెంచరీని సాధించాడు. ఒకవేళ తీవ్ర గాయం వెంటాడుతున్నా ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఉన్ముక్త్ అంకితభావంతో ఆడుతూ సెంచరీ కొట్టాడు. చెలరేగి ఆడిన ఉన్ముక్త్ 125 బంతుల్లో 13 ఫోర్లు, మూడు సిక్సర్లతో 116 పరుగులు చేశాడు. దీంతో ఢిల్లీ ఆరు వికెట్ల నష్టానికి 307 పరుగుల భారీ స్కోరును సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ 252 పరుగులకే కుప్పకూలింది.

● విజేతలకు ఘన స్వాగతం

అండర్–19 ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టుకు సోమవారం ముంబయి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలోని భారత యువ జట్టు అసాధారణ ఆటతో విశ్వ కిరీటాన్ని సొంతం చేసుకుంది. టోర్నీలో ఆడిన అన్ని మ్యాచుల్లోనూ గెలిచిన భారత్ తన ఖాతాలో నాలుగో ప్రపంచకప్‌ను జమ చేసుకుంది. ప్రపంచంలో మరే జట్టు కూడా ఇన్ని సార్లు అండర్–19 ప్రపంచకప్ ట్రోఫీలు సాధించలేదు. కాగా, సోమవారం న్యూజిలాండ్ నుంచి భారత ఆటగాళ్లు ముంబయి చేరుకున్నారు. కెప్టెన్ పృథ్వీ షా, కోచ్ ద్రవిడ్‌తో పాటు శుభ్‌మన్ గిల్, ఇసాన్ పోరెల్, మన్‌జోత్ తదితరులు స్వదేశం చేరుకున్న వారిలో ఉన్నారు. కాగా, స్వదేశం చేరుకున్న భారత క్రికెటర్లకు ఊహించని ఘన స్వాగతం లభించింది. భారత క్రికెట్ బోర్డుతో పాటు ముంబయి క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా క్రికెటర్లకు పుష్పగుచ్ఛాలతో అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోచ్ ద్రవిడ్ కొద్ది సేపు మీడియాతో ముచ్చటించారు. సమష్టి పోరాటం వల్లే జట్టుకు విశ్వ కప్ప దక్కిందన్నారు. తన పర్యవేక్షణలో జట్టు ప్రపంచ చాంపియన్‌గా నిలువడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. పృథ్వీ షా కూడా అందరి సహకారం వల్లే విజయం దక్కిందన్నాడు. భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించేందుకు ఈ విజయం దోహదం చేస్తుందన్నాడు. ఎయిర్‌పోర్ట్ నుంచి క్రికెటర్లు బస్సులో బయలుదేరి వెళ్లారు. దారి పొడవున అభిమానులు వీరికి నీరాజనం పలికారు. కాగా, తమ అభిమాన క్రికెటర్లను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు.

-ముంబయి









అమ్మాయిలూ అదుర్స్

● భారత మహిళల శుభారంభం ● తొలి వన్డేలో సౌతాఫ్రికాపై ఘన విజయం

కిమ్‌బెర్లి: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత మహిళా జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి వన్డేలో భారత విమెన్స్ జట్టు 88 పరుగుల తేడాతో సౌతాఫ్రికా జట్టును చిత్తుగా ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన సౌతాఫ్రికాను 125 పరుగులకే కుప్పకూల్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టుకు ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. భారత బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీస్తూ దక్షిణాఫ్రికా బ్యాటర్లను హడలెత్తించారు. సీనియర్ బౌలర్ జులన్ గోస్వామి, శిఖా పాండేలు అద్భుత బౌలింగ్‌తో సౌతాఫ్రికా బ్యాట్స్ విమెన్‌లను కుదురుకోనివ్వలేదు. ముఖ్యంగా శిఖా పాండే నిప్పులు చెరిగే బంతులతో సౌతాఫ్రికా టాప్ ఆర్డర్‌ను హడలెత్తించింది. ఆమె ధాటికి ఓపెనర్ లిజెల్లి లీ, వన్‌డౌన్‌లో వచ్చిన త్రిషా చెట్టి, మిగ్నన్ డుప్రిజ్ పెవిలియన్ బాట పట్టారు. మరోవైపు ఓపెనర్ లౌరా వాల్‌వర్డ్ (21) పరుగులు చేసి పూనమ్ యాదవ్ బౌలింగ్‌లో వెనుదిరిగింది. ఒకవైపు వికెట్లు పడుతున్న కెప్టెన్ నికర్క్ పోరాటం కొనసాగించింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన నికర్క్ 41 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెకు మరిజానె కాప్ (23), సునె లూస్ 21 (నాటౌట్) అండగా నిలిచారు. చివర్లో గోస్వామి వెంటవెంటనే నాలుగు వికెట్లు తీయడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ 125 పరుగుల వద్దే ముగిసింది.

ఆదుకున్న మందన



అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు పూనమ్ రౌత్, స్మృతి మందన శుభారంభం అందించారు. ఇద్దరు ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. రౌత్ సమన్వయంతో బ్యాటింగ్ చేయగా, మందన తన మార్క్ షాట్లతో చెలరేగి పోయింది. రౌత్ (19) పరుగులు చేసింది. మరోవైపు కెప్టెన్ మిథాలీ రాజ్ అండతో మందన జోరును కొనసాగించింది. ఈ క్రమంలో రెండో వికెట్‌కు 99 పరుగులు జోడించింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన మందన 98 బంతుల్లో 8ఫోర్లు, ఒక సిక్స్‌తో 84 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిథాలీ రెండు ఫోర్లతో 45 పరుగులు సాధించింది. కాగా, చివర్లో దక్షిణాఫ్రికా బౌలర్లు రాణించడంతో భారత్ స్కోరు 213 పరుగులకే పరిమితమైంది. సౌతాఫ్రికా బౌలర్లలో కాప్ పది ఓవర్లలో 26 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టింది.

హైదరాబాద్ ఘన విజయం

మన తెలంగాణ/ హైదరాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సోమవారం జరిగిన గ్రూప్–డి మ్యాచ్‌లో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 128 పరుగుల తేడాతో సర్వీసెస్‌ను చిత్తు చేసింది. కెప్టెన్ అక్షత్ రెడ్డి (127) శతకంతో కదం తొక్కడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ ఐదు వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సర్వీసెస్ మహ్మద్ సిరాజ్ ధాటికి తట్టుకోలేక 201 పరుగులకే కుప్పకూలింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సర్వీసెస్‌కు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. మహ్మద్ సిరాజ్ అద్భుత బంతులతో సర్వీసెస్ బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించాడు. అతని దెబ్బకు ఓపెనర్లు లక్షన్ సింగ్ (4), నకుల్ వర్మ (7) ప్రారంభంలోనే పెవిలియన్ చేరారు. ఆ వెంటనే అమిత్ (6), నకుల్ శర్మ (2)లను కూడా సిరాజ్ ఔట్ చేశాడు. దీంతో సర్వీసెస్ మళ్లీ కోలుకోలేక పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ రాహుల్ సింగ్ ఒంటరి పోరాటం చేశాడు. హైదరాబాద్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న రాహుల్ 64 పరుగులు చేశాడు. మిగతావారిలో హార్దిక్ సేథి (38), సూరజ్ యాదవ్ (34), దివేష్ (22) మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నారు. హైదరాబాద్ బౌలర్లలో సిరాజ్ 45 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. రోహిత్, భండారీలకు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టును అక్షత్ అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. దూకుడుగా ఆడిన అక్షత్ 115 బంతుల్లోనే 10 ఫోర్లు, మూడు సిక్సర్లతో 127 పరుగులు సాధించాడు. చివర్లో వికెట్ కీపర్ కొల్ల సుమంత్ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. చెలరేగి ఆడిన సుమంత్ 26 బంతుల్లోనే నాలుగు భారీ సిక్సర్లు, మరో మూడు బౌండరీలతో 58 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆకాష్ భండారి కూడా వేగంగా 47 పరుగులు చేశాడు. దీంతో హైదరాబాద్



స్కోరు 329 పరుగులకు చేరింది.

సౌరాష్ట్ర జయభేరి

జింఖానా గ్రౌండ్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో సౌరాష్ట్ర 32 పరుగుల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. షెల్డన్ జాక్సన్ అద్భుత సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన జాక్సన్ 14 ఫోర్లు, రెండు సిక్సర్లతో 106 పరుగులు చేశాడు. సీనియర్ ఆటగాడు చటేశ్వర్ పుజారా 60 పరుగులు చేసి తనవంతు పాత్ర పోషించాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. వికెట్ కీపర్ మనోజ్ సింగ్ (58), విశాల్ (51), సాహెబాన్ ఖాన్ (40) రాణించినా జట్టును గెలిపించలేక పోయారు. కాగా, ఎఓసి గ్రౌండ్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో విదర్భ ఏడు పరుగుల తేడాతో జార్ఖండ్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ 300 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన జార్ఖండ్ 293 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

జట్టు ప్రయోజనాలే ముఖ్యం: రహానె



సెంచూరియన్: జట్టు అవసరాల కోసం ఏ స్థానంలో ఆడమంటే ఆడేందుకు తాను సిద్ధమేనని భారత స్టార్ బ్యాట్స్‌మన్ అజింక్య రహానె అన్నాడు. తనకు ఏ స్థానంలో ఆడిన సమ్మతమేనన్నాడు. ఓపెనర్‌గా అయినా మిడిలార్డర్‌లో అయినా సరే బ్యాటింగ్ చేసేందుకు తాను సదా సిద్ధమేనని స్పష్టం చేశాడు. జట్టు ప్రయోజనానికే తాను అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపాడు. కెప్టెన్ ఎలా కోరితే అలా ఆడేందుకు సిద్ధమన్నాడు. కాగా, తొలి వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడడం ఆనందంగా ఉందన్నాడు. వరుసగా రెండు మ్యాచుల్లో గెలవడంతో జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందన్నాడు. మిగతా మ్యాచుల్లో కూడా గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంటామని రహానె పేర్కొన్నాడు.

ఇక భారత్‌ను అడ్డుకోవడం కష్టమే..

● జోరుమీదున్న కోహ్లి సేన

మన తెలంగాణ/ క్రీడావిభాగం: తొలి రెండు టెస్టుల్లో స్వల్ప తేడాతో పరాజయం పాలైన టీమిండియా తర్వాత జరిగిన మూడో టెస్టులో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన విషయం తెలిసిందే. అయితే రెండు మ్యాచుల్లో ఓటమితో కోహ్లి సేనలో గెలిచి తీరాలనే పట్టుదల పెరిగింది. తమపై వస్తున్న విమర్శలకు ఆటతోనే సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో బ్యాట్స్‌మెన్, బౌలర్లు సమష్టిగా ముందుకు సాగారు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా తన పంథాను కొంత తగ్గించుకొని జట్టు ఎంపికలో ప్రతిభకు ప్రాధాన్యత ఇచ్చాడు. దీని ప్రభావం మూడో టెస్టులో స్ప ష్టంగా కనిపించింది. భువనేశ్వర్, అజింక్య రహానెల రాకతో జట్టులో సమతూకం ఏర్పడింది. తాను ఎంత కీలక ఆటగాడినో రహానె తన బ్యా ట్ ద్వారా సమాధానం చెప్పాడు. అదే విధంగా భువనేశ్వర్ కూడా ఇటు బంతితో అటు బ్యాట్ తో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. చివరి టెస్టులో భారత జట్టు అసమా న పోరాట పటిమను కనబరిచింది. అంతకు ముందు తమను హడలెత్తించిన సౌతాఫ్రికా బౌలర్లను దీటుగా ఎదుర్కొని గౌరవప్రద స్కోరు ను నమోదు చేసింది. జట్టును ముందుండి నడిపించడంలో కెప్టెన్ కోహ్లి పాత్ర వెలకట్టలేనిది. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో అతను సఫలమయ్యాడు. దీని ఫలితం స్పష్టంగా కనిపించింది. స్వల్ప లక్ష్యాన్ని సైతం కాపాడుకుని చివరి టెస్టులో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఈ విజయం భారత్ ఆట తీరునే మార్చి వేసింది. తర్వాత జరిగిన రెండు వన్డేల్లో టీమిండియాకు ఎదురేలేకుండా పో యింది. తొలి మ్యాచ్‌లో క్లిష్టమైన లక్ష్యాన్ని సైతం అలవోకగా ఛేదించింది. కెప్టెన్ విరాట్ కోహ్లి అద్భుత సెంచరీతో కదం తొక్కగా, సీనియర్ ఆటగాడు అజింక్య రహానె చిరకాలం గుర్తుండి పోయే ఇన్నింగ్స్ ఆడాడు. స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లు తొలి వన్డేలో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో జట్టుకు అండగా నిలిచారు. కాగా, తొలి వన్డేలో గెలిచిన ఉత్సాహంతో రెండో వన్డేలో భారత్ మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగింది. కెప్టెన్ డుప్లెసిస్ లేక పోవడంతో దక్షిణాఫ్రికా మరింత బలహీనంగా కనిపించింది. కొత్త కెప్టెన్ మార్‌క్రమ్ జట్టును ముందుండి నడిపించడంలో విఫలమయ్యాడు. భారత స్పిన్ ద్వయం చాహల్, కుల్దీప్ దూకుడు ముందు సౌతాఫ్రికా చేతులెత్తేసింది. చాహల్ ఐదు, కుల్దీప్ మూడు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను కోలుకోలేని దెబ్బ తీశారు. ఇక, స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయాన్ని అందుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లి మరోసారి అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టుకు అండగా నిలిచాడు. శిఖర్ ధావన్ కూడా అజేయ అర్ధ సెంచరీతో జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించాడు.

సిరీస్‌పై కన్ను...

వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచిన భారత్‌లో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. మిగిలిన వన్డేల్లోనూ గెలిచి దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్‌ను గెలుచుకోవాలని తహతహలాడుతోంది. డివిలియర్స్, డుప్లెసిస్‌లు లేక పోవడంతో దక్షిణాఫ్రికా ఆత్మరక్షణలో పడింది. ఇద్దరు కీలక ఆటగాళ్లు లేకుండా దక్షిణాఫ్రికా వన్డేల్లో బరిలోకి దిగడం తొమ్మిదేళ్లలో ఇదే తొలిసారి. కాగా, టీమిండియా మాత్రం జోరుమీదుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్‌కు ఎదురులేకుండా పోయింది. బౌలర్లు అసాధారణ రీతిలో చెలరేగి పోతున్నారు. బ్యాట్స్‌మెన్ కూడా మెరుగైన ఆటతో ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన వన్డేల్లో విజయం సాధించడం భారత్‌కు కష్టమేమి కాదు.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.